బుధవారం
24-9-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 04
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఏడు నెలల్లో ఏడు యుద్ధాలు ఆపా: ట్రంప్

న్యూయార్క్: ఏడాది క్రితం అమెరికా తీవ్ర ఇబ్బందుల్లో ఉందని, తన పాలనలో పరిస్థితుల్లో మార్పు వచ్చిందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. తమ దేశానికిది స్వర్ణయుగమని పేర్కొన్నారు. ఏ దేశమూ తమ దరిదాపుల్లో లేదని వ్యాఖ్యానించారు. ఐరాస జనరల్ అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగిస్తూ... కేవలం ఏడు నెలల్లో ప్రపంచవ్యాప్తంగా ఏడు యుద్ధాలను ఆపానని, అందులో భారత్-పాకిస్థాన్ ఒకటని చెప్పారు. "ఏడు నెలల్లో ఏడు యుద్ధాలు ఆపాను. అవి ఎన్నటికీ ముగియనవని భావించారు. కొన్ని 31ఏళ్లుగా కొనసాగగా.. ఒకటి 36 ఏళ్లుగా సాగింది. అన్ని యుద్ధాల్లోనూ వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు" అని ట్రంప్ పేర్కొన్నారు.

లిమ్కా రికార్డ్స్‌లో జుబీన్‌గర్గ్ అంతిమయాత్ర

గువహతి: ప్రముఖ అస్సామీ గాయకుడు జుబీన్ గర్గ్‌ను (52) కడసారి చూసేందుకు లక్షల మంది అభిమానులు గువహతికి తరలివచ్చారు. స్థానిక అర్జున్ భోగేశ్వర్ బారువా స్పోర్ట్స్ కాంప్లెక్స్ జనసంద్రమైంది. భారీగా తరలివచ్చిన అభిమానులు ఎండ, వానను సైతం లెక్క చేయకుండా జుబీన్ చిత్రాలు, కటౌట్ పట్టుకుని, ఆయన పాడిన పాటలు పాడుతూ నివాళులర్పించారు. మరోవైపు జుబీన్ గర్గ్ అంతిమయాత్ర రికార్డు సృష్టించింది. ప్రముఖుల అంతిమయాత్రలో ప్రజలు, అభిమానులు పాల్గొనడం

- మిగతా 2 లో

పసిడి దూకుడు

న్యూఢిల్లీ: బంగారం ధర రోజురోజుకు రికార్డు స్థాయిలో దూసుకెళ్తోంది. తాజాగా ఢిల్లీలో మరో రూ.2 వేలకుపైగా పెరిగి రూ.1,18,900 లకు చేరుకుంది. ముందు రోజు రూ.1,16,000గా నమోదైన బంగారం ధర మరుసటి రోజుకే రికార్డుస్థాయికి చేరింది. అటు వెండి కూడా భారీగా పెరిగింది. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం ఢిల్లీ మార్కెట్‌లో కిలో వెండి రూ.1,39,600కు చేరుకుంది. ఓవైపు డాలరుతో రూపాయి విలువ కనిష్ఠ స్థాయికి పడిపోవడం, హెచ్-1బీ వీసా రుసుము పెంపు నేపథ్యంలో బంగారం ధర సరికొత్త రికార్డు సృష్టిస్తోంది. బంగారమే పెట్టుబడులకు కీలకంగా భావించడంతో ధరలు పెరుగుతున్నాయి.

నేడు పట్నాలో సీడబ్ల్యూసీ భేటీ

న్యూఢిల్లీ: బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న తరుణంలో స్వాతంత్ర్యం తర్వాత బీహార్‌లో తొలిసారిగా కాంగ్రెస్ బుధవారం ఇక్కడ తన వర్కింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించనుంది. ఈ సమావేశం ఎన్నికల వ్యూహాన్ని రూపొందించడం, ముఖ్యంగా 'ఓట్ల దొంగతనం' లేదా ఎన్నికల మోసం ఆరోపణల నేపథ్యంలో బీజేపీపై దాడులను తీవ్రతరం చేయడంపై దృష్టి సారించనుంది. సమావేశంలో పార్టీ ముఖ్యమంత్రులు, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షులు, సీఎల్‌పీ నాయకులతో పాటు శాశ్వత, ప్రత్యేక ఆహ్వానితులు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఏంది గురూగారూ..ఈ అన్యాయం ఏం చేయాలి మనం? అక్కడికెళ్ళి దెబ్బలు తినాలా? బతకాలా, వద్దా?

జీఎస్‌టీ కౌన్సిల్

బీజేపీ జేబు సంస్థ

- మండలి స్వతంత్రతను దెబ్బతీస్తున్న కాషాయపార్టీ
- ప్రజానుకూల ప్రగతిశీల పన్ను విధానాలు అవశ్యం
- పార్టీ శ్రేణుల ప్రచారోద్యమానికి సీపీఐ పిలుపు

(చండీగఢ్ నుంచి ఏబీ కూన)

జీఎస్‌టీ 2.0 పేరుతో వస్తువులు, సేవల పన్ను (జీఎస్‌టీ) విధానంలో చేపట్టిన సంస్కరణలు 'మోదీ ప్రభుత్వం చేసిన మరో దగా'గా భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అభివర్ణించింది. జీఎస్‌టీ మండలి ఒక స్వతంత్ర సంస్థ అని చెప్పుకుంటున్న ప్రభుత్వం... ఇప్పుడు దాన్ని బీజేపీ జేబు సంస్థగా మార్చివేసిందని విమర్శించింది. పైగా జీఎస్‌టీ ప్రయోజనాల పేరుతో ఒక మతానికి చెందిన పండుగ సందర్భంగా బొనంజా ప్రకటించామని చెపుతూ... దీన్ని ఒక మత సమస్యగా మార్చివేసిందని దుయ్యబట్టింది. అసలు జీఎస్‌టీ మండలి స్వతంత్ర సంస్థా... కాదా తేల్చిచెప్పాలని ఎన్‌డీఏ సర్కారును డిమాండ్ చేసింది. సంపన్నులకు పన్నులు, పేదలకు రక్షణ కల్పించేలా ప్రజానుకూల ప్రగతిశీల పన్ను విధానాలు ఉండాలని డిమాండ్ చేస్తూ ప్రచారోద్యమం నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సీపీఐ 25వ మహాసభ పిలుపునిచ్చింది. ఈ మేరకు మంగళవారం ప్రతినిధుల సభ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించింది. సురవరం సుధాకర్‌రెడ్డి నగర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఈ తీర్మానాలను సీపీఐ ఎంపీ సంతోష్‌కుమార్, పంజాబ్ నాయకులు నిర్మల్‌సింగ్ దలేవాల్ విడుదల చేశారు. ఇటీవల జీఎస్‌టీలో చేసిన మార్పుల వల్ల రూ.2.5 లక్షల కోట్ల వరకూ ప్రజలకు ప్రయోజనం లభిస్తుందని ప్రధాని మోదీ, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం విచిత్రంగా ఉందని సీపీఐ పేర్కొంది. అంటే గత 8 సంవత్సరాల కాలంలో రూ.2.5 లక్షల కోట్ల చొప్పున మొత్తం రూ.20 లక్షల కోట్ల మేరకు ప్రజల సొమ్మును ప్రభుత్వం దోపిడీ చేసిందని విమర్శించింది. పండుగ ఆదా అంటూ ప్రకటనలు చేసే బదులు... పండుగల సందర్భంగా ప్రజలను దోపిడీ చేసినందుకు సిగ్గుపడాలని సీపీఐ తన తీర్మానంలో అభిప్రాయపడింది. జీఎస్‌టీ 2.0 ఆర్థిక స్థిరత్వానికి తీవ్రముప్పుగా పరిణమించబోతున్నది.

పన్నుల వ్యవస్థను సరళీకృతం చేసే అంశం పక్కనబెడితే... శ్లాబుల వాస్తవీకరణ వార్షిక ఆదాయ పతనానికి దారితీస్తుంది. జీఎస్‌టీ పరిహార యంత్రాంగాన్ని తొలగించడంతో రాష్ట్రాల ఆర్థిక ఒడిదుడుకులన్నీ బయటపడుతున్నాయి. ఇది రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక స్థిరత్వానికి ఇబ్బందులు కలిగించి... చివరకు భారీగా అప్పులు తేవడానికి, ప్రజావసరాలపై నిధుల వ్యయం తగ్గుదలకు దారితీస్తున్నదని సీపీఐ పేర్కొంది. జీఎస్‌టీ 2.0 వల్ల పాక్షిక పాలనా సమర్థత మాత్రమే కనిపిస్తున్నదని, అదికూడా ద్రవ్య సుస్థిరత, ఆర్థిక సమానత్వం, సమాఖ్య సామరస్యతను పణంగా పెడుతున్నారని, అందుకే ఎలాంటి నష్టపరిహార యంత్రాంగాల్లేకుండా, ప్రగతిశీల పన్ను వ్యవస్థ, పారదర్శక పాలన ఉండాలని సీపీఐ డిమాండ్ చేసింది.

ప్రాథమిక హక్కుగా ఆరోగ్యం

- అందరికీ ఉచిత, నాణ్యమైన ఆరోగ్య వ్యవస్థ కావాలి
- విదేశీ మెడికల్ గ్రాడ్యుయేట్లను తక్షణమే గుర్తించాలి
- సీపీఐ 25వ జాతీయ మహాసభ డిమాండ్

2 లో

స్థానిక ఎన్నికల్లో స్వతంత్ర పోటీ అవశ్యం

కూనంనేని సాంబశివరావు

కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి నగర్ (చండీగఢ్): భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శత వసంతాల ఉత్సవాల ముగింపు సందర్భంగా తెలంగాణలోని ఖమ్మంలో భారీ సభను ఏర్పాటు చేస్తున్నట్లు సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. అందరిలో స్ఫూర్తి కలిగించే విధంగా 5 లక్షల మందితో సభను నిర్వహిస్తామని చెప్పారు. చండీగఢ్‌లో కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి నగర్ (రైతు భవన్)లో జరుగుతున్న సీపీఐ 25వ జాతీయ మహాసభలో భాగంగా మంగళవారం ముసాయిదా రాజకీయ తీర్మానం, నిర్మాణ, రాజకీయ సమీక్ష నివేదికలపై ప్రతినిధుల సభలో చర్చ ప్రారంభమైంది. చర్చలో కూనంనేని సాంబశివరావు పాల్గొంటూ సీపీఐ ప్రాతినిధ్యం, విస్తృతిని పెంచుకునేందుకు దేశవ్యాప్తంగా గ్రామ స్థాయి సర్పంచ్, వార్డు సభ్యుల నుంచి మున్సిపాలిటీల వరకు స్వతంత్రంగా పోటీ చేసేందుకు సిద్ధపడాలన్నారు. లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో పోటీకి ఇతర పార్టీలతో అవగాహనలుంటాయని, కానీ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి ఆ ఇబ్బందేమి ఉండదని చెప్పారు. వందేళ్ల కమ్యూనిస్టు పార్టీ చరిత్రలో అనేక మంది పార్టీ కోసం, దేశం కోసం ప్రాణాలను, కుటుంబాలను త్యాగం చేశారని, వారందరికీ సెల్యూట్ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం, పొన్నప్రవయలార్ పోరాటాలలో అనేక మంది పార్టీ కామ్రేడ్స్ అమరులయ్యారని, ఆ పోరాటాల ఫలితంగా అనేక సంస్కరణలు,

- మిగతా 2 లో



కృష్ణాకు మళ్లీ భారీ వరద

- ప్రకాశం బ్యారేజీ వద్ద 70 గేట్లు ఎత్తివేత
- 4.50 లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి...
- తీర ప్రాంతాలను అప్రమత్తం చేసిన అధికారులు
- నేడు మరో అల్పపీడనం: విపత్తుల శాఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వారం రోజులుగా ఎగువ రాష్ట్రాలలో, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా కృష్ణా నదికి మళ్లీ భారీగా వరద నీరు వస్తోంది. దీంతో ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి దిగువన గల ప్రకాశం బ్యారేజీ వరకు అన్ని గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి వరద క్రమేపీ పెరుగుతుండడంతో అధికారులు తీర ప్రాంతాలను అప్రమత్తం చేశారు. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి కూడా వరద కొనసాగుతోంది. శ్రీశైలం ప్రాజెక్టులోకి 3 లక్షల 70వేల క్యూసెక్కుల నీరు వచ్చి

- మిగతా 2 లో

గిరిజన దేవతల ఆలయ అభివృద్ధి ఓ భావోద్వేగం

- ఆదివాసీలు దేశానికి మూలవాసులు
- మేడారం కుంభమేళాకు కేంద్రం నిధులివ్వాలి
- రాతి కట్టడాలు చరిత్రకు సాక్ష్యాలు: రేవంత్

విశాలాంధ్ర - హైదరాబాద్/ములుగు : గిరిజన ఆరాధ్య దేవతలైన సమ్మక్క సారలమ్మల ఆలయ అభివృద్ధి అనేది కేవలం ఓ బాధ్యత కాదని, ఇది బాధ్యతతో కూడిన భావోద్వేగం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మేడారంలో మంగళవారం సీఎం పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ సమ్మక్క సారలమ్మ ఆశీస్సులతో ఆనాడు ఇక్కడి నుంచే తాను పాదయాత్ర మొదలుపెట్టానని గురుచేసుకున్నారు. ఆదివాసీలు ఈ దేశానికి మూలవాసులని, వారి అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. ఐటీడీఏ ప్రాంతాల్లో అదనంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేశామని, ఆదివాసీ, గిరిజనుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి ఎన్ని కోట్లయినా మంజూరు చేస్తామన్నారు. ఆదివాసీలను, పూజారులను, సంప్రదాయ కుటుంబాలను ఆలయ అభివృద్ధిలో భాగస్వాములను చేస్తున్నామని పేర్కొన్నారు. రాతి కట్టడాలు ఎప్పటికీ చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచిపోతాయని, అందుకే సమ్మక్క సారలమ్మ అభివృద్ధిలో రాతి కట్టడాలే నిర్మిస్తామన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా పనులు పూర్తి చేస్తామన్నారు. కుంభమేళాకు వేలకోట్లు ఇస్తున్న కేంద్రం...ఆదివాసీ కుంభమేళా

- మిగతా 2 లో

'గ్రూప్- 1 తీర్పు'పై హైకోర్టులో మరో అప్పీల్

విశాలాంధ్ర-హైదరాబాద్: గ్రూప్-1 జనరల్ ర్యాంకింగ్ లిస్ట్, మార్కుల జాబితాను రద్దు చేస్తూ ఇటీవల వెలువడిన తీర్పుపై హైకోర్టులో మరో అప్పీల్ దాఖలైంది. తెలంగాణలో గ్రూప్-1 ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థి ఒకరు ఈ అప్పీల్ దాఖలు చేశారు. జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు గతంలో ఇచ్చిన తీర్పును కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో సదరు అభ్యర్థి అప్పీల్‌ను సీజే ధర్మాసనం విచారణకు స్వీకరించింది. టీజీపీఎస్సీ కూడా అప్పీల్ దాఖలు చేశారని న్యాయవాది పేర్కొనగా... ఈ రెండు పిటిషన్లు కలిపి బుధవారం విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

గ్రూప్-1 మెయిన్ పత్రాల పునర్ మూల్యాంకనం చేయాలంటూ గతంలో సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చింది. టీజీపీఎస్సీ విడుదల చేసిన ర్యాంకుల లిస్టు

- మిగతా 2 లో

వెల్లువలా బహుళ జాతి సంస్థల పెట్టుబడులు

- మామిడి, నారింజ పండ్ల సాగు రైతులకు భారీ ప్రోత్సాహం
- రూ.3,745 కోట్ల పెట్టుబడులు... 1,518 మందికి ఉపాధి అవకాశం
- మూడు కంపెనీలకు క్యాబినెట్ సబ్ కమిటీ ఆమోదం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



విశాలాంధ్ర-హైదరాబాద్ : యువతకు ఉపాధి, వివిధ రకాల పండ్ల సాగు చేసే రైతులకు ప్రోత్సాహం కలిగించే పద్ధతుల్లో బహుళ జాతి కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద ఎత్తున ఆసక్తి కనబరుస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి, క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో పరిశ్రమల ప్రోత్సాహక క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. మంత్రులు, క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అన్ని విధాలా ఆసక్తి చూపుతున్న జేఎస్‌డబ్ల్యూ యూఏవీ లిమిటెడ్ మహేశ్వరంలో కొత్త యూనిట్ ప్రారంభించడానికి, తోషిబా ట్రాన్స్మిషన్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం, గ్యాస్ ఇన్సులేటివ్ స్విచ్ గేర్, బుషింగ్స్ పరిశ్రమ ఏర్పాటుకు, హిందుస్థాన్ కోకా కోలా బేవరేజెస్ కంపెనీ

- మిగతా 2 లో

చుక్క నీరు వదులుకోం

- కృష్ణా జలాల్లో 70 శాతం వాటా కావాలి
- హక్కుల కోసం రాజీలేని పోరాటం
- అల్మట్టి ఎత్తుపై సుప్రీంకోర్టులో బలమైన వాదనలు: ఉత్తమ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా రావాలని కృష్ణా జలాల వివాదాల ట్రైబ్యునల్-2 ముందు తెలంగాణ వాదనలు వినిపిస్తోందని, 1050 టీఎంసీలలో దాదాపు 70 శాతం అంటే 763 టీఎంసీలను కేటాయించాలని మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఢిల్లీలో మంగళవారం తిరిగి ప్రారంభమైన కృష్ణ ట్రైబ్యునల్ విచారణల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కేసు చివరి దశకు చేరుకుందని, ఫిబ్రవరి నుంచి తుది వాదనలు వినిపిస్తున్నదని ఉత్తమ్ చెప్పారు. గత కొన్ని నెలలుగా సీనియర్ అడ్వకేట్ ఎస్.వైద్యనాథన్ వాదనలు వినిపిస్తున్నారని తెలిపారు. తెలంగాణకు జరిగిన చారిత్రక అన్యాయాన్ని సరిదిద్దే విధంగా కృషి చేస్తామని స్పష్టం చేశారు. కేడబ్ల్యూడీటీ-అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 1,005 టీఎంసీలు కేటాయించిందని గుర్తు చేశారు. వీటిలో 811 టీఎంసీలు 75శాతం... 49 టీఎంసీలు 65శాతం డిపెండబిలిటీ.. 145 టీఎంసీలు సగటు ప్రవాహాల ఆధారంగా కేటాయించబడ్డాయి. అదనంగా గోదావరి డైవర్షన్ ద్వారా 45 టీఎంసీలు ఇచ్చారు. మొత్తంగా 1,050 టీఎంసీలు కేటాయించబడ్డాయి. సగటు ప్రవాహాల కంటే ఎక్కువగా వచ్చే నీటిని వినియోగించుకోవచ్చని స్వేచ్ఛ ఇచ్చారు. 2014లో తెలంగాణ విభజన తర్వాత ఇప్పుడు కొత్తగా బేసిన్ పారామీటర్ల ఆధారంగా వాటా కోరుతోందని ఉత్తమ్ తెలిపారు. సగటు ప్రవాహాలపై మిగిలిన అదనపు నీటిని వినియోగించే స్వేచ్ఛ కూడా తెలంగాణదేనని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ తనకు కేటాయించబడిన 811 టీఎంసీల్లో పెద్ద భాగాన్ని బేసిన్ వెలుపలికి మళ్లించిందని ఆయన విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ ఇలాంటివి ఆపాలని, బదులుగా ప్రత్యామ్నాయ వనరులను వినియోగించాలని ట్రైబ్యునల్ ముందు తెలంగాణ విన్నవించుకుందని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం 299 టీఎంసీలను తెలంగాణకే కేటాయిస్తూ, 512 టీఎంసీలను ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన ఒప్పందానికి అంగీకరించడం రైతులకూ, కరవు ప్రాంతాలకూ

- మిగతా 2 లో

పారాసెటమాల్ వాడకం సురక్షితమే

- ఆటిజం వస్తుందన్న ట్రంప్ వ్యాఖ్యలు నిరాధారం
- భారత వైద్యనిపుణుల స్పష్టీకరణ

న్యూఢిల్లీ: గర్భధారణ సమయంలో పారాసెటమాల్ వాడితే పిల్లల్లో ఆటిజం వచ్చే ప్రమాదం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపాయి. అయితే ఈ వ్యాఖ్యలను ప్రముఖ ఆరోగ్య నిపుణులు తీవ్రంగా ఖండించారు. పారాసెటమాల్ వాడకానికి, ఆటిజానికి మధ్య సంబంధం ఉందని చెప్పడానికి ఎలాంటి బలమైన శాస్త్రీయ ఆధారాలు లేవని వారు స్పష్టం చేశారు. గర్భిణులు ఈ విషయంలో అనవసరంగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సోమవారం శ్వేతసౌధంలో జరిగిన ఒక కార్యక్రమంలో డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ.. గర్భిణులు పారాసెటమాల్ (ఎసిటమైనోఫెన్)కు దూరంగా ఉండాలని, నొప్పిని భరించాలే తప్ప మందులు వాడకూడదని వ్యాఖ్యానించారు. టైలనాల్ వంటి మందులు మంచివి కావని, తీవ్రమైన జ్వరం వస్తే తప్ప వాటిని తీసుకోకూడదని ఆయన సూచించారు. ఈ వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా గర్భిణులలో ఆందోళనలకు దారితీశాయి. ట్రంప్ వ్యాఖ్యలపై భారత వైద్య నిపుణులు స్పందించారు. దిల్లీలోని గురు తేగ్ బహదూర్ హాస్పిటల్ పీడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ మనీష్ నారంగ్ మాట్లాడుతూ.. "గర్భధారణ సమయంలో పారాసెటమాల్ వాడితే ఆటిజం వస్తుందన్న ట్రంప్ వాదనకు బలమైన శాస్త్రీయ ఆధారాలు లేవు. ఇప్పటివరకు జరిగిన అధ్యయనాలు పరిమితమైనవి, వాటి ఫలితాలు కూడా పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. ఇలాంటి నిరాధార ఆరోపణల వల్ల తల్లిదండ్రుల్లో అనవసర భయాలు నెలకొంటాయి" అని ఆయన వివరించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూటీఓ) మాజీ చీఫ్ సైంటిస్ట్, శిశువైద్య నిపుణురాలు డాక్టర్ సౌమ్య స్వామినాథన్ కూడా ఇదే అభిప్రాయం వెలిబుచ్చారు. పారాసెటమాల్ ఎన్నో ఏళ్లుగా సురక్షితమైన మందుగా నిరూపితమైందని, దాని వాడకంపై భయపడాల్సిన పనిలేదని ఆమె తెలిపారు. అమెరికన్ కాలేజ్ ఆఫ్ అబ్‌స్టెట్రిషియన్స్ అండ్ గైనకాలజిస్ట్స్ వంటి ప్రముఖ సంస్థలు కూడా గర్భధారణ సమయంలో సురక్షితమైన నొప్పి నివారిణిగా ఎసిటమైనోఫెన్‌ను సిఫార్సు చేస్తున్నాయి. మరోవైపు, గైనకాలజిస్ట్ డాక్టర్ అభా మజుందార్ మాట్లాడుతూ, "భయంతో చికిత్స మానేయడం సరికాదు. అదే సమయంలో, దీర్ఘకాలం పాటు అధిక మోతాదులో మందులు వాడటం వల్ల కలిగే నష్టాల పట్ల జాగ్రత్తగా ఉండాలి. గర్భధారణ సమయంలో జ్వరం లేదా నొప్పిని నిర్లక్ష్యం చేయడం కూడా బిడ్డ అభివృద్ధిపై ప్రభావం చూపుతుంది. కాబట్టి, అవసరమైనప్పుడు వైద్యుని సలహాతో సాధ్యమైనంత తక్కువ డోసులో, తక్కువ కాలం పాటు మందులు వాడటం ఉత్తమం" అని సూచించారు.

ఆందోళనలతో అట్టుడికిన ఇటలీ

పలస్తీనాకు వ్యతిరేకంగా ప్రధాని నిర్ణయంపై పెల్లుబికిన నిరసనలు

రోమ్: పలస్తీనా అనుకూల ఆందోళనలతో ఇటలీ అట్టుడికింది. పలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించాలంటూ చారిత్రక నగరం రోమ్ సహా దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసనలు హింసకు దారితీశాయి. పలస్తీనా జెండాలతో రోడ్లపైకి వచ్చిన ఆందోళన కారులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో నిరసన కారులు షాపుల అద్దాలను ధ్వంసం చేశారు. ఈ ఘర్షణల్లో 60 మంది పోలీసులు గాయపడ్డారు. 10 మంది ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తిస్తున్నామని ప్రకటించిన ఇటలీ... ఐక్యరాజ్యసమితిలో జరిగిన ఓటింగ్‌లో అనుకూలంగా ఓటు వేసింది. అయితే ఆ నిర్ణయాన్ని ప్రధాని జార్జియా మెలోని వెనక్కి తీసుకున్నారు. ప్రస్తుతానికి పలస్తీనాను అధికారికంగా గుర్తించకూడదని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చారు. 'అన్నిటినీ స్తంభింప చేయండి' అనే నినాదంతో ఆందోళనలకు దిగారు. రోమ్‌తోపాటు జనోవా, లివర్నో, ట్రీస్టే నగరాల్లోని ఓడరేవుల్లో కార్మికులు నిరసన తెలిపారు. వెనీస్ ఓడరేవు వద్ద ప్రదర్శన కారులను చెదరగొట్టడానికి పోలీసులు నీటి ఫిరంగు లను ఉపయోగించారు. బొలాంగాలో జాతీయ రహదారిని ఆందోళన కారులు దిగ్బంధించారు.

చైనా రక్షణరంగ శాస్త్రవేత్త అరెస్టు

బీజింగ్: ఆయుధ వ్యవస్థల కోసం సెమీకండక్టర్ చిప్‌లను అభివృద్ధి చేయడంలో ప్రత్యేకత కలిగిన ఒక అగ్రశ్రేణి చైనా శాస్త్రవేత్తను ఆ దేశ అవినీతి నిరోధక అధికారులు అరెస్టు చేశారు. చైనాలో కొంతకాలంగా కీలక వ్యక్తుల అరెస్టులు కొనసాగుతున్నాయి. తాజాగా అత్యున్నత శాస్త్రవేత్త యూ ఫాక్సిన్‌ను అరెస్టు చేసినట్లు ఆయనకు చెందిన కంపెనీ ఝిజియాంగ్ గ్రేట్ మైక్రోవేవ్ టెక్నాలజీ తెలిపింది. సెప్టెంబర్ 21న తమ కంపెనీ ఛైర్మన్ యూ ఫాక్సిన్‌ను హువాంగ్ని సూపర్‌వైజరీ కమిషన్ అదుపులోకి తీసుకున్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు హాంకాంగ్‌కు చెందిన సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ నివేదించింది. హాంగ్జౌలోని ఝెఝియాంగ్ విశ్వవిద్యాలయం యొక్క స్కూల్ ఆఫ్ ఏరోనాటిక్స్ అండ్ ఆస్ట్రోనాటిక్స్‌లో యూ ఫాక్సిన్ ప్రొఫెసర్‌గా కూడా పని చేస్తున్నారు. ఫాక్సిన్ మైక్రోవేవ్ అండ్ మిల్లీమీటర్ వేవ్ రేడియో ఫ్రీక్వెన్సీ టెక్నాలజీలో నిపుణుడు. కమ్యూనికేషన్, నావిగేషన్, రాడార్ టెక్నాలజీలో ఆయన పరిశోధనలు చేశారు. గాలియం నైట్రైడ్, గాలియం ఆర్సెనైడ్ సమ్మేళనాలతో సహా సెమీకండక్టర్ పదార్థాల కోసం ప్రాసెస్ టెక్నాలజీపై కూడా పనిచేస్తున్నారు. తాత్కాలికంగా ఆయన విధులకు అందుబాటులో ఉండరని ఆ సంస్థ ప్రకటించింది.

లిమ్కా రికార్డ్స్‌లో జుబీన్‌గర్గ్ అంతిమయాత్ర

(మొదటిపేజీ తరువాయి)

సర్వసాధారణమైనప్పటికీ... ఈ స్థాయిలో అభిమానులు రావడం చాలా అరుదు. మైఖేల్ జాక్సన్, పోప్ ఫ్రాన్సిస్, క్వీన్ ఎలిజెబెత్-2 అంతిమయాత్రల తర్వాత అత్యధికమంది పాల్గొన్న ఉత్తర క్రియగా లిమ్కా బుక్ ఆఫ్ రికార్డుల్లోకి ఎక్కింది. జుబీన్ అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో మంగళవారం ఉదయం పూర్తి చేశారు. గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య సహా పలువురు ప్రముఖులు జుబీన్‌కు నివాళుర్పించారు.

నేడు పట్నాలో సీడబ్ల్యూసీ భేటీ

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొంటారు. రాబోయే బీహార్ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించి... సమావేశంలో అనేక తీర్మానాలు ఆమోదించబడతాయని కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి. పట్నాలోని సదాకత్ ఆశ్రమంలో ఉదయం 10 గంటలకు సమావేశం జరగనుంది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సహా కాంగ్రెస్ అగ్ర నాయకులు హాజరవుతారు.

చుక్క నీరు వదులుకోం

(మొదటిపేజీ తరువాయి)

మోసం చేశారని ఉత్తమ్ అన్నారు. "దాదాపు పది సంవత్సరాల పాటు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆ ఒప్పందాన్ని అంగీకరించింది. అందుకే ఇప్పుడు ఆ ఫైలును మళ్లీ తెరిచి మొదటి నుంచి వాదనలు వినిపిస్తున్నాం. 299 టీఎంసీలు అంగీకరించిన గత ఒప్పందం, మేం కోరుతున్న 763 టీఎంసీల మధ్య వ్యత్యాసమే ఈ అన్యాయానికి నిదర్శనం" అని అన్నారు. జలశక్తి మంత్రిత్వశాఖలో ఆ ఒప్పందం నమోదైనప్పటికీ, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారికంగా తిరస్కరించిందని చెప్పారు. కర్నాటకలో కాంగ్రెస్ ఉన్నా, ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ ఉన్నా, మహారాష్ట్రలో బీజేపీ ఉన్నా... తెలంగాణ తన హక్కుల కోసం కఠినంగా పోరాడుతుంది. ఒక్క చుక్క నీళ్లను కూడా వదులుకోదు అని ధీమా వ్యక్తం చేశారు. అల్మట్టి ఆనకట్ట ఎత్తు పెంచే కర్నాటక యోచనను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. అలాంటి నిర్ణయం తెలంగాణకు నేరుగా నష్టం చేస్తుందని హెచ్చరించారు. దీనిని అడ్డుకోవడానికి సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపిస్తామని అన్నారు. తెలంగాణ వాటా తగ్గించే చర్య ఏదీ అనుమతించం. అల్మట్టి ఎత్తు పెంపు అనుమతించకుండా సుప్రీంకోర్టులో పోరాడతాం అని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ కేసుపై సమీక్ష సమావేశం నిర్వహించి, పూర్తి స్థాయి వాదనలు వినిపించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని ఉత్తమ్ తెలిపారు. ట్రిబ్యునల్ న్యాయమూర్తి బ్రిజేష్ కుమార్ నేతృత్వంలోని విచారణలో తెలంగాణకు న్యాయం జరుగుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. "డిపెండబుల్ అయినా, సగటు ప్రవాహాలు... అదనపు నీరు, గోదావరి డైవర్షన్లు అయినా తెలంగాణ తన హక్కు కోసం పోరాడుతుందని ఉత్తమ్ స్పష్టం చేశారు.

గిరిజన దేవతల ఆలయ అభివృద్ధి ఓ భావోద్వేగం

(మొదటిపేజీ తరువాయి)

మేడారం జాతరకు ఎందుకు నిధులు ఇవ్వడంలేదని నిలదీశారు. జాతీయ స్థాయిలో మేడారం జాతరకు గుర్తింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం సమ్మక్క సారక్కల గద్దెల అభివృద్ధి, ప్రాంగణ పునర్నిర్మాణం డిజైన్లను ముఖ్యమంత్రి విడుదల చేశారు.

ఆదాయం ఆశించి కాదు... భక్తితో పనిచేయాలి

ఆదాయం ఆశించి కాకుండా భక్తితో పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించి వివిధ అంశాలను ఆదివాసీ సంఘాలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను, విశ్వాసాలను పరిగణనలోకి తీసుకునే ఆలయ అభివృద్ధి ఉంటుందని సీఎం స్పష్టం చేశారు. సమ్మక్క సారలమ్మ ఆశీర్వాదంతో ప్రజాప్రభుత్వం ఏర్పడిందన్నారు. శాశ్వత ప్రాతిపదికన ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించామని వివరించారు. ఇది డబ్బులతో కొలిచేది కాదు... నమ్మకంతో కొలిచేదని, ఈ నమ్మకాన్ని మరింత పెంచేలా అభివృద్ధి ఉండాలన్నారు. వందరోజుల్లో అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా ప్రకృతి ఒడిలో ఉన్నట్టుగా సమ్మక్క సారలమ్మ ఆలయం ఉండాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా నిర్మాణాలు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. జంపన్న వాగులో నీరు నిల్వ ఉండేలా సాగునీటి పారుదల శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. తొలుత సీఎంతో పాటు మేడారం చేరుకున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, సలహాదారు వేం నరేందర్ రెడ్డితో కలిసి సమ్మక్క, సారలమ్మకు తులాభారం రేవంత్ రెడ్డి సమర్పించారు. అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ప్రాథమిక హక్కుగా ఆరోగ్యం

చండీగఢ్: ఆరోగ్యాన్ని తక్షణమే ప్రాథమిక హక్కుగా ప్రకటించాలని సీపీఐ డిమాండ్ చేసింది. మన దేశ సామాజిక, ఆర్థికాభివృద్ధికి ఉచిత, నాణ్యమైన ఆర్థిక సేవలు అత్యవసర మని, ఈ సేవలు అందరికీ అందా లని, ఇందుకోసం సమగ్ర యూనివ ర్సల్ హెల్త్‌కేర్ (యూహెచ్‌సీ) విధానాన్ని తక్షణమే అమల్లోకి తీసుకురావాలని కోరింది. అలాగే విదేశాల్లో చదువుకొని డిగ్రీ పట్టాలు పొందిన భారతీయ గ్రాడ్యుయేట్లను తక్షణమే గుర్తించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సీపీఐ 25వ జాతీయ మహాసభ ఏకగ్రీవ తీర్మానం చేసింది. భారతీయ ఆరోగ్య వ్యవస్థలో ప్రభుత్వ పెట్టుబడులు పూర్తిగా తగ్గిపోవడం ఆందోళనకరం. దీనిని ఆరోగ్య ప్రైవేటీ కరణ ప్రోత్సాహకంగా భావించాలి. ఆరోగ్యంపై ప్రభుత్వ వ్యయం జీడీపీలో రెండు శాతం కూడా లేదని, కేవలం ఆరోగ్య ఖర్చుల కారణంగానే యేటా 10 కోట్ల మంది ప్రజలు పేదరికంలోకి నెట్టబడుతున్నారని స్వయంగా నీతిఆయోగ్ విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. ఆరోగ్య సేవల రంగంలో కార్పొరేట్‌లకు మద్దతిస్తున్న ప్రభుత్వం... ఈ రంగంలో విదేశీవాటాలు పెంచడం మరీ దారుణమని సీపీఐ పేర్కొంది. పైగా శాస్త్రీయ వైద్యవిధానాన్ని పక్కనబెట్టిన ప్రభుత్వం... తమ హిందూత్వవాద విస్తరణలో భాగంగా మాయలు, మంత్రాలు, మూఢనమ్మ కాలతో బూటకపు శాస్త్రాన్ని ప్రచారం చేస్తూ, దేశాన్ని వేల సంవత్సరాల వెనక్కి నెట్టేస్తున్నదని విమర్శించింది. అందుకే, ఆరోగ్యాన్ని రాజ్యాంగంలో ప్రాథమిక హక్కుల్లో చేర్చాలని, ప్రజారోగ్య వ్యయాన్ని 2027 నాటికి జీడీపీలో మూడు శాతానికి పెంచి... ఆ తర్వాత మౌలిక వసతులు, మందులు, ఆరోగ్య పరీక్షలు, మానవ వనరులపై పెట్టుబడులు పెంచడం ద్వారా దాన్ని ఆరు శాతానికి పెంచాలని, ప్రాథమిక ఆరోగ్య సేవలను పటిష్టపరిచి... గ్రామీణ ఆరోగ్య మౌలిక సౌకర్యాలను ఆధునీకరించాలని సీపీఐ డిమాండ్ చేసింది. హెల్త్, వెల్‌నెస్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రులు, వైద్య కళాశాలల ప్రైవేటీకరణను తక్షణమే ఆపాలని, వినిమయ చార్జీలు రద్దుచేసి... విస్తృత సామాజిక ఆరోగ్య బీమా, ఉచిత అత్యవసర సేవలు అందించడం ద్వారా 2030 నాటికి రోగుల వ్యయాన్ని 10 శాతానికి కుదించాలని డిమాండ్ చేసింది. డాక్టర్లు, నర్సులు, స్పెషలిస్టుల కేటాయింపులో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య వైరుధ్యాన్ని తొలగించాలని, డిజిటల్ హెల్త్ విధానాన్ని ప్రోత్సహించాలని, వైద్య విద్యను ప్రభుత్వరంగంలోనే ఉంచాలని, శాస్త్ర, సాంకేతిక పరిశోధనలపై పెట్టుబడులు పెంచి... రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌ను ప్రభుత్వ రంగంలోనే నిర్వహించాలని డిమాండ్ చేసింది. కాగా, విదేశాల్లో చదువుకుంటున్న వైద్యవిద్యార్థులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ గుర్తించడం లేదు. అలాంటి వారిని గుర్తించాలని, తక్షణమే రిజిస్టర్ చేయాలని జాతీయ మెడికల్ కమిషన్ అన్ని రాష్ట్రాలకూ ఆదేశాలిచ్చిన ప్పటికీ... ఏపీ మెడికల్ కౌన్సిల్ తాత్సారం చేస్తున్నది. అలాంటి గ్రాడ్యుయేట్లు ప్రస్తుతానికి 1400-1500 మంది వరకు ఉన్నారు. వారందరినీ తక్షణమే గుర్తించాలని డిమాండ్ చేసింది. భారతీయులంద రికీ ఉచిత, నాణ్యమైన, అందరికీ సమానమైన ఆరోగ్యసేవలు అందేలా విశ్వజన ఆరోగ్య వ్యవస్థ కల సాకారమయ్యేలా ప్రజా ఉద్యమాలు, ప్రభుత్వాలు, పౌర సమాజంతో కలిసి పనిచేయడానికి సీపీఐ కట్టుబడి ఉందని తీర్మానించింది.

ఆ 23 గ్రామాల్లో స్థానిక ఎన్నికలపై 'సుప్రీం' స్టే

విశాలాంధ్ర-హైదరాబాద్: ములుగు జిల్లా మంగపేట మండల పరిధిలోని 23 గ్రామాల్లో స్థానిక ఎన్నికల నిర్వహణపై స్టే ఇస్తూ సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ గ్రామాలను గిరిజన గ్రామాలుగా పేర్కొంటూ గతంలో హైకోర్టు ప్రకటించడంపై ఆయా గ్రామాల గిరిజనేతరులు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మంగపేట మండలంలోని 23 గ్రామాలు గిరిజన పరిధిలో లేవని 1950లో రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీనిపై 2013లో గిరిజన సంఘాలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా... నిజాం ఆర్డర్ ఆధారంగా గిరిజన గ్రామాలుగా పరిగణించాలని తీర్పు ఇచ్చింది. రాష్ట్రపతి ఉత్తర్వులను పక్కన పెట్టి... నిజాం ఇచ్చిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకోవడంపై స్థానికులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తమ గ్రామాలను గిరిజన గ్రామాలుగా పరిగణించవద్దని పిటిషన్‌లో పేర్కొన్నారు. 1950లో రాష్ట్రపతి ఇచ్చిన ఉత్తర్వుల్లో మంగపేట మండలంలో 23 గ్రామాలు లేవని గిరిజనేతరుల తరఫు న్యాయవాది విష్ణువర్ధన్ రెడ్డి కోర్టులో వాదనలు వినిపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతున్న వేళ స్టే ఇవ్వాలని కోరారు. దీంతో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం... హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించింది. మంగపేట పరిధిలోని 23 గ్రామాల్లో స్థానిక ఎన్నికలపైనా స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

వెల్లువలా బహుళ జాతి సంస్థల పెట్టుబడులు

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటుకు సబ్ కమిటీ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో ఈ మూడు భారీ కంపెనీల ఏర్పాటు ద్వారా రూ.3,745 కోట్ల పెట్టుబడులు, 1,518 మంది యువతకు ఉపాధి లభిస్తుందని మంత్రుల బృందం తెలిపింది. సుమారు రూ.2,398 కోట్లతో ఏర్పాటు చేస్తున్న కోకా కోలా బేవరేజెస్ పరిశ్రమతో 600 మందికి ఉపాధి లభిస్తుందని, రూ.785 కోట్ల పెట్టుబడితో వస్తున్న జేఎస్‌డబ్ల్యూ కంపెనీ ద్వారా 364 మందికి ఉపాధి లభిస్తుందని, రూ.562 కోట్ల పెట్టుబడితో వస్తున్న తోషిబా కంపెనీ ద్వారా 554 మందికి ఉపాధి లభిస్తుందని అధికారులు మంత్రులకు వివరించారు. కోకా కోలా వంటి కంపెనీల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో మామిడి, నారింజ సాగు చేసే రైతులకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం ఏర్పడుతుందని ఉప ముఖ్యమంత్రి భట్టి తెలిపారు. బేవరేజెస్ పరిశ్రమల ఏర్పాటుతో పెద్ద ఎత్తున ఉద్యాన పంటల ఉత్పత్తులు ఆయా కంపెనీలకు అవసరం అవుతాయని, తద్వారా రాష్ట్రంలో మామిడి, నారింజ వంటి ఉత్పత్తులకు డిమాండ్ ఏర్పడి రాష్ట్ర రైతులకు గణనీయంగా ఆదాయం సమకూరుతుందన్నారు. దావోస్‌తో పాటు వివిధ దేశాల నుంచి మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిన వివిధ కంపెనీలతో జరిగిన ఎంఓయూలు, విధి విధానాలపై క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు సమీక్షించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, కమర్షియల్ టాక్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ రిజ్వీ, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్, ఉప ముఖ్యమంత్రి స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అమెరికాకు భారత్ అత్యంత కీలక భాగస్వామి

మార్కో రూబియో కీలక వ్యాఖ్యలు

న్యూయార్క్: అమెరికాకు భారత్ అత్యంత ముఖ్యమైన భాగస్వామి అంటూ ఆ దేశ విదేశాంగ మంత్రి మార్కో రూబియో కీలక వ్యాఖ్యలు చేశారు. ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ 80వ సెషన్ సందర్భంగా మార్కో రూబియో.... భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌తో భేటీ అయ్యారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, రక్షణ, ఇంధనం, ఔషధాలు, కీలకమైన ఖనిజాలు వంటి కీలక రంగాలలో వ్యూహాత్మక సహకారాన్ని బలోపేతం చేయడంపై వీరు చర్చించారు. ఈ భేటీ అనంతరం మార్కో రూబియో 'ఎక్స్' వేదికగా ఓ పోస్టు పెట్టారు. అందులో భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్‌తో సమావేశం అయ్యానని పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ భేటీలో ఇరు దేశాల మధ్య వాణిజ్యం, రక్షణ, ఇంధనం, ఔషధాలు, కీలకమైన ఖనిజాలు వంటి కీలక విషయాల్లో భాగస్వామ్యం గురించి చర్చించామన్నారు. భారత్‌తో సంబంధాలు అమెరికాకు కీలకమని రూబియో స్పష్టం చేశారు. అలాగే అమెరికా విదేశాంగ శాఖ కూడా ఒక అధికారిక ప్రకటనను విడుదల చేస్తూ... వాషింగ్టన్‌కు భారతదేశం 'అత్యంత ముఖ్యమైనది"అని పునరుద్ఘాటించింది. మరోవైపు భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా ఈ సమావేశంపై తన అభిప్రాయాన్ని ఎక్స్ వేదికగా పంచుకున్నారు. 'ఈరోజు ఉదయం న్యూయార్క్‌లో విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియోను కలవడం ఆనందంగా ఉంది. మా సంభాషణలో ప్రస్తుత ద్వైపాక్షిక, అంతర్జాతీయ సమస్యలు చర్చకు వచ్చాయి. ప్రాధాన్యతగల రంగాలలో పురోగతి సాధించడానికి నిరంతర సహకారం అవసరమని మేం అంగీకరించాము. మేం ఎప్పటికప్పుడు మాట్లాడుకుంటూ ఉంటాము" అని ఆయన తన పోస్టులో తెలిపారు. ప్రస్తుతం వాణిజ్య ఒప్పందం కోసం ఇరుదేశాల ప్రతినిధులు చర్చలు జరుగుతున్నాయి. ఈక్రమంలోనే జైశంకర్, రూబియోలు సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

దిగుమతులు తగ్గిద్దాం: గడ్కరీ



ముంబై: దిగుమతులు తగ్గించడం, ఎగుమతులు పెంచడం జాతీయవాదానికి అత్యంత ముఖ్యమైన రూపాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మంగళవారం అన్నారు. భారతదేశం 'విశ్వగురు' (గ్లోబల్ లీడర్)గా మారడానికి జ్ఞానం ఆధారిత పురోగతిపై దృష్టి పెట్టాలని కోరారు. ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో గడ్కరీ మాట్లాడుతూ పరిశోధన, ఆవిష్కరణలలో ముందుకు సాగే దేశం... ముఖ్యంగా రక్షణ, వ్యవసాయం, సమాచార సాంకేతికత వంటి రంగాలలో ప్రపంచానికి నాయకత్వం వహిస్తుందని నొక్కి చెప్పారు. 'భారతదేశాన్ని విశ్వగురువుగా మార్చడానికి అతి ముఖ్యమైన విషయం జ్ఞానం. ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న ప్రతి దేశం జ్ఞానం, పరిశోధన కారణంగా అలా చేస్తుంది' అని అన్నారు. 'యుద్ధాలు ఒకప్పుడు సైనికులు, ట్యాంకులతో జరిగేవి, ఆధునిక ఘర్షణలలో ఇప్పుడు డ్రోన్లు, క్షిపణులు ఉంటున్నాయి. ఇది జ్ఞానం ఆధారిత వ్యూహాలకు మారడాన్ని ప్రతిబింబిస్తుంది' అని కేంద్ర మంత్రి అన్నారు. భారతదేశాన్ని ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దార్శనికతను గడ్కరీ పునరుద్ఘాటించారు. 'దీనిని సాధించడానికి జ్ఞానం, పరిశోధనపై దృష్టి పెట్టడం ముఖ్యం. మనం పొందే విద్య మన జీవితాలకు సంబంధించినదని నిర్ధారించుకోవడం చాలా ముఖ్యం' అని తెలిపారు. 'యువత భవిష్యత్ దేశ భవిష్యత్‌కు సంబంధించినది. మనం దిగుమతి చేసుకునే వస్తువులు... వాటిపై పరిశోధనలు నిర్వహించడం, దిగుమతులు తగ్గించడం, ఎగుమతులు పెంచడం జాతీయవాదానికి అతి పెద్ద రూపం' అని అన్నారు

కృష్ణాకు మళ్లీ భారీ వరద

(మొదటిపేజీ తరువాయి)

చేరుతుండగా... 4,06,227 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 30,000 క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 30,072 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పది స్పిల్ వే గేట్లను 12 అడుగులు ఎత్తి... 3,10,840 క్యూసెక్కులు నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 883 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 204.35 టీఎంసీలుగా కొనసాగుతోంది. దిగువున నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 3,42,506 క్యూసెక్కులు వస్తుండగా... మొత్తం నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతల ప్రాజెక్టుకు 3,30,174 క్యూసెక్కులు వస్తుండగా... ప్రాజెక్టు మొత్తం గేట్లు ఎత్తి 3,67,784 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వీటితో పాటు దిగువ ప్రాంతాల్లో వాగులు, వంకల నీరు వచ్చి చేరుతుండడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద మొత్తం 70 గేట్లు ఎత్తి నాలుగున్నర లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. వరద ఉధృతి క్రమేపీ పెరుతుండడంతో అధికారులు తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

నేడు మరో అల్పపీడనం

ఉత్తర ఒడిశా, వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కేంద్రీకృతమై ఉందని, దీని అనుబంధంగా ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి సగటున 7.6 కి.మీ ఎత్తులో కొనసాగుతున్నదని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. ఉపరితల ఆవర్తనం నుండి మరొక ద్రోణి విస్తరించి ఉందని తెలిపారు. ఇది గురువారం నాటికి తూర్పుమధ్య, ఆనుకుని ఉన్న ఉత్తర బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించారు. ఇది పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ శుక్రవారం దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర తీరాల్లో వాయువ్య, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని, ఈనెల 27వ తేదీన దక్షిణ ఒడిశా - ఉత్తరాంధ్ర తీరాలను దాటే అవకాశం ఉందని ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. వీటి ప్రభావంతో ఈనెల 28వ తేదీ వరకు రాష్ట్రంలో అక్కడక్కడ పిడుగులతో కూడిన భారీ వర్షాలు, విస్తృతంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గురువారం నుంచి ఆదివారం వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దంటూ హెచ్చరించారు.

స్థానిక ఎన్నికల్లో స్వతంత్ర పోటీ అవశ్యం

(మొదటిపేజీ తరువాయి)

చట్టాలు వచ్చాయన్నారు. భౌతికంగా వారు లేనప్పటికీ, వారి స్ఫూర్తితో పార్టీని ముందుకు తీసుకుపోతామన్నారు. ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, అవినీతి, నిరుద్యోగం, పేదరికం విపరీతంగా పెరిగిపోయిందని, ఇలాంటి అంశాలపై కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో జాతీయ స్థాయిలో భారీ ఉద్యమాలను నిర్వహించాల్సిన అవసరం ఉందని, ఈ మహాసభలో దానికి రూపకల్పన చేద్దామని సూచించారు. నాడు చంద్ర రాజేశ్వరరావు తదితర కమ్యూనిస్టు దిగ్గజాలు నిత్యం ప్రజలతో మమేకమై, ప్రజలతోనే ఉండి, వారి సమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాటాలు చేసేవారని, అలాంటి వారి బాటలో కమ్యూనిస్టులు ప్రజల్లోకి మరింత చొచ్చుకుపోవాలన్నారు. గత మహాసభలో మనతో ఉన్న కామ్రేడ్ సుధాకరరెడ్డి ఈ మహాసభలో లేకపోవడం విచారకరమని, ఆయన తెలంగాణ రాష్ట్ర మహాసభల చివరి రోజున ముగిసే వరకు విషయాలు తెలుసుకున్న తరువాత అదే రోజు మరణించడం బాధ కలిగించిందన్నారు. అనేక మంది కమ్యూనిస్టు అభిమానులు, శ్రేయోభిలాషులు వామపక్షాల ఐక్యతను కోరుకుంటున్నారని, ఐక్య ఉద్యమాలను మరింతగా చేపడుతూ ఆ దిశగా సీపీఐ మరింత చొరవ తీసుకోవాలన్నారు.

'గ్రూప్- 1 తీర్పు'పై హైకోర్టులో మరో అప్పీల్

(మొదటిపేజీ తరువాయి)

రద్దు చేసిన జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు... ఎనిమిది నెలల్లో మెయిన్స్ పత్రాల పునర్‌మూల్యాంకనం చేయాలని టీజీపీఎస్సీని ఆదేశించిన విషయం తెలిసిందే. ఒకవేళ ఎనిమిది నెలల్లో ప్రక్రియ పూర్తి చేయపోతే మెయిన్స్ మళ్లీ నిర్వహించాలని ఆదేశించారు. దీనిపై గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఓ అభ్యర్థి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు సీజే ధర్మాసనం విచారణకు స్వీకరించింది.

ప్రజాధనం విగ్రహాల ఏర్పాటుకా? సుప్రీంకోర్టు

చెన్నై: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే నేత కరుణానిధి విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తప్పుపట్టింది. 'మీ నేతలను కీర్తించేందుకు ప్రజాధనాన్ని ఎలా వినియోగిస్తారు' అని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది.

ప్రభుత్వం తన పిటిషన్‌ను ఉపసంహరించుకొని... ఈ వ్యవహారంపై మద్రాస్ హైకోర్టునే ఆశ్రయించాలని సూచించింది. తిరునెల్వేలి జిల్లా వల్లియూర్ కూరగాయల మార్కెట్ ప్రవేశద్వారం వద్ద కరుణానిధి కాంస్య విగ్రహం ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి కోరింది. ఆ పిటిషన్‌పై అసహనం వ్యక్తంచేసిన అత్యున్నత న్యాయస్థానం... గతంలో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. బహిరంగ ప్రదేశాల్లో విగ్రహాల ఏర్పాటుకు అనుమతిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వలేదని హైకోర్టు అప్పుడు స్పష్టంచేసింది. ఇలాంటి ఏర్పాట్ల వల్ల ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బంది పడతారని అనుమతి నిరాకరించింది. విగ్రహాల ఏర్పాటుకు ఎలాంటి అనుమతి ఇవ్వకూడదని గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిందని గుర్తుచేసింది. ఆ నేపథ్యంలో ప్రభుత్వాలు అనుమతి ఇవ్వడం సాధ్యం కాదని తేల్చిచెప్పింది. తమిళనాడు రాజకీయాలపై కరుణానిధి చెరగని ముద్ర వేశారు. దశాబ్దాల పాటు డీఎంకే పార్టీని నడిపిన ఆయన... ఐదుసార్లు ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. తమిళం మాట్లాడే ప్రజల హక్కుల కోసం, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన కృషి చేశారు.

డ్రగ్స్ రహిత సమాజానికి వలంటీర్లు కృషి చేయాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో- మహబూబాబాద్: నేటి యువత డ్రగ్స్ రహిత సమాజం కొరకు కృషి చేయాలని ఎన్ఎస్ఎస్ మహబూబాబాద్ జిల్లా కన్వీనర్ మర్సకట్ల అనిల్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నెల్లికుదురు మండలం రామన్నగూడెంలో నెల్లికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన 4వ రోజు జరిగిన ఆరోగ్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఈ ఆరోగ్య శిబిరంలో గ్రామస్తులు, యువత, వయో వృద్దులు పాల్గొని తమ అనారోగ్య సమస్యలను మిడ్ లెవెల్ హెల్త్ ప్రమోటర్ వినీత్‌కు తెలియజేసి, టాబ్లెట్స్, సిరప్స్, తదితర మెడిసిన్ తీసుకున్నారన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో యువతలో డ్రగ్స్ వాడకంవల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్ మర్సకట్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వాడకంవల్ల శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో పాటు, చదువు, ఉద్యోగం, కుటుంబం, సమాజంలో ప్రతిష్ట కోల్పోతారని అన్నారు. మత్తు పదార్థాలు చట్టవిరుద్ధం, వాటి వాడకం జైలు శిక్షలకు దారితీస్తుందని తెలిపారు. నేటి యువత డ్రగ్స్ రహిత సమాజం కొరకు కృషి చేయాలని, మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కలిగి ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సలీం, కార్తీక్, ఇమ్మానియేల్, శ్రీకాంత్, జేమ్స్, అశ్విక్, మహేష్, దేవేందర్, సంగీత, మీనాక్షి, దివ్య, శశి, చంద్ర ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు పంపిణీ చేయాలి

విశాలాంధ్ర-తొర్రూర్: జిల్లాలోని తొర్రూరు పట్టణ కేంద్రంలోని గోపలగిరి రోడ్డులో నిర్మాణాలు పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిరుపేద లబ్ధిదారులకు పంపిణీ చేసే వరకు పోరాటం ఆపేది లేదని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్, తొర్రూరు మండల కార్యదర్శి జిల్లా కమిటీ సభ్యులు ఎండి యాకూబ్‌లు అన్నారు. మంగళవారం సీపీఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఇళ్లులేని నిరుపేద లబ్ధిదారులతో కలిసి ర్యాలీ నిరసనలు నిర్వహించారు. ఈ నిరసనకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సంఘీభావము తెలిపారు. ఈ సందర్భంగా బొల్లం అశోక్, ఎండి యాకోబులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కోట్ల రూపాయలు వెచ్చించి రెండు పడక గదుల ఇళ్లు నిర్మాణాలు పూర్తి చేసి ఉన్న ఇండ్లను గత ప్రభుత్వం పంచకపోగా... ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాలు అయినా ఇండ్లు పంపిణీ చేయకుండా విస్మరించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అధికారులు రాజకీయ నాయకులవలె అబద్ధాలు చెప్పి కాలయాపన చేస్తున్నారన్నారు. 45 రోజులు సమయం అడిగిన అధికారులు నేటికీ వంద రోజులు గడుస్తున్నప్పటికీ అధికారులకు చెవు మీద పేను బారిన చందంగా ఉన్నారన్నారు. స్థానిక శాసన సభ్యురాలు స్పందించి నిర్మాణాలు పూర్తయి ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇండ్లు లేని నిరుపేద లబ్ధిదారులకు తక్షణమే కేటాయించాలని, లేనియెడల విజయదశమి రోజు గృహప్రవేశాలు చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన ర్యాలీలో మాజీ జెడ్పి ఫ్లోర్ లీడ్ మంగళంపల్లి శ్రీనివాస్,సీపీఎం నాయకులు జమ్ముల శ్రీనివాస్, కొమ్మనబోయిన యాకయ్య, డోనక దర్గయ్య, బోర స్వామి, జితేందర్ రెడ్డి, తాళ్ల వెంకటేశ్వర్లు, ఎండి నజీర్, ఉమ్మగాని యాకయ్య, దొమ్మటి సోమయ్య, శోభ, వరలక్ష్మి, షమీనా, డోనుక యాకాంత, శ్రీలత, అరుణ, మల్లయ్య, రేవూరి శ్రీను, భాగ్యలక్ష్మి, అమీన, రాధ, దర్మన్న, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి రూ. 15 కోట్లు మంజూరు

విశాలాంధ్ర,బ్యూరో,నిర్మల్ జిల్లా : ఖానాపూర్,నియోజకవర్గం ఉట్నూర్‌లో శిథిలావస్థకు చేరిన ఐటిడిఏ కార్యాలయ భవన పునర్నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భొజ్జు పటేల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేశారు. ప్రభుత్వం ప్రతిపాదనలు ఆమోదించి ఐటిడిఏ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.15కోట్లు మంజూరు చేస్తు పరిపాలన మంజూరి జారీ చేసింది. నాలుగు దశబ్దాలా క్రితం నిర్మించిన ఐటిడిఏ కార్యాలయ భవనం శిథిలావస్తకు చేరడంతో ఇబ్బందులు ఎదురుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని గిరిజనుల సంక్షేమం కోసం ఐటిడిఏ ద్వారా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయి. కార్యాలయానికి కొత్త భవన నిర్మానికి నిధులు మంజూరు చేయించిన ఖానాపూర్ ఎమ్మెల్యేపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే కాకుండా రోడ్లు, భవనాలు, విద్య, వైద్యం మెరుగు పర్చెందుకు ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నారు. ఇప్పటికే రవాణా, విద్య, వైద్య సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేయించిన గిరిజన భవనాలకు అదనపు సదుపాయాలు కల్పించేందుకు ఉట్నూర్ లోని గిరిజన భవన్ లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 50లక్షలు, నిర్మల్ లోని గిరిజన భవన్ కు రూ. 50 లక్షలు మంజూరు చేయించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాప్రతినిధులు, అధికారులకు, పాత్రికేయులకు అభినందనలు

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: తాడ్వాయి మండలం లోని మేడారం సమ్మక్క సారక్కల గద్దెల అభివృద్ధి, ప్రాంగణ పునర్నిర్మాణం డిజైన్ల విడుదల కార్యక్రమంలో భాగంగా,రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి ములుగు జిల్లా పర్యటన విజయవంతం చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు, అనధికారులు, పాత్రికేయులకు జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. మంగళవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. రానున్న మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతర సందర్భంగా చేపట్టనున్న అన్ని పనులను పూర్తి చేయుటకు ఇదే విధంగా సహకారం అందించి జాతర విజయవంతం చేయడానికి కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు.

మంత్రి శ్రీధర్ బాబును కలిసిన తోటకూర



విశాలాంధ్ర, మేడిపల్లి: ఎల్.బి.నగర్, హస్తినాపురంలో జి.ఎస్.ఆర్ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం ఉదయం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రివర్యులు దూదిళ్ల శ్రీధర్ బాబు వ్యక్తిగత కార్యదర్శి సతీష్ కూతురి నూతన పట్టువస్త్రాలంకరణ కార్యక్రమంలో మంత్రిగారితో కలిసి పాల్గొన్న బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ సుమన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పత్తి కొనుగోలు : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : జిల్లాలో రైతులకు ఏమాత్రం ఇబ్బంది కలక్కుండా పత్తి కొనుగోలు పారదర్శకంగా జరగాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ, మార్కెటింగ్, ప్రణాళిక, రవాణా, పోలీస్ శాఖలతో పత్తి కొనుగోళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల ప్రకారం న్యాయమైన మద్దతు ధర పొందేలా ప్రతి అధికారి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 1,72,937 ఎకరాలలో పత్తి పంట సాగు జరిగిందన్నారు. 26 లక్షల 56,14 0 క్వింటాళ్ల పత్తి దిగుబడి కానున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేసినట్లు చెప్పారు. 2025-26 గాను పత్తికి మద్దతు ధర రూ. 8110 ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పత్తి కొనుగోలు చేపట్టడానికి గాను సీసీ ఐ క్రింద ఆరు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పత్తి కొనుగోలు కేంద్రాల్లో తూకం విషయంలో ఎటువంటి లోపాలు లేకుండా, రైతు ఇచ్చిన పత్తి బరువును కచ్చితంగా నమోదు కావాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వే బ్రిడ్జి లను తనిఖీ చేయాలని తూనికలు కొలతల శాఖల అధికారులను ఆదేశించారు. రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా సకాలంలో జరగాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, వసతి, గోదాములు, తేమ పరీక్షించే యంత్రాలు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులె నేరుగా కేంద్రాల్లో అమ్మకాలు చేసేలా చూడాలని దళారులను ఆశ్రయించవద్దని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో సిపిఓ సంజీవరావు, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, మార్కెటింగ్ శాఖ అధికారి నరేందర్, తూనికలు కొలతలు శాఖాధికారి మనోహర్, రవాణా శాఖ అధికారి వెంకటరమణ, ఇతర శాఖల అధికారులు, మిల్లర్లు పాల్గొన్నారు.

మేయర్, కమిషనర్‌ను కలిసిన ఏఐటీయూసీ నాయకులు

విశాలాంధ్ర- ఖమ్మం : ఖమ్మం కార్పోరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్యలను ఏఐటియుసి నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) మహాసభలలో నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుర్రి ఉపేందర్, నక్కెరకంటి కృష్ణలు మంగళవారం కార్పోరేషన్ కార్యాలయంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాదె లక్ష్మి నారాయణ, తోట రామాంజనేయులుతో కలిసి మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య లను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను మేయర్, కమిషనర్‌కు పరిచయం చేశారు. నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ కార్మికుల-సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా మేయర్, కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఐ.వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి తాటి నాగరాజు, కోశాధికారి గుండ్ల మహేష్, జిల్లా సమితి సభ్యురాలు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : మాదక ద్రవ్యాల నియంత్రణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని డ్రగ్స్‌వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో నమోదవుతున్న ఎన్‌డీపీఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాదక ద్రవ్యాలవాడకం, శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై విస్తృత ప్రచారం లాంటి అంశాలపై సమీక్షించారు. మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి పటిష్టంగా అమలు చేయాలన్నారు. వైద్యాధికారులకు జిల్లాలోని విద్యాలయాల్లో డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. డ్రగ్స్ బానిసలను గుర్తించి ప్రత్యేక చికిత్సలు చేయాలన్నారు. అటవీశాఖ అధికారులు వారి పరిధి అడవుల్లో గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇల్లందు డిఎస్పి చంద్రబాను, ఎక్సైజ్ సూపర్డెంట్ జానయ్య, ఇంటర్మీడియట్ అధికారి వేంకటేశ్వరరావు, జిల్లా వైద్యాధికారి జయలక్ష్మి, రవాణా శాఖ అధికారి వెంకటరమణ, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోతులు, కుక్కల నుంచి ప్రజలను రక్షించాలి : సీపీఐ

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : ఇటీవల కాలంలో వీధుల్లో ప్రమాదకరంగా మారిన కుక్కలు కోతుల బారి నుంచి ప్రజలను రక్షించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. దినదినం విపరీతంగా మారుతున్న ఈ సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మునిగడప వెంకటేశ్వర్లు, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి, సిపిఐ జిల్లా నాయకులు భూక్య శ్రీనివాస్ లు విమర్శించారు. మంగళవారం రామవరం పట్టణంలోని వనందాస్ గడ్డలో కోతులు, కుక్కల సమస్యలపై ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. రామవరం ప్రాంతంలో కోతులు, కుక్కలు మనుషులపై దాడి చేసి గాయాలపాలు చేస్తున్నాయన్నారు. విద్యార్థులు చిన్న పిల్లల విషయంలో ఇంకా ప్రమాదకరంగా మారాయని ఉదంతాలు వివరించారు. వాట దాడులకు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. కోతులైతే ఇండ్లలో జొరబడి ఇంట్లోని వస్తువులను కిరాణా సరుకులను నష్టం చేస్తున్నాయన్నారు. గుంపులుగా వచ్చిన సమయంలో మహిళలు ఒంటరిగా ఉంటే దాడులకు పాల్పడుతున్నా యన్నారు. ఇంటిపై కప్పులు, రేకులు, ఇండ్ల ఆవరణలో పెంచుకునే చెట్లను విపరీతంగా నష్టం చేస్తున్నానన్నారు. గత 4 రోజుల క్రితం ఒక మున్సిపల్ ఉద్యోగిపై కోతులు దాడి చేసాయని తెలిపారు. రోజు ఇలాంటి ఘటనలు అనేకం జరుగుతున్నప్పటికీ మున్సిపల్ అధికారులు నివారణ చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. వెంటనే మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కోతులు, కుక్కల నివారణ కోసం చర్యలు తీసుకొని ప్రజలను కాపాడాలని వారు కోరారు. ఈ సమస్యలపై మున్సిపాలిటి లో దశల వారి ఆందోళనకు సమావేశం తీర్మానం చేశారు. ఈ సమావేశంలో ఉన్నదాసు గడ్డ శాఖ వన్ సహాయ కార్యదర్శి తోగరు నరేంద్ర కుమార్, శాఖ-2 కార్యదర్శి ఎస్కే జలీల్, సీనియర్ నాయకులు ఆది మల్లయ్య, సూరి మేని రామారావు, కదారి మల్లేష్, శంకర్, నాగోల్ మీరా, అలిమ్, రమేష్, వెంకన్న, కృషీద్, పాష తదితరులు పాల్గొన్నారు.

ఆది కర్మయోగి సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-కారేపల్లి : ఆది కర్మయోగి సేవా కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఎన్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం సింగరేణి మండల పరిధిలోని మాధారం, ఉసిరికాయలపల్లి, పేరుపల్లి గ్రామ పంచాయతీలలో ఆది కర్మయోగి సేవ కేంద్రాలను ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఎన్ విజయలక్ష్మి ప్రారంభించారు. అనంతరం ప్రతిజ్ఞ చేసి గ్రామాలలో ర్యాలీలను ప్రదర్శిస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఆది కర్మయోగి పథకం 10.5 కోట్ల మంది గిరిజన ప్రజలను లక్ష్యంగా చేసుకుని 20 లక్షల మంది శిక్షణ పొందిన కార్యకర్తల ద్వారా గిరిజన ప్రాంతాల అభివృద్ధిని వేగవంతం చేస్తుందన్నారు. గ్రామీణ స్థాయిలో సేవలను మెరుగుపరచడం గిరిజన సంస్కృతిని సంరక్షించడం స్థానిక ప్రజలు పాల్గొనడాన్ని ప్రోత్సహించడం ఈ పథకం ముఖ్య లక్ష్యాలన్నారు. భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశాలతో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో వికేంద్రీకృత గిరిజన నాయకత్వం పాలనను ప్రోత్సహిస్తుందన్నారు. గిరిజన సమాజాలను సాధికారపరచడం స్థానిక నాయకత్వ అవకాశాలను సృష్టించడం సంక్షేమ పథకాల అమలును మెరుగుపరచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏసిఎంఓ ఎల్.రాములు ఐసిడిఎస్ సూపర్వైసర్ మాలతి పంచాయతీ కార్యదర్శులు నిరంజన్, విజయ్, సురేష్ గ్రామస్తులు ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాల సీనియర్ అసిస్టెంట్ పాషా అంగన్వాడీ టీచర్స్ ఆశ వర్కర్స్ గ్రామ సమాఖ్య సభ్యులు వైద్య సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తేనే అనుమతులు : కలెక్టర్

విశాలాంధ్ర,సూర్యాపేట బ్యూరో: జిల్లాలోని ఆసుపత్రులు, రోగ నిర్ధారణ కేంద్రాలు కచ్చితంగా నిబంధనలు పాటిస్తేనే అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు.మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ (డీఆర్ఏ) కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్, పిసిపిఎన్‌డిటి యాక్ట్ నిబంధనలను పూర్తిగా అమలు చేసే వారికి మాత్రమే అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. తాత్కాలిక, శాశ్వత అనుమతుల ప్రక్రియ దరఖాస్తు చేసుకున్న వారానికి తాత్కాలిక అనుమతి ఇవ్వాలని, ఆ తరువాత క్షేత్రస్థాయి పర్యవేక్షణలో అన్ని నిబంధనలు అమలులో ఉన్నాయో లేదో పరిశీలించి శాశ్వత అనుమతి ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే నోటీసులు జారీ చేసి తిరస్కరించాలని, అవసరమైతే మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని తెలిపారు. డాక్టర్లు సొంత యజమానులా? లేక కేవలం కన్సల్టెంట్లుగా పనిచేస్తున్నారా? అనుమతి పొందిన డాక్టర్లే పని చేస్తున్నారా లేదా వారి స్థానంలో మరెవరు పనిచేస్తున్నారా? ఒక డాక్టర్ ఒకేసారి ఒక్క హాస్పిటల్‌కే పరిమితమా లేక మరెక్కడైనా పనిచేస్తున్నారా? వీటి పై క్లారిటీ తప్పనిసరి అని కలెక్టర్ చెప్పారు. డయగ్నస్టిక్ సెంటర్లలో అర్హత కలిగినవారికి మాత్రమే అనుమతులు ఇవ్వాలని, రిపోర్టులపై కచ్చితంగా డాక్టర్ సంతకం తప్పనిసరి అని కలెక్టర్ స్పష్టం చేశారు. స్కానింగ్ సెంటర్లలో నిపుణులైన రేడియాలజిస్టులు తప్పనిసరిగా ఉండాలని ఆయన హెచ్చరించారు. జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ అర్హతలేని వారు వైద్యం చేయడం, లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం వంటి అక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, డీఎంహెచ్వో పి. చంద్రశేఖర్, ప్రోగ్రాం అధికారులు జి. చంద్రశేఖర్, నాజియా, కోటిరత్నం, డిప్యూటీ డీఎంహెచ్వో జయ మనోహరి, మీడియా అధికారి సంజీవరెడ్డి తదితరులు హాజరయ్యారు.

అస్వస్థతకు గురైన బాధితులకు కలెక్టర్ పరామర్శ

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: చేగుంట మదర్సాలో అస్వస్థతకు గురైన పిల్లల ఆరోగ్యం నిలకడగా ఉందని కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. మంగళవారం రామాయంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సందర్శించి కలుషిత ఆహారంతో అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ చేగుంట మండలం ఇబ్రహీంపూర్ మదర్సాలో ముస్లిం ప్రైవేట్ వసతి గృహంలో బీహార్ రాష్ట్రానికి సంబంధించి పిల్లలు 25 మంది వసతి పొందుతుండగా సోమవారం రాత్రి వారు తీసుకున్న భోజనంలో నాణ్యత లోపించి 10 మంది వాంతులు, విరోచనాలతో అస్వస్థత గురయ్యారన్నారు. 108 అంబులెన్స్‌లో రామాయంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్కు తరలించడం జరిగిందన్నారు. తక్షణ సహాయ చర్యలు, వారి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడే వరకు వైద్య సేవలు అందించాలని రామాయంపేట వైద్యాధికారులకు సూచించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. కలుషిత ఆహారం సంఘటనపై పూర్వపరాలు తెలుసుకోవడానికి మెడికల్ బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపడతామన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, హోటల్స్, రెస్టారెంట్లలో ఆహారం పరిశుభ్రతలో భాగంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. కలెక్టర్ వెంట రామాయంపేట తహసిల్దార్ రజని, డాక్టర్ శివ దయాల్, వైద్యాధికారులున్నారు. హవేలీ ఘనపూర్ మండల కేంద్రంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. మిగిలి ఉన్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఐటిఐ ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ జోనల్ మేనేజర్ అనురాధ, డిఈ రాందాస్, ఎలక్ట్రికల్ డిఈ వాణీలత పాల్గొన్నారు.

రేబిస్ సోకి యువకుడు మృతి

విశాలాంధ్ర - పినపాక : కుక్క కాటు వేసిన వెంటనే ఇంజక్షన్ వేయించుకోకుండా నిర్లక్ష్యం చేయడంతో రేబిస్ వ్యాధి సోకి యువకుడు ప్రాణాలు కోల్పోయిన ఘటన పినపాక మండలం ఈ బయ్యారం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ఈ బయ్యారం గ్రామపంచాయతీ బుడ్డోడు గూడెం గ్రామానికి చెందిన ముట్టెబోయిన సందీప్ (25)మంగళవారం ఉదయం రాబిస్ తో మరణించాడు. రెండు నెలల క్రితం ఇంట్లో పెంచుకునే కుక్క గోళ్లతో గీకడం వల్ల ఏమి కాదని భావించాడు. వైద్యం చేయించుకోకపోవడం వల్ల మూల్యం చెల్లించుకున్నాడు. ఇతని తండ్రి పున్నయ్య ఒకగానొక కుమారుడు ఇలా మృతి చెందడంతో కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఎవరైనా కుక్క కరిస్తే ఏంటనే ప్రభుత్వ ఆసుపత్రి కి వెళ్లి వ్యాక్సిన్ తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

బతుకమ్మ సంబురాలు

విశాలాంధ్ర-కోదాడ : కోదాడ కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. న్యాయమూర్తులు, మహిళా న్యాయవాదులు రకరకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి పూజలు నిర్వహించి బతుకమ్మ పాటలకు ఆడి పాడారు. సబ్ జడ్జి కె.సురేష్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను వివరిస్తూ తెలంగాణలో ప్రకృతిని ఆరాధించే అతిపెద్ద పూల పండుగ అని, అతివృష్టి, అనావృష్టి కలుగకుండా ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని భగవంతుడిని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కె.భవ్య, జూనియర్ సివిల్ జడ్జిలు ఎండి ఉమార్ తదితరులు పాల్గొన్నారు.

మెప్మా కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా : మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం క్యాతనపల్లి మున్సిపాలిటి పరిధిలోని ఠాగూర్ స్టేడియం పక్కన రూ.6 లక్షల మున్సిపల్ నిధులతో నూతనంగా పునరుద్ధరించబడిన మెప్మా కార్యాలయాన్ని మంత్రి వివేక్ వెంకటస్వామి, జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజు, మందమర్రి మండల తహసీల్దార్ సతీష్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ఈ కార్యాలయం 567 స్వయం సహాయక సంఘాలలోని 5 వేల 948 మంది మహిళా సభ్యులు సమావేశాలు, బ్యాంకు సంబంధిత కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా రుణ సదుపాయం కల్పించి ప్రోత్సహించడం జరుగుతుందని, స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని వినియోగించుకుని ఆర్థిక స్వావలంబన పొందాలని, తమ కుటుంబ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. మహిళ సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 రూపాయలకే రాయితీ గ్యాస్ సిలిండర్ అందించడంతో పాటు బ్యాంకు లింకేజీ ద్వారా రుణ సదుపాయం కల్పించి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వం ప్రతి ఒక్క పథకంలో అవినీతికి పాల్పడుతూ లక్షల్లో అవినీతికి పాల్పడ్డారన్నారు. అనంతరం క్యాతనపల్లి పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు 2 కోట్ల రూపాయల విలువైన బ్యాంకు లింకేజీ చెక్కులను పంపిణీ చేశారు. ఈయొక్క కార్యక్రమంలో క్యాతనపల్లి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు పల్లె రాజు, టీపీసీసీ మాజీ కార్యదర్శి పిన్నింటి రఘునాథరెడ్డి, పుర మాజీ చైర్పర్సన్ జంగం కళ, మాజీ వార్డ్ కౌన్సిలర్లు, మెప్మా ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వైద్య రంగం బలోపేతానికి చర్యలు

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రజా సంక్షేమం దిశగా చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, ల్యాబ్, రిజిస్టర్లు, మందుల నిల్వలు, పరిసరాలను మండల తహసిల్దార్ దిలీప్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో అవసరమైన వైద్యులు, ఇబ్బందిని నియమించి మందులను అందుబాటులో ఉంచి ప్రజల సంక్షేమం కొరకు తగు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో వైద్యులు, సిబ్బంది విధులపట్ల బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రి పరిధిలో కొనసాగుతున్న క్యాంటీన్, మార్చురీ గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలు కొనసాగుతున్న పనులను పరిశీలించారు. దసరా సెలవులు ముగిసి పాఠశాల ప్రారంభం లోపు పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్ తో కలిసి అమృత్ 2.0 పథకంలో నీటి ట్యాంకుల ద్వారా నిరంతరం త్రాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆఫర్లతో హెచ్ అండ్ ఎం ఫెస్టివల్ కలెక్షన్

హైదరాబాద్: రానున్న పండుగ సందర్భాలను పురస్కరించుకొని హెచ్ & ఎం ప్రత్యేక ఆఫర్లతో ముందుకు వచ్చిందని, పురుషులు, మహిళలు, పిల్లల కోసం ఫెస్టివ్ కలెక్షన్‌తో తిరిగి వచ్చిందని హెచ్ అండ్ ఎం కాన్సెప్ట్ డిజైనర్ ఎలియానా మస్గలోస్ తెలిపారు. ఈ ప్రత్యేక క్యాప్సూల్‌లో స్టైలిష్‌గా, ధైర్యంగా, జోష్‌తో కనిపించే మహిళల దుస్తులు ప్రధానంగా ఉంటాయన్నారు. మొదటి విడత ఈనెల 25 నుంచి హెచ్‌అండ్ఎం స్టోర్లలో, హెచ్ఎం డాట్ కామ్ మింత్రాలో అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ఈ కలెక్షన్ సైబరాబాద్‌లోని ఇనోర్బిట్ మాల్, కొండాపూర్‌లోని శరత్ సిటీ క్యాపిటల్ మాల్, ఖైరత్‌బాద్‌లోని ఇర్రం మంజిల్ మాల్‌లో అందుబాటులో కలవన్నారు. రెండో విడత అక్టోబర్ 9వ తేదీన ఉంటుందన్నారు. దీపావళికి ఈ ప్రత్యేకమైన, ఆకర్షణీయమైన ఆఫర్‌ను తిరిగి అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మా కస్టమర్లు స్టైల్‌తో, ఆత్మవిశ్వాసంతో, ఆధునికంగా, అద్భుతంగా కనిపించేలా చూడటం లక్ష్యమన్నారు. మహిళల దుస్తులు ఆధునికంగా, ఆకర్షణీయంగా ఉంటాయన్నారు. పండుగ వాతావరణానికి సరిపోయేలా ఈ కలెక్షన్‌లో గ్లామర్‌తో టైలర్డ్ పీస్‌లు, ఫిట్టెడ్ సెపరేట్స్, ఫ్లూయిడ్ ఈవెనింగ్ వేర్‌లు కలవన్నారు. క్రాప్డ్, షోల్డర్ ఫార్మ్-ఫిట్టింగ్ టాప్స్, బాడీసూట్‌లు ఆకట్టుకుంటాయన్నారు. శరీర ఆకృతిని అందంగా చూపించే డ్రేప్డ్ షేప్‌లు, సారీ ప్రేరణతో రూపొందించిన స్కర్ట్‌లు, ఫ్రింజ్ డ్రెస్‌లు, ఫ్లోయింగ్ మాక్సీ డ్రెస్‌లు కూడా ఉన్నాయన్నారు. పండుగల ప్రేరణతో హెచ్ & ఎం హోమ్ కురేటెడ్ ప్రొడక్ట్స్‌ను కూడా పరిచయం చేస్తున్నామన్నారు. ఇందులో ఎంబ్రాయిడరీ మోటిఫ్‌లు, యాంటిక్ గోల్డ్, ఫ్లోరల్ ప్యాటర్న్‌లు ఉన్నాయని తెలిపారు.

ప్రకృతిని పూజించే గొప్ప పండుగ బతుకమ్మ

విశాలాంధ్ర ఖమ్మం : తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించే బతుకమ్మ, ప్రకృతిని పూజించే గొప్ప పండుగ అని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మూడవ రోజు మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లో వైద్య శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన బతుకమ్మ వేడుకలలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి పాల్గొన్నారు. బతుకమ్మ వేడుకలలో కలెక్టర్ సతీమణితో కలిసి ప్రత్యేకంగా పూజలు చేశారు. ఈ వేడుకలలో కలెక్టరేట్లోని వివిధ శాఖలలో ఉన్న మహిళలంతా కలిసికట్టుగా పాల్గొన్నారు. కలెక్టరేట్ ఆవరణలో బతుకమ్మలను పేర్చి వాటి చుట్టూ తిరుగుతూ బతుకమ్మ, బతుకమ్మ ఉయ్యాలో... బంగారు బతుకమ్మ ఉయ్యాలో.... అంటూ ఆట, పాటలతో సందడి చేసిన మహిళలు, ఉద్యోగులతో కలిసి జిల్లా కలెక్టర్ కలిసి ఆడి వారిని ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో మహిళా ప్రాంగణం విద్యార్థినులు, వైద్య శాఖ ఉద్యోగినులు, సిబ్బంది, అందరూ పాల్గొని గౌరమ్మను కొలిచి ఆట, పాటలతో సందడి చేసారు.

మేడారం గద్దెలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంపై కృతజ్ఞతలు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - అశ్వరావుపేట : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక మాస్టర్ ప్లాన్‌తో మేడారం సమ్మక్క సారలమ్మ గద్దెలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దటం పట్ల తెలంగాణ ప్రజలతో పాటు గిరిజనులు కృతజ్ఞతలు వ్యక్తం చేస్తున్నట్లు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు. మంగళవారం ములుగు జిల్లా మేడారంలో గిరిజన దేవతలైన సమ్మక్క సారలమ్మ అమ్మవారి గద్దెల అభివృద్ధి కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి సీతక్క తో పాటు ఎమ్మెల్యే జారే పాల్గొన్నారు. గద్దెలను ఆధునికంగా అభివృద్ధి చేసి భక్తులు, యాత్రికులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూసిన ఈ చారిత్రాత్మక నిర్ణయం పట్ల ముఖ్యంగా గిరిజనులు చాలా సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు.

నకిలీ పాస్ పుస్తకాల తయారీ ముఠా అరెస్టు

విశాలాంధ్ర -ఖమ్మం : కూసుమంచి మండలం జక్కేపల్లి గ్రామానికి చెందిన కొంతమంది రైతుకు పట్టాదారు పాస్ బుక్స్ ఇప్పిస్తామని డబ్బులు తీసుకొని నకిలీ పట్టాదారు పాస్ బుక్స్ తయరు చేసి ఇచ్చారని జక్కేపల్లి గ్రామానికి చెందిన కళ్ళెం అంజిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు కూసుమంచి ఎస్సై నాగరాజు తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున గంగాబండ తండ ఫ్లై ఓవర్ దగ్గర నకిలీ పాస్ పుస్తకాల తయారీ చేస్తున్న ఐదుగురు ముఠా సభ్యులు కొత్త జీవన్ రెడ్డి, జక్కేపల్లి , కొండూరి కార్తీక్ , పారిపత్తి సాయి, జక్కపల్లి వరప్రసాద్, నందమూరి లక్ష్మన్ రావును కూసుమంచి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. నిందుతుల నుండి రెండు కార్లు,10 నకిలీ పట్టాదారు పాస్ బుక్స్ స్వాధీనం చేసుకునట్లు తెలిపారు.

సంపాదకీయం

పలస్తీనాకు పెరుగుతున్న అండ

పలస్తీనియన్లను తుడిచిపెట్టడానికి ఇజ్రాయిల్ ఓ వేపు ప్రయత్నిస్తుండగా అనేక దేశాలు ఇటీవల పలస్తీనాను గుర్తిస్తున్నాయి. పలస్తీనియన్ల మీద ఇజ్రాయిల్ 1948 నుంచి దాడులు చేస్తూనే ఉంది. తాజాగా 2023 అక్టోబర్ ఏడో తేదీన ఇజ్రాయిల్ ప్రారంభించిన యుద్ధం కాల్పుల విరమణ ఒప్పందంతో నిమిత్తం లేకుండా కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో యునైటెడ్ కింగ్‌డం, ఆస్ట్రేలియా, పోర్చుగల్ గత వారంలో పలస్తీనాను గుర్తించాయి. ఫ్రాన్స్ కూడా రెండు రోజుల కింద పలస్తీనాను గుర్తించింది. పలస్తీనియన్లకు అస్తిత్వమే లేకుండా చేయాలని కంకణం కట్టుకున్న ఇజ్రాయిల్‌లోని నెతన్యాహూ ప్రభుత్వం దాదాపు రెండేళ్లుగా నీతి బాహ్యమైన భీకర యుద్ధం కొనసాగిస్తోంది. గాజాను దాదాపు ధ్వంసం చేసింది. ఆసుపత్రులను, విద్యా సంస్థలను కూడా నేలమట్టం చేసింది. ప్రతి రోజూ డజన్ల మంది చిన్నారులు ఇజ్రాయిల్ బాంబు దాడులకు బలి అవుతూనే ఉన్నారు. రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తరవాత పలస్తీనియన్ల గడ్డ మీద కృత్రిమంగా ఇజ్రాయిల్ అవతరించింది. అప్పటి నుంచి పలస్తీనియన్లతో ఏదో ఓ రకంగా వైరం కొనసాగిస్తూనే ఉంది. ఇజ్రాయిల్ దాడులకు పశ్చిమ దేశాల, ముఖ్యంగా అమెరికా దన్ను ఉండడంవల్ల ఈ అమానుష యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఇప్పుడు గాజా నది పశ్చిమ తీరంలో, గాజా పట్టణంలో ఎక్కడ చూసినా శిథిలాలే దర్శనం ఇస్తాయి. తాజా యుద్ధం ప్రారంభం అయిన తరవాత కూడా అమెరికా ఇజ్రాయిల్‌కు పీకల దాకా ఆయుధాలు సరఫరా చేస్తూనే ఉంది. ఇజ్రాయిల్ ఏర్పడిన కొత్తలో 1950లోనే నెహ్రూ ప్రభుత్వం ఇజ్రాయిల్‌ను గుర్తించింది. ఎందుకంటే యూదులకోసం ఇజ్రాయిల్ అనే దేశం ఏర్పడింది కనక ఆ వాస్తవాన్ని గ్రహించి నెహ్రూ ప్రభుత్వం ఇజ్రాయిల్‌ను గుర్తించవలసి వచ్చింది. కానీ ఆ తరవాత ఇజ్రాయిల్ దూకుడు కారణంగా ఇజ్రాయిల్‌తో భారత సంబంధాలు కొంత మేరకు బెడిసి పోయాయి. 2023లో దుర్మార్గమైన ఇజ్రాయిల్ యుద్ధం ప్రారంభం అయిన తరవాత మోదీ ప్రభుత్వం పైకి ఎన్ని మాటలు చెప్పినా ఇజ్రాయిల్‌కే అంటకాగుతోంది. పలస్తీనియన్ల మీద అక్రమ దాడులను, వారి భూభాగాలను ఆక్రమించడాన్ని ప్రస్తుత బీజేపీ కానీ, దానికి పూర్వ రూపమైన భారతీయ జనసంఘ్ కానీ ఎన్నడూ ఖండించిన పాపాన పోలేదు. నిజానికి ఇజ్రాయిల్ ఒక తీవ్రవాద దేశంగా మారిపోయింది. రెండేళ్ల నుంచి గాజా నది పశ్చిమ తీరం మీద, ముఖ్యంగా గాజా పట్టణం మీద ఇజ్రాయిల్ భారీ ఎత్తున బాంబు దాడులు కొనసాగిస్తున్న సమయంలో అనేక దేశాలు బాధితులకు సహాయం చేయడానికి ముందుకు వచ్చినా ఇజ్రాయిల్ ఆ సహాయం అందకుండా అడ్డుకుంటూనే ఉంది. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరవాతే చాలా కాలంగా పలస్తీనియన్లతో మనకున్న సత్సంబంధాలు బెడిసి పోయాయి. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి పలస్తీనియన్లకు ఓ దేశం ఉండాలన్న విధానాన్నే భారత్ అనుసరిస్తూ వచ్చింది. పలస్తీనా విమోచన సంస్థ (పీఎల్‌ఓ) నాయకుడు యాసిర్ అరఫాత్‌తో ఎప్పుడూ సత్సంబంధాలే కొనసాగాయి. కానీ బీజేపీ అధికారంలోకి వచ్చిన తరవాత ఈ పరిస్థితి తారుమారైంది. పలస్తీనాను ఒక రాజ్యంగా, ఒక దేశంగా భారత్ 1988లోనే గుర్తించింది. అంతకు ముందు అరబ్ దేశాలు మాత్రమే ఆ పని చేశాయి. 1996లో భారత్ గాజాలో మన ప్రతినిధి కార్యాలయాన్ని కూడా నెలకొల్పింది. ఆ తరవాత అది 2003లో రమల్లాకు మారింది. 2011లో యునెస్కోలో ఇజ్రాయిల్‌కు పూర్తి స్థాయి సభ్యత్వం ఉండాలన్న తీర్మానానికి భారత్ అనుకూలంగా ఓటు వేసింది. స్వాతంత్ర్యానంతరం భారత్ ఎప్పుడూ విమోచనోద్యమాలకు మద్దతు ఇస్తూనే ఉంది.

అనేక పశ్చిమ దేశాలు పలస్తీనా రాజ్యాన్ని గుర్తించడానికి చాలా ప్రాధాన్యం ఉంటుంది. పశ్చిమ దేశాలు పలస్తీనాను గుర్తించడం దౌత్య పరంగా ప్రాముఖ్యత ఉన్న అంశం. ప్రపంచంలోని నాలుగింట మూడొంతుల దేశాలు పలస్తీనాను గుర్తించాయి. కానీ అమెరికా ప్రస్తుతం పలస్తీనాకు రాజ్య హోదాను సమర్థించడంలేదు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో అమెరికాకు వీటో అధికారం ఉన్నందువల్ల పలస్తీనాకు రాజ్య హోదా వచ్చే అవకాశమూ లేదు. కానీ అమెరికాతో సాన్నిహిత్యం ఉన్న ఒక్కో దేశం పలస్తీనాను గుర్తిస్తూ ఉన్నందువల్ల ఆ ప్రభావం అమెరికా మీద తప్పని సరిగా పడుతుంది. అయితే దీనికి మరో కోణమూ ఉంది. గాజాలో ఇజ్రాయిల్ మారణకాండ ఆపే సత్తాలేని దేశాలు పలస్తీనాను గుర్తించడంద్వారా తమ అసలు బాధ్యత నుంచి తప్పించుకుంటున్నాయన్న వాదనా ఉంది. అయితే పలస్తీనాను గుర్తిస్తున్న దేశాలు అమెరికాకు భిన్నమైన వైఖరి అవలంబించడం చిన్న పరిణామం ఏమీ కాదు. అనేక దేశాలు పలస్తీనాను గుర్తించడం పలస్తీనా రాజ్య అస్తిత్వాన్ని అంగీకరించడమే. ఈ దేశాలు క్రమంగా పలస్తీనాతో పూర్తి స్థాయి దౌత్య సంబంధాలు కూడా పెట్టుకోవచ్చు. పరస్పరం దౌత్య కార్యాలయాలు నెలకొల్పుకోవచ్చు. ప్రభుత్వాల స్థాయిలో ఒప్పందాలు చేసుకోవచ్చు. అనేక దేశాలు వరసగా పలస్తీనాను గుర్తించడం అంటే ఉమ్మడి కార్యాచరణకు దిగుతున్నాయనే అనుకోవాలి. గత సంవత్సరం యూరప్ సమాజం పలస్తీనాను గుర్తించేట్టు చేయడానికి స్పెయిన్ ప్రయత్నించింది. కానీ అప్పుడు నార్వే, ఐర్లాండ్‌ను మాత్రమే స్పెయిన్ ఒప్పించగలిగింది. కరిబియన్ దేశాలైన బార్బడోస్, జమైకా, ట్రినిడాడ్, తొబాగో, బహమాస్ కూడా పలస్తీనాను గుర్తించాయి. ఈ పరిణామాలు పలస్తీనాకు అనుకూలంగా వాతావరణం మారుతోందనడానికి సంకేతం. పలస్తీనా అస్తిత్వానికి ప్రస్తుతం తీవ్రమైన ముప్పు ఉన్నందువల్ల వరసగా అనేక దేశాలు పలస్తీనాను గుర్తించడానికి చాలా ప్రాధాన్యం ఉంటుంది. గాజాను ఆక్రమించుకోవడానికి ఇజ్రాయిల్ ప్రయత్నిస్తున్నందువల్ల పలస్తీనాను గుర్తించడం అంటే ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూను లొంగదీసే ప్రయత్నమే. ఇజ్రాయిల్ దాష్టీకానికి వ్యతిరేకంగా ప్రజల మద్దతు కూడా పెరుగుతోంది. ఇజ్రాయిల్ కొనసాగిస్తున్నది మారణహోమం అని గుర్తించడం నానాటికీ ఎక్కువ అవుతోంది. దీనివల్ల కచ్చితంగా వివిధ ప్రభుత్వాల మీద ఒత్తిడి పెరగకుండా మానదు. పలస్తీనా ఒక రాజ్యంగా పని చేయడం లేదు కనక, తన భూభాగంపై ఆధిపత్యం లేదు కనక దాన్ని గుర్తించడ్మ చట్టబద్ధం కాదు అని వాదించేవారికి కొదవలేదు. కానీ ఈ లక్షణాలు లేకుండా చేసింది ఇజ్రాయిల్ అని గమనించాలి. పలస్తీనాను గుర్తిస్తున్న దేశాలు అదే పని చేస్తున్నాయి. ఒక దేశాన్ని గుర్తించడం ప్రధానంగా రాజకీయమైందే. 1948లోనే అమెరికా ఇజ్రాయిల్‌ను గుర్తించిన విషయాన్ని గుర్తు చేసుకోవాలి. ఐక్యరాజ్య సమితి ఆమోదించిన అనేక తీర్మానాలు ఒక రాజ్యంగా పలస్తీనా అస్తిత్వాన్ని గుర్తించడమే. పలస్తీనాను గుర్తించడం అంటే హమాస్‌ను ప్రోత్సహించడమేనని ఇజ్రాయిల్ వాదిస్తోంది. ఇప్పటికీ అనేక దేశాలు అఫ్గానిస్థాన్ లో తాలిబన్ల పాలనను గుర్తించకపోయినా అఫ్గానిస్థాన్ అస్తిత్వాన్ని అంగీకరిస్తూనే ఉన్నాయి. యుద్ధ నేరాలకు పాల్పడుతున్నందుకు అంతర్జాతీయ నేర న్యాయస్థానం నెతన్యాహూ అరెస్టుకు వారెంట్ జారీ చేసింది. అంతమాత్రం చేత ఆ దేశాన్ని గుర్తించనట్టు కాదుగా! 2011లోనే ఐక్యరాజ్య సమితి పలస్తీనాను గుర్తించింది. భద్రతా మండలిలో పలస్తీనాను గుర్తించని ఏకైక దేశం అమెరికా.

సోషలిజంపై పెరుగుతున్న సానుకూలత

భవాని శంకర్‌నాయక్

సోషలిజానికి వ్యతిరేకంగా పెట్టుబడీదారీ వ్యవస్థ నిరంతరం చేస్తున్న వ్యతిరేక ప్రచారానికి భిన్నంగా సోషలిజంపై సానుకూలత వ్యక్తంచేస్తున్న ప్రజల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. సోషలిజం నేడు చెల్లుబాటు కాదని, సోషలిస్టు సిద్ధాంతం పూర్తిగా నిర్వీర్యం అయిపోయిందని, సోషలిజం ఊహాజనితమైందని, వ్యక్తిగత స్వేచ్ఛకు, పురోగతికి వ్యతిరేకమైందని, సోషలిజం నూతనత్వానికి వ్యతిరేకమైందని, సోషలిజం వాస్తవానికి వ్యతిరేకంగా పనిచేసేదికాదని 21వ శతాబ్ది అవసరాలకు అనుగుణమైంది కాదని, సోషలిజానికి సంస్కరణలు అవసరమని, సోషలిస్టు వ్యతిరేక ప్రచారం చాలా జరిగిపోతోంది. పెట్టుబడీదారీ పాలకవర్గాలు తమ భావజాలాన్ని పెంపొందించుకోవడం కోసం సోషలిజానికి వ్యతిరేకంగా ప్రచారం సాగిస్తోంది. ఇంగ్లీషు పాలకవర్గానికి జాత్యహంకార హీరో, యుద్ధ కాలంలో ప్రధానమంత్రి విన్‌స్టన్ చర్చిల్ సోషలిజం అనేది విఫలమైన సిద్ధాంతమని అజ్ఞానం, అత్యాశ ప్రదర్శించారు. స్కాట్‌లాండ్ పెర్త్‌లో 1948, మే 28వ తేదీన ఆయన ప్రసంగించారు. చివరికి ఇంగ్లీషు సోషలిస్టు మేధావులు తమంతటతాము స్వతంత్రంగా ప్రచారం సాగించారు. ఉన్నతాధికారులు సీఈఎంజోడ్ వంటి వారు సైతం సోషలిస్టు భావజాలానికి వ్యతిరేకంగా ప్రచారం సాగించడంలో ఏమాత్రం వెనుకాడలేదు. ఫాబియన్ సమాజం సైతం సోషలిస్టు వ్యతిరేక వాదనలను ప్రచారంసాగిస్తూ సోషలిజం రూపం, మార్గం తమ ఉనికిని కోల్పోయిందని చెబుతున్నందున జోడ్‌ను సస్పెండ్ చేశారు. శతాబ్దాలుగా సోషలిస్టు వ్యతిరేక ప్రచారాన్ని సాగిస్తూనే ఉన్నారు.

సోషలిజానికి వ్యతిరేకంగా దూషణ ప్రచారాన్ని నిరంతరాయం సాగించడం చరిత్రలో మరొక సిద్ధాంతం లేదు. సైద్ధాంతికంగా కావాలని తప్పుడు ప్రచారాలను సాగిస్తున్నప్పటికీ 2025లో విస్తృతంగా అమెరికాలో జరిగిన సర్వేలో 39శాతం మంది ప్రజలు సోషలిజానికి వ్యతిరేకంగా అభిప్రాయాల్ని వ్యక్తం చేశారు. అయినప్పటికీ, పెట్టుబడీదారీ వ్యవస్థ రోజురోజుకూ వినాశనంవైపు దిగజారిపోతోంది. పెట్టుబడీదారీ వ్యవస్థకు భిన్నంగా ప్రతిపక్షం పెరుగుతోందని ఈ పక్షం సోషలిజానికి అనుకూలంగా అభిప్రాయం రోజురోజుకూ పెరుగుతోంది.

పెట్టుబడీదారీ వ్యవస్థ 7శాతం తరిగిపోతుండగా, సోషలిజంపై అభిప్రాయం 3శాతం పెరిగింది. అమెరికా ప్రజలలో ప్రత్యేకించి భారీ వాణిజ్య వర్గం సోషలిస్టు వ్యవస్థకు వ్యతిరేకంగా ఉండటమేకాక, సర్వేగ్రాఫిక్స్‌లో మరింత దిగజారుతోందని స్పష్టమైంది. గాలప్ సంస్థ విడుదల చేసిన సర్వే సమాచారంలో, సోషలిజం వ్యవస్థకు మద్దతు పెరుగుతోంది. చివరికి డెమొక్రాట్లు, రిపబ్లికన్లు కూడా సోషలిజానికి మద్దతు పలుకుతున్నారు. కాటో సంస్థ 2025 ఆర్థిక విధానంలో ఇగో 2000 మంది అమెరికన్లపై జరిపిన సర్వేలో 43శాతం సోషలిజం పంథాకు మద్దతు తెలిపారు. అదే సమయంలో పెట్టుబడీదారీ సమాజానికి 41శాతం ఏ మాత్రం అనుకూలంగా లేరు. కమ్యూనిజానికి అనుకూలంగా 18-29 మధ్య వయసుగల అమెరికా యువత 34శాతం మంది అనుకూలంగా అభిప్రాయం తెలిపారు. అదే సమయంలో 62శాతం మంది సోషలిజానికి అనుకూలంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆధునికతరంలో విభజనను ఈ సర్వే తెలియజేస్తోంది. పెద్దవయసు అమెరికా పౌరులు పెట్టుబడీదారీ వ్యవస్థకు మద్దతు తెలియజేస్తున్నారు. గతంలో ఉన్న అభిప్రాయాన్ని అలాగే అట్టిపెట్టుకున్నారు. ఇదే సమయంలో యువకులు రాడికల్ సోషలిస్టు మార్పుకు అనుకూలత వ్యక్తంచేయడం పెరుగుతోంది. ఫ్రాషర్ సంస్థ 2023లో చేసిన సర్వేలో బ్రిటన్, కెనడా దేశాలలో సోషలిజంకు బలంగా మద్దతును పలికారు. యువకులు ఈ దేశాలలో సంపన్నులపై అధిక పన్నులు ఎక్కువ మందిపై వసూలు చేయాలని కోరుతూ సోషలిస్టు విధానాలను సమర్థించారు. కెనడాలో 19-24ఏళ్ల మధ్య యువత 50శాతం కంటే ఎక్కువ సోషలిజానికి సానుకూలంగా ఉన్నారు. 2018లో ఇప్సాస్ సోషల్ రీసెర్చి సంస్థ గ్లోబల్ సోషలిజం సర్వే జరిపింది. 21వ శతాబ్దంలో "సోషలిస్టు భావజాలం" టైటిల్‌తో ప్రపంచ జనాభాలో సగానికిపైగా సోషలిస్టు భావజాలానికి అనుకూలత వ్యక్తం చేశారు. ఈ సంస్థ జరిపిన సర్వేలో 10మంది ప్రజలలో 20 మంది ప్రపంచ వ్యాప్తంగా సంపన్నులపై ఎక్కువ పన్నులు విధించాలని కోరుతూ,పేదలకు అనుకూలతను వ్యక్తంచేశారు. అలాగే 10మందిలో 9మందికి ఉచిత ఆరోగ్యభద్రత, ఉచిత విద్య, మానవహక్కులలో ఒకటిగా గుర్తించాలని కోరింది.

10మందిలో ఏడుగురు ప్రతి వ్యక్తి తమ నేపథ్యంతో సంబంధంలేకుండా మౌలిక ఆదాయంపై హక్కు కలగాలన్నారు. పైన పేర్కొన్న నాలుగు సర్వేలలోనూ సాధారణ ప్రజలు, ప్రత్యేకించి యువజనులు పెట్టుబడీదారీ వ్యవస్థకు వ్యతిరేకత ఎక్కువమంది వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో సోషలిజానికి మద్దతు ప్రకటిస్తున్నవారు, అనుకూలతను వ్యక్తంచేసేవారు పెరుగుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రత్యామ్నాయ వ్యవస్థ సోషలిజంను ఎక్కువగా కోరుకుంటున్నారు. యువకులలో సోషలిజంపై మద్దతు పెరుగుతుండగా, గత దశాబ్దికాలంగా, నిరంతరాయంగా ప్రజలు సోషలిజంపై సానుకూలతను ఎందుకు వ్యక్తం చేస్తున్నారనే ప్రశ్న తీవ్రంగా ఎదురవుతున్నది. మానవ సమాజంలో అన్ని విషయాలలోనూ పెట్టుబడీదారీ వర్గం ఆధిపత్యం చూపుతుందేగానీ, క్షేత్రస్థాయిలో ఉనికి కోల్పోతోంది. వ్యక్తిగత స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, పురోగతి, స్వతంత్రత సాధిస్తామని పెట్టుబడీదారీ వ్యవస్థ వాగ్దానం చేసింది.అయితే వాస్తవంగా అమెరికా నాయకత్వంలో వివిధ దేశాలు సామ్రాజ్యవాద యుద్ధాలు, సాయుధ సంఘర్షణలు ప్రపంచవ్యాప్తంగా ప్రతిరోజూ విధ్వంసం జరుగుతున్నాయి. ఈ పరిస్థితులు అఫ్గానిస్థాన్ నుంచి ఉక్రెయిన్‌వరకు జరుగుతున్నాయి. శాంతి, సుస్థిరత, న్యాయమైన ప్రజాస్వామ్య సమాజాన్ని పరిస్థితులను ప్రజలు కోరుకుంటున్నారు. ది యూబీఎస్ గ్లోబల్ వెల్త్ నివేదిక 2025లో ప్రతిరోజూ మిలియనీర్లు, నిరంతరం కొనసాగుతున్న ప్రపంచ పేదరికంలో ఉన్న ప్రజల మధ్య అంతరం పెరిగిపోతూనే ఉంది.

సత్శీలతా, శాంతి ప్రబోధకుడు సచ్చిదానందమూర్తి

దాక్టర్ జీకేడీ ప్రసాదరావు,
ఫ్యాకల్టీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఆంధ్ర విశ్వవిద్యాలయం

ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో 'ఫిలాసఫీ అండ్ రెలిజియస్ స్టడీస్' విభాగం ఆచార్య కొత్త సచ్చిదానంద మూర్తి శతాబ్ది ఉత్సవాల్ని జరుపుతోంది. ఈ సందర్భంగా ఆయన 'తాత్త్విక విజ్ఞాన వారసత్వ పరంపర' మీద ప్రపంచం నలుమూలల నుంచి మేధావులను ఆహ్వానించి అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తోంది. ఒడిశా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారు. కెనడా మెక్గిల్ విశ్వవిద్యాలయం నుంచి పద్మశ్రీ ఆచార్య అరవింద్ శర్మ, అమెరికా మనోవా హవాయి విశ్వవిద్యాలయం ఆచార్య అరిందామ్ చక్రబర్తి ఈ సమావేశంలో గౌరవ అతిథులుగా పాల్గొంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య కొత్త మధుమూర్తి, ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తోపాటు మరికొంతమంది ముఖ్య ప్రముఖులు, విశ్వవిద్యాలయ అధికారశ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నాయి. ఇండియన్ కౌన్సిల్ ఫర్ ఫిలసాఫికల్ రిసెర్చ్ ఈ సదస్సుకు మద్దతునిస్తున్నది. ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి కుమారుడు మానవవనరుల అభివృద్ధి విభాగం పూర్వ హెడ్‌ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ఆచార్య కొత్త రమేష్ ఈ అంతర్జాతీయ సదస్సుకు సంచాలకునిగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగం ఈ నెల 24-26 తేదీల్లో మూడు రోజులపాటు దేశ విదేశీ పరిశోధక ప్రతినిధులతో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తోంది.

ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి ఆంధ్రుల ఆధునికచరిత్రను గొప్ప తాత్విక ఉషోదయంగా భావించారు. సంఘసంస్కరణ, స్వాతంత్రోద్యమం, సాంస్కృతిక పునరుజ్జీవంతో ఆయన మమేకమయ్యారు. కొంతమంది సంపద కోసం, మరికొంతమంది అధికారంకోసం తపిస్తున్న కాలంలో ఈయన తాత్వికత కోసం పరితపించడం విశేషం. త్రిపురనేని రామస్వామి మరణించే నాటికి కొత్త సచ్చిదానందమూర్తికి పందొమ్మిదేళ్ల వయస్సు. త్రిపురనేని స్వాతంత్ర్యానికి నాలుగేళ్ల ముందే చనిపోయారు. ఆయన కుమారుడు 'అసమర్థుని జీవయాత్ర' నవలాకారుడు గోపీచంద్ కంటే సచ్చిదానందమూర్తి 14 ఏళ్ల చిన్నవాడు. ఆయన స్వాతంత్ర్యోద్యమానికి ముందే ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చేరుకున్నారు. ఆంధ్రప్రాంతం అప్పటికే ఎంతో చైతన్యంతో పరవళ్లు తొక్కుతోంది. హేతువాద ఉద్యమం, స్వాతంత్ర్యోద్యమం, భాషా, స్వాభిమాన ఉద్యమాలు, ఇంకా మరెన్నో సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పరిణామాలు సచ్చిదానంద మూర్తి కళ్ల ముందు కృష్ణా, గోదావరి ప్రవాహంలా సాగిపోయాయి. ఆయన చార్వకం, జైన, బౌద్ధ మతాలను అధ్యయనం చేశారు. త్రిపురనేని, తాపీ, నార్ల, కట్టమంచి వంటి మహోన్నతుల రచనల్ని, ఉద్యమాల్ని పరిశీలించారు. ఇంకా ఏదో కావాలి ఈ ఆంధ్రజాతికి అని ఆయన మరింత విజ్ఞానాన్ని శోధించారు. ఈ ప్రపంచాన్ని విశాల విశ్వనేత్రంతో పరిశీలించారు. మానవతాత్విక పరిణామక్రమాన్ని నియంత్రించి ప్రేరేపించే పరిశోధనా పరికరాల్ని ప్రపంచం ముందు ఆవిష్కరించగలిగారు. ఇంతటి ప్రతిభ కలిగినందుకే ఆయన్ని అగ్రరాజ్యాల విశ్వవిద్యాలయాలు ఆచార్యునిగా నియమించుకున్నాయి. గౌరవ డాక్టరేట్లు ప్రదానంచేశాయి. ఈయన భారతీయ మేథోసంపత్తికి మేలిమి బంగారు స్థాయి తీసుకురాగలిగారు. ఆచార్య సర్వేపల్లి రాధాకృష్ణకి సమఉజ్జీగా నిలిచారు. ఈ పరిణామం ప్రపంచ వ్యాప్తంగా తత్వశాస్త్రంలో ఆంధ్రవిశ్వవిద్యాలయ స్థాయిని ఎంతో పెంచింది. ఎందరో తత్వశాస్త్ర పరిశోధకుల్ని ఉత్పత్తి చేసింది. ఈ ఆంధ్రప్రదేశ్ 1930-40 మధ్య కాలంలో కమ్యూనిజం, సోషలిజం, రాడికల్ హ్యూమనిజం వంటి సిద్ధాంతాలు ప్రజల్లో ఉద్యమ రూపం దాల్చాయి. పుచ్చలపల్లి సుందరయ్య, ఆచార్య ఎన్జీ రంగా, తరిమెళ్ల నాగిరెడ్డి వంటి నాయకులు ప్రజల్ని చైతన్యంవైపు, ఆలోచన వైపు నడిపించగలిగారు. రైతు ఉద్యమాలు, శ్రీకాకుళం రైతాంగపోరాటం సమాజాన్ని ప్రభావితం చేశాయి. ఎన్నో సాహిత్య పత్రికలు, పాఠకలోకాన్ని పరవశింపజేశాయి. జాతీయ కాంగ్రెస్, మహాత్మా గాంధీ ప్రభావం, మరో పక్క నిమ్నకులాల ఉద్యమాలు, డాక్టర్ అంబేద్కర్ ప్రభావం, పెరియార్, ద్రావిడ ఉద్యమ ప్రభావం సామాజిక శ్రేణుల్లో చైతన్యాన్ని తీసుకొచ్చాయి. తెలుగు సాహిత్యంలో మాక్సిమ్ గోర్కీ 'మదర్' నవల క్రొవ్విడి లింగరాజు 'అమ్మ' శీర్షికన అనువాదంగా వచ్చి సంచలనం సృష్టించింది. ఇక శ్రీశ్రీ 'మహాప్రస్థానం' ఆనాటి యువత మీద ఎంతో ప్రభావాన్ని చూపింది. ఆంధ్రప్రాంతంలో మేథోవర్గం ప్రపంచంలో చోటు చేసుకున్న ఎన్నో సిద్ధాంతాల్ని అధ్యయనం చేసింది. దేశంలోనే ఈ ప్రాంతం తత్వశాస్త్రాలను సముపార్జించింది. భారతదేశ చరిత్రలో జాతుల పోరాటాల్ని, ఫలితంగా జనించిన జ్ఞాన సిద్ధాంతాల్ని, వాస్తవాల్ని, సత్యాల్ని, సాహిత్యాన్ని ఒడి నిండా నింపుకుంది. వీటిన్నింటికీ ఒక శోధన సాక్షిగా సచ్చిదానందమూర్తి నిలిచారు.

ఆచార్య కె.సచ్చిదానందమూర్తి ఆంధ్రవిశ్వవిద్యాలయంలో బౌద్ధతత్వాన్ని ప్రత్యేకంగా అభ్యసించారు. ఫిలసాఫికల్ స్టడీస్ సిరీస్‌లో భాగంగా ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి 'ఎవల్యూషన్ ఆఫ్ ఇండియన్ ఫిలాసఫీ' గ్రంథానికి ప్రొఫెసర్ ఏఆర్ వాడియా, ఎంఎన్ రామ్ ప్రవేశిక రాశారు. ఈ గ్రంథం అప్పటి ఉపకులపతి ఆచార్య వీఎస్ కృష్ణకు అంకితమిచ్చారు. మహాయాన బౌద్ధంపై ముఖ్యమైన పరిశోధనలు చేశారు. ప్రజల్ని విముక్తి చేసే బోధిసత్వుని మార్గం ఉన్నత మైనదిగా ఆయన భావించారు. ముఖ్యంగా నాగార్జునుని బోధనల మీద అధ్యయనాలు చేశారు. ఆయన తత్వదృష్టిలో అంతరాత్మ శాంతి ముఖ్యమైనదిగా ప్రతిపాదించారు. దీనిని ఆయన కేవలం వ్యక్తిగత ఆధ్యాత్మికస్థితిగా కాకుండా ధార్మిక జీవనానికి, సామాజిక సౌహార్దానికి పునాదిగా భావించారు. వ్యక్తిగత నైతిక మార్పు ఆత్మజ్ఞానం, అహింస ఆధారంగా జరిగే ఈ మార్పు సమన్యాయసమాజాన్ని నిర్మిస్తుందని ఆయన నమ్మారు. బ్రాహ్మణ సనాతనం, ఆధిపత్యం మీద పునర్వ్యాఖ్యానం అవసరమని సూచించారు. అధిభౌతికశాస్త్ర దృష్టితో శాంతి వ్యక్తిగత స్థాయిలో కాక, సామూహికంగా నైతిక చైతన్యం పెంపొందించుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఇందుకోసం విద్య, సంభాషణ, ధార్మిక పాలన అవసరమని చెప్పారు. మూఢనమ్మకాలపై ప్రశ్నలు లేవనెత్తారు. శాంతి అనేది దూరంలో ఉన్న రాజకీయ లక్ష్యం కాదని, అది ప్రతి ఒక్కరి జీవనంలో సాధ్యమయ్యే నైతిక ఆచరణ అన్నారు. చిన్నచిన్న కరుణ కార్యాలు, అహింసా ప్రవర్తనలు, ధైర్యవంతమైన నైతిక నిర్ణయాలు కలిపి శాశ్వత శాంతికి పునాదులు అవుతాయని ఆయన నమ్మారు. ఆచార్య సచ్చిదానందమూర్తి తత్వం భారతీయ అద్వైత వేదాంతం, బౌద్ధ జ్ఞానం, మానవతా నైతికతల కలిపిన విలువైన సమన్వయం. ఆయన కులవివక్షలకు సవాలు విసురుతూ, తత్వాన్ని జీవించే ఆచరణగా చూడాలని ప్రేరేపించారు. అంతరాత్మశాంతిని, వ్యక్తిగత శ్రేయస్సు, సామాజిక న్యాయం, ప్రపంచశాంతికి పునాది అని ప్రతిపాదించారు. ఆయన ఈ తాత్వికత విశ్వశ్రేయస్సు కోసమేగాక అణగారిన ప్రజానీకం సంక్షేమం కోసం కూడా అని నిరూపణ జరిగింది.

ఆచార్య నాగార్జునుడి చరిత్రను ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి ఆవిష్కరించారు. రసవాదం, లోహశాస్త్రం, ఆయుర్వేద రంగాల్లో చేసిన కృషిని వెలికితీశారు. ఆయన ప్రాచీన నలందా విశ్వవిద్యాలయంలో ఆచార్యునిగా చేసిన బోధనల్ని సమాజం ముందు వుంచారు. కృష్ణానది పరివాహక ప్రాంతం నాగార్జునకొండగా పిలుస్తున్న శ్రీపర్వతంలోనే ఆయన బౌద్ధ విహారాలు, శాస్త్రపీఠాలు నిర్మించి బోధనలు చేశారు. యజ్ఞశ్రీ శాతకర్ణి సైతం నాగార్జునునికి అండగా ఆ ప్రాంతంలో ఒక పెద్ద బౌద్ధ విద్యాలయాన్ని నిర్మించారు. వీటన్నింటినీ చైనా యాత్రికుడు ఫాహియన్ తన రచనల్లో వెల్లడించారు. ఇక్కడ వివిధ దేశాల విద్యార్థులు బౌద్ధసాహిత్యాన్ని అభ్యసించారు. ఆచార్య నాగార్జునుడు క్రీ.శ 150-250 మధ్య మహాయాన బౌద్ధ మతాన్ని ఆచరించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 20వ శతాబ్దంలో బౌద్ధ ధమ్మాను స్వీకరించి దాన్ని 'నవయాన'గా పునర్వ్యాఖ్యానించారు. ఇది కర్మ, పునర్జన్మలు లేని సామాజిక సమానత్వం, సాంఘికన్యాయం ముఖ్య లక్ష్యాలుగా చూస్తుంది. సామాజిక బంధనలు, జాతి వివక్షలను అధిగమించేందుకు సాధనగా భావించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 1956లో 'ద బుద్ధ అండ్ హిజ్ ధమ్మా' గ్రంథాన్ని తీసుకొచ్చారు. ఆచార్య కొత్త సచ్చిదానంద మూర్తి బౌద్ధతత్వాన్ని వ్యక్తిగత విద్యా, దార్శనిక అవగాహన, పరిశీలనకోసం అభివృద్ధిపర్చారు. ఇద్దరూ బౌద్ధ ధర్మం మీద తమదైన ప్రాముఖ్యత ఇచ్చినప్పటికీ, డాక్టర్ అంబేద్కర్ జాతి, సామాజిక స్వాతంత్ర్య పోరాటంలో బౌద్ధాన్ని మాధ్యమంచేస్తే, ఆచార్య మూర్తి సాంప్రదాయ బౌద్ధ దార్శనికతాభిమానిగా కొనసాగారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పాళీ భాష నేర్చుకొని బుద్ధిజాన్ని సంపూర్ణంగా అధ్యయనం చేశారు. ఈ దేశంలోనే కాక ప్రపంచ విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు జరిగేలా దారులు వేశారు. వారిలో ఆచార్య కొత్త సచ్చిదానంద మూర్తి ఒక ప్రముఖులు. ఆయన సత్శీలతా, శాంతి ప్రబోధం వరకు ప్రతిపాదించి భావితరం పరిశోధకులకు బాటలు వేశారు. డాక్టర్ అంబేద్కర్ ఆలోచనల మీద కొన్ని రచనలు కూడా చేశారు. జీవితాన్ని ఇంతగా తత్వశాస్త్రానికి అంకితం చేసిన ఆచార్య మూర్తి వంటి పరిశోధకులు, ఆచార్యుల అవసరం ఈ దేశానికి ఎంతైనా వుంది. గుంటూరులో ఆంధ్రవిశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేట్ సెంటర్ విశ్వవిద్యాలయంగా రూపాంతరం చెందింది. దీనికి ఆచార్య నాగార్జునా విశ్వవిద్యాలయంగా నామకరణం జరగడం వెనుక ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి కృషి వుండి ఉంటుందని ఎవరైనా ఊహించగలరు. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన ఒక శాఖ ఇప్పుడు రాష్ట్రంలో ప్రధాన విశ్వవిద్యాలయంగా మారుతుండటం, స్వర్ణోత్సవాల్లోకి ప్రవేశించడం ఆంధ్రులంతా సంతోషదాయకంగా భావిస్తున్నారు. అలాగే శతాబ్ది ఆంధ్ర విశ్వవిద్యాలయంలోనూ ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి పేరిట ఒక పరిశోధనా కేంద్రం నెలకొల్పితే భారతదేశం గర్వించదగ్గ మరిన్ని పరిశోధనలు జరగడానికి అవకాశం ఉంటుంది. ప్రపంచంలోనే ఆంధ్ర విశ్వవిద్యాలయం వర్ధిల్లుతోందని ఆశించవచ్చు.

మొబైల్ : 9393111740

జెన్ జీ తిరగబడితే!

జెన్ జీ అంటే జనరేషన్ జెడ్ అని అర్థం. వీరినే 'ఐ జెన్' అని పిలుస్తారు. వీరు తిరగబడితే పెద్ద పెద్ద ప్రభుత్వాలే కూలిపోతాయి. ప్రపంచమే మారిపోతుంది. వీరిని తట్టుకోవడం చాలా కష్టం. అర్థం చేసుకోవడం అంతకన్నా కష్టం. వీరంతా టెక్నాలజీ పుత్రులు. జెన్ జీ తర్వాత వచ్చే ఆల్ఫా, బీటా జనరేషన్లయితే ఇక చెప్పనక్కర్లేదు. ఇప్పటికిప్పుడు ప్రపంచ వ్యాప్తంగా దాదాపు అన్ని దేశాలను పాలిస్తున్న బేబీ బూమర్స్ జనరేషన్‌కు ఈ జెన్ జీ పెద్ద తలనొప్పిగా మారిపోయింది. నేపాల్‌లో జెన్ జీ దెబ్బకు ఓలి ప్రభుత్వం కుప్పకూలిపోయింది. జెన్ జీ కుర్రాళ్ల ఆందోళన వెనుక ఏ పార్టీలూ లేవు, ఏ శక్తులూ లేవు. కేవలం ఇన్‌స్టాగ్రామ్, డిస్‌కార్డ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌పామ్‌ల ద్వారానే ఈ నేపాల్ జెన్ జీ విప్లవం సంభవించింది.

జనరేషన్స్ గురించి తెలుసుకోవడం పెద్ద బ్రహ్మవిద్యేమీ కాదు. 1901 నుంచి 1927 మధ్య కాలంలో పుట్టిన వాళ్లను ది గ్రేటెస్ట్ జనరేషన్ (గొప్ప తరం) అని పిలుస్తారు. వీరినే జీఐ జనరేషన్ అని కూడా అంటారు. మొదటి రెండు ప్రపంచ యుద్ధాలకు, ప్రచ్ఛన్న యుద్ధాలకు నాయకత్వం వహించిన వారే వీరు. అంతేకాదు, మదర్ థెరిస్సా, నెల్సన్ మండేలా, నెహ్రూ, అంబేద్కర్, బిర్లా, టాటా వంటివారూ ఈ తరం వారే. ఇక 1928 నుంచి 1945 మధ్యకాలంలో పుట్టిన వారిని ది సైలెంట్ జనరేషన్ అని పిలుస్తారు. ప్రపంచ యుద్ధాలు జరిగిన సమయంలో పుట్టినవారే వీరు. మౌనంగానే ఎదిగి, మహామహులైన వారు వీరంతా. అధునాతన విశ్వ ఆవిష్కరణలకు మూల పురుషులు. ఇక 1946 నుంచి 1964 మధ్యకాలంలో పుట్టినవారిని బేబీ బూమర్ జనరేషన్ అని పిలుస్తారు. 60-70 ఏళ్ల క్రితం పుట్టిన ఈ జనరేషన్ వారే ఈనాటికీ ఈ

ప్రపంచాన్ని పాలిస్తున్నారు. వీరు ఏ పదవి నుంచి దిగరు, కొత్తవారినీ ఎక్కనీయరు. ప్రస్తుతం అన్ని రంగాలనూ ఏలుతున్న జనరేషన్ వీరిదే. అంటే నాయకత్వ స్థానాల్లో ఉన్నది వీరే. బిల్ క్లింటన్, జార్జి బుష్, స్టీవెన్ స్పీల్‌బర్గ్, బిల్ గేట్స్, స్టీవ్ జాబ్స్, ఒబామా, డోనాల్డ్ ట్రంప్, ప్రిన్స్ చార్లెస్, ముఖేష్ అంబానీ, గౌతమ్ అదానీ, నరేంద్ర మోదీ, అమిత్‌షా, నారా చంద్రబాబునాయుడు, కేసీఆర్, రజనీకాంత్, కమల్‌హాసన్, గవాస్కర్ వంటివారెందరో ఈ జనరేషన్‌కు చెందినవారే. వీరి తర్వాత వచ్చిన రెండు కీలకమైన జనరేషన్స్ ఎక్స్, వై. 1965 నుంచి 1980 మధ్యకాలంలో పుట్టినవారిని ఎక్స్ జనరేషన్ అని పిలవగా, 1981 నుంచి 1996 మధ్యకాలంలో పుట్టిన వారిని వై జనరేషన్ అని పిలుస్తారు. ఈ 'వై' జనరేషన్‌వారిని మిలీనియల్స్ అని కూడా అంటారు. ఎక్స్ జనరేషన్‌లో సాంకేతికత పుట్టిపెరిగింది. టీవీ అయినా, కంప్యూటర్ అయినా, స్మార్ట్‌ఫోన్ అయినా, ఇంకేదైనా ఈ జనరేషన్‌లోనే జనించాయి. అందుకే అన్నీ చూసిన తరం వారు వీరేనని అంటూ ఉంటారు.

పవన్ కల్యాణ్, వైఎస్ జగన్, సచిన్ టెండూల్కర్, ఐశ్వర్యారాయ్, ఎలాన్ మస్క్, రాహుల్ గాంధీ వంటి వారు ఈ ఎక్స్ తరానికి చెందినవారే. వై జనరేషన్ దాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లింది. ఇకపోతే, ఎక్స్, వై జనరేషన్స్ ఎంత గొప్ప తెలివైన వారైనా, వీరంతా బేబీ బూమర్స్ అడుగుజాడల్లో పయనించాల్సిందే, వారి కింద పనిచేయాల్సిందే, వారికి సహాయకులుగా ఉండాల్సిందే. అంటే డోనాల్డ్ ట్రంప్‌నకు ఎలాన్ మస్క్ సహాయకునిగా ఉన్నట్లు, చంద్రబాబుకు పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ డిప్యూటీగా ఉన్నట్లు. అంటే కెప్టెన్ ఎవరైనా కష్టపడి గెలిపించేది సచిన్ టెండూల్కర్ అన్నమాట. వీరు ఎట్టిపరిస్థితుల్లోనూ బేబీ బూమర్స్‌ను ఎదిరించలేరు, వారిపై తిరుగుబాటు చేయలేరు. పొరపాటున తిరుగుబాటు చేసినా 90 శాతం అణచివేతకు గురవుతారు.

ది గ్రేటెస్ట్ జనరేషన్, ది సైలెంట్ జనరేషన్, బేబీ బూమర్ జనరేషన్, ఎక్స్ జనరేషన్, వై జనరేషన్ తర్వాత వచ్చిన జనరేషనే 'జెన్ జీ'. 1997 నుంచి 2010 మధ్యకాలంలో పుట్టినవారే ఈ జనరేషన్ జెడ్ లేదా ఐ జెన్ తరం. ఇది ప్రపంచాన్ని మార్చే జనరేషన్. వీరు ఎవ్వరి మాటా వినరు. ఎక్స్, వై జనరేషన్స్ తరహాలో కాకుండా తమకు ఇష్టం లేకపోతే, తిరుగుబాటు చేయడమే వీరికి తెలుసు. వీరు ఫ్రీ బర్డ్స్. స్వేచ్ఛకు ప్రతిరూపాలు. వీరికి ఉద్యోగ భద్రత, స్థిరమైన జీతాలంటే చిరాకు. రోజుకో కంపెనీ మారిపోతారు. టెక్నాలజీతో ఆడుకుంటారు. స్టార్టప్‌లు, క్రియేటివ్ కెరీర్లు, బ్లాగింగ్, వ్లాగింగ్, ట్రావెలింగ్, కుకింగ్, ఒపీనియన్ పోల్స్, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, బ్రాండ్ మేనేజింగ్, హెల్త్-వెల్‌నెస్, ఈ-మార్కెటింగ్, ఈ-కామర్స్, ఈ-స్పోర్ట్స్, గేమింగ్, డిజైనింగ్, ఫైనాన్షియల్ అనలిస్ట్, హెచ్‌ఆర్ స్పెషలిస్ట్, ఎన్ఎఫ్‌టీ నైపుణ్యం, ఈ-స్పోర్ట్స్, రిమోట్ వర్క్ ఫెసిలిటేటింగ్, ఏఆర్ డవలపింగ్, కంటెంట్ క్రియేటింగ్, వీఎఫ్ఎక్స్ డిజైనింగ్, డిజిటల్ మార్కెటింగ్, ఫిల్మ్ మేకింగ్, సోషల్ మీడియా మేనేజ్‌మెంట్...ఇలా ఒకటేమిటి? ఈ తరహా టెక్ ప్రపంచాన్ని ఏలుతున్నవారు ఈ జెన్ జీ తరమే. జెన్ జీ అంటే ఒక సాంకేతిక విప్లవం. అవసరమైతే, వీరు ఓ సాంస్కృతిక విప్లవం అవుతారు. వీరు కొత్త కొత్త మార్గాలను ఎంచుకుంటారు. కాదూ కూడదూ అనుకుంటే, దేశ ఆర్థిక వ్యవస్థను ఒక్క క్షణంలో మార్చేయగలరు. తలచుకుంటే, 24 గంటల్లో ప్రభుత్వాలను కూల్చేయగలరు. అందుకే నేపాల్ ఓ ఉదాహరణ. ఇటీవల ఉన్నట్టుండి ట్రంప్‌పై అమెరికాలో నిరసనలు వెల్లువెత్తినా, బ్రిటన్‌లో వలసవాద వ్యతిరేక నిరసనలు తలెత్తినా,

వివిధ దేశాల్లో సరికొత్త సామ్యవాద వీచికలు పయనించినా, వాటన్నింటికీ నేతృత్వం వహిస్తున్నవారు ఈ జెన్ జీవారే. హ్యాష్‌ట్యాగ్‌లతో వీరంతా పరుగులు తీస్తూ ఉంటారు. స్మార్ట్‌ఫోన్లు, టాబ్లెట్లు, ల్యాప్‌టాప్‌లతో పెరిగే ఈ తరం వారు చాట్‌జీపీటీ, జెమినీ, గ్రోక్ వంటి ఏఐ సాధనాలతో ఆటలాడుకుంటూ ఉంటారు. వర్ణవివక్షకు, లింగ వివక్షకు వ్యతిరేకంగా, పర్యావరణ పరిరక్షణకు కొత్త తరహాలో నడుంబిగించి ప్రపంచవ్యాప్తంగా ఉద్యమశిఖరాలను అధిరోహిస్తున్న ఈ జెన్ జీ పౌరులు (యువకులు) తలచుకుంటే ఏదైనా చేయగలరు. బేబీ బూమర్స్ నాయకుల నీచ ఎత్తుగడలు, నిరుద్యోగం, వివక్షలు, హక్కుల హననం, అసమానతలు వంటివెన్నో జెడ్ జెన్ తరాన్ని ఉద్యమబాట నడిపిస్తున్నాయి. అది నేపాల్ అయినా, అమెరికా అయినా, బ్రిటన్ అయినా... సమీప భవిష్యత్‌లో ఇండియా అయినా! జెన్ జీ తిరగబడితే తట్టుకోవడం వందమంది బేబీ బూమర్లకు సైతం సాధ్యం కాదు. జెన్ జీ తరం కన్నెర్ర చేయకముందే సామాజిక సమానత్వం జరగాలి. లేకుంటే కథ మారితీరుతుంది. 2011-2024 మధ్య పుట్టిన ఆల్ఫా జనరేషన్ జెన్ జీ కు తోడైతే, విప్లవం వర్ధిల్లాల్సిందే!

ఇక సరికొత్త రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థ

న్యూఢిల్లీ: రైలు ప్రమాదాల నివారణపై రైల్వేశాఖ దృష్టి సారించింది. రైలు ప్రమాదాల నివారణ, ప్రయాణాల్లో ఆలస్యాన్ని నివారించడానికి సరికొత్త ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తెస్తోంది. దీనిపై రైల్వే అధికారి నవీన్ కుమార్ మాట్లాడుతూ కొత్త సిగ్నలింగ్ వ్యవస్థలో ఒక స్టేషన్ నుంచి మరొక స్టేషన్‌కు క్రమం తప్పకుండా సిగ్నల్స్ చేరుతాయన్నారు. దీనివల్ల ఒక రైలు సిగ్నల్‌ను దాటగానే... మరో రైలు సిగ్నల్‌ను అందుకొని ట్రాక్‌పైకి వస్తుందన్నారు. గతంలో మొదటి రైలు బ్లాక్ సెక్షన్‌ను దాటే వరకు మరొక రైలును అనుమతించే అవకాశం ఉండేది కాదన్నారు. కొత్త వ్యవవస్థతో తక్కువ సమయంలో ప్రయాణికులకు ఎక్కువ రైళ్లను అందుబాటులోకి తీసుకురావచ్చన్నారు. ఆటోమేటిక్ వ్యవస్థ వల్ల రైలు ప్రమాదాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందన్నారు. ఇటీవల ప్రయోగపూర్వకంగా తూర్పు కోస్ట్ రైల్వే తాల్చేర్-పరదీప్ ఫ్రైట్ కారిడార్‌లోని కటక్-పరదీప్ ప్రాంతాల మధ్య ఈ అత్యాధునిక సిగ్నలింగ్ వ్యవస్థను విజయవంతంగా ప్రారంభించింది. ఈ ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ వల్ల రైల్వే సేవల కోసం మానవులపై ఆధారపడటం తగ్గడమే కాకుండా... ప్రయాణికుల భద్రత, రైలు ప్రమాదాల తగ్గుదల, రైళ్లు ఆలస్యం కాకుండా సరైన సమయానికి గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం వంటి లాభాలు ఉంటాయని నవీన్ కుమార్ తెలిపారు. వాణిజ్యానికి సంబంధించిన ఎగుమతులు, దిగుమతులు త్వరితగతిన జరగడంతో దేశ ఆర్థిక పరిస్థితి మెరుగవుతుందన్నారు.

భూ కుంభకోణం కేసులో ఈడీ దాడులు

న్యూఢిల్లీ: భూకుంభకోణం కేసుతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మంగళవారం జార్ఖండ్, ఢిల్లీలో సోదాలు నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. రాంచీ జిల్లాలోని కాంకే బ్లాక్‌లో జరిగిన భూ కుంభకోణానికి సంబంధించిన కేసులో ప్రధాన నిందితుడు కమలేష్ కుమార్, అతని సహచరులు సర్కిల్ అధికారులతో కుట్ర పన్ని... అక్కడున్న భూమి రికార్డులను తారుమారు చేసి... అమ్ముకొని డబ్బులు సంపాదించారు. ఈ నేరం కిందనే మంగళవారం ఈడీ అధికారులు నిందితుడు కమలేష్ కుమార్ సహచరుడైన బీకే సింగ్‌తోపాటు మరికొందరి ఇళ్లపై దాడులు చేశారు. రాంచీలో ఆరు, ఢిల్లీలో మూడు ప్రదేశాల్లో ఈడీ దాడులు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

కుట్టు అట్ట తిని 200 మంది అస్వస్థత

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో కుట్టు అట్ట (బక్‌వీట్ గింజల పిండి) తిని దాదాపు 200 మంది అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, కడుపు నొప్పితో బాధపడిన బాధితులను బాబు జగ్జీవన్ రామ్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. వాయువ్య ఢిల్లీలోని వివిధ ప్రాంతాల ప్రజలు ఈ విషాహారం బారిన పడ్డారు. పోలీసులు ఆహార శాఖను అప్రమత్తం చేసి, ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు. కలుషితమైన కుట్టు అట్ట అమ్మకాలను నిలిపివేయాలని దుకాణదారులను హెచ్చరించారు. ఆహార శాఖ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు.

బెట్టింగ్ యాప్ కేసులో ఈడీ ముందుకు యువరాజ్ సింగ్

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌తో సంబంధమున్న మనీ ల్యాండరింగ్ కేసులో మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ముందు టీమిండియా మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ హాజరయ్యాడు. బెట్టింగ్ యాప్ 'వన్ ఇ బెట్' బెట్టింగ్ కేసులో దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో సెంట్రల్ ఢిల్లీలో ఉన్న ఈడీ కార్యాలయానికి మధ్యాహ్నం 12 గంటలకు తన లీగల్ బృందంతో చేరుకున్నాడు. ఈడీ అధికారులు ఆయనను ప్రశ్నించారు. వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. పీఎంఎల్‌ఏ కేసులో యువీని ప్రశ్నించారు. ఇదే కేసులో ప్రముఖుడు అన్వేషి జైన్ కూడా ఈడీ ముందు హాజరయ్యాడు. ఇప్పటికే ఈ కేసులో మాజీ క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్ ధావన్, రాబిన్ ఊతప్పలను ఈడీ ప్రశ్నించింది. టీఎంసీ మాజీ ఎంపీ, నటుడు మిథున్ చక్రవర్తి, బెంగాలీ నటుగు అన్‌కుష్ హజ్రాలను కూడా ఈడీ విచారించింది. ఇదే కేసులో బుధవారం ఫిల్మ్ స్టార్ సోనూ సూద్‌ను కూడా ఈడీ విచారించనుంది. 'వన్ ఇ బెట్' బెట్టింగ్ యాప్ ద్వారా కోట్లల్లో స్కామ్ చేసి ప్రజల్ని మోసం చేస్తున్నారని ఈడీ ఆరోపించింది. బెట్టింగ్ యాప్ కేసులో మరికొంత మంది క్రీడాకారులు, నటులు, సెలబ్రిటీలను ప్రశ్నించనున్నారు.

జుబీన్ గార్గ్ మృతికి ఐజేయూ సంతాపం

హైదరాబాద్/చండీగఢ్: అస్సామీ గాయకుడు జుబీన్ గార్గ్ ఆకస్మిక మరణం పట్ల ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) సంతాపం ప్రకటించింది. ఈ మేరకు ఐజేయూ ప్రధాన కార్యదర్శి బల్విందర్ సింగ్ జమ్మూ ఒక ప్రకటన విడుదల చేశారు. సింగపూర్‌లో స్కూబా డైవింగ్ చేస్తూ మరణించిన గాయకుడు, పాటల రచయిత, నటుడు, చిత్ర నిర్మాత, అసోంలోని అతిపెద్ద సాంస్కృతిక కళాకారులలో ఒకరయిన 'జుబీన్ దా'గా ఆయన ప్రసిద్ధి చెందారు. మూడు రోజుల నార్త్ ఈస్ట్ ఫెస్టివల్‌లో పాల్గొనడానికి జుబీన్ సింగపూర్ వెళ్లారు. అస్సామీ ప్రజలకు శోకం, దుఃఖం సమయంలో తోడుగా ఉంటున్నట్లు ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బల్విందర్ జమ్మూ ప్రకటించారు. జుబీన్ పాటలు దేశవ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులలో సజీవంగా ఉంచుతాయని వారు పేర్కొన్నారు. జుబీన్ భార్య, కుటుంబం, అభిమానులందరికీ ఐజేయూ సంతాపం తెలియజేస్తూ... ఆయన గాన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

కోల్‌కతాలో జల విలయం

- కుండపోత వర్షానికి జనజీవనం అస్తవ్యస్తం
- 22 రోజుల్లో కురవాల్సిన వాన ఆరుగంటల్లోనే
- జలదిగ్బంధంలో రోడ్లు, నివాస సముదాయాలు
- వివిధ ఘటనల్లో తొమ్మిది మంది మృతి

కోల్‌కతా: దుర్గా పూజ ఉత్సవాలకు సిద్ధమవుతున్న కోల్‌కతా నగరాన్ని భారీ వర్షం ముంచెత్తింది. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కురిసిన కుండపోత వానకు నగరం అతలాకుతలమైంది. మంగళవారం ఉదయానికి నగరం జలదిగ్బంధంలో చిక్కుకుంది. అనేక ప్రాంతాల్లోని రోడ్లు మోకాళ్ల లోతు నీటిలో మునిగిపోవడంతో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లు, నివాస సముదాయాల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు కార్లు, బైకులు, కూడా నీట మునిగాయి. విమానాశ్రయం నీటమునిగి.. విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ వర్షాలకు మొత్తం 9 మంది ప్రాణాలు కోల్పోయారు. నగరంలో ఏడుగురు విద్యుత్ షాక్‌తో చనిపోగా... వరదల్లో కొట్టుకుపోయి మరో ఇద్దరు దుర్మరణం చెందారు. ఈ నెలలో ఇప్పటి వరకూ కురిసిన వర్షం కంటే ఎక్కువ వర్షపాతం కొద్ది గంటల్లోనే నమోదైంది.కోల్‌కతాలో ఈ నెల 1 నుంచి 22 వరకు 178 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇది సాధారణ వర్షపాతం 213.7 మి.మీ. కంటే 16 శాతం లోటు. కానీ, సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి మంగళవారం ఉదయం 8.30 గంటల మధ్య 24 గంటల్లోనే 247.4 మిల్లీమీటర్ల వర్షం కురవగా.. ఇందులో అధిక భాగం కొద్ది గంటల్లోనే నమోదుకావడం గమనార్హం. ప్రజలు ఎవరూ బయటకు రావద్దని, ఇళ్లలోనే ఉండాలని బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, కోల్‌కతా మేయర్ ఫర్హాద్ హకీమ్ విజ్ఞప్తి చేశారు. ఈశాన్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా కోల్‌కతా, హుగ్లీ, హౌరా సహా బెంగాల్ తీరప్రాంతాల్లో భారీ వర్షం కురిసినట్టు ఐఎండీ తెలిపింది. మరో 24 గంటల పాటు ఈ వాయుగుండం అదే ప్రాంతంలో కొనసాగే అవకాశం ఉందని, దీని ప్రభావంతో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కోల్‌కతా, పరిసర ప్రాంతాల్లో సోమవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్య అత్యంత భారీ వర్షం కురిసింది. దీంతో జనం నిద్ర నుంచి మేల్కొనేసరికి నగరం వరద గుప్పిట్లో చిక్కుకుంది. భారతవాతావరణ శాఖ (ఐఎండీ) గణాంకాల ప్రకారం అత్యధికంగా బల్లిగంజ్‌లో 295 మి.మీ వర్షపాతం నమోదుకాగా.. తర్వాత ముకుందపూర్ (280 మి.మీ.), గరియాహాట్ (262 మి..మీ), జాదవ్‌పూర్ (258 మి.మీ), అలీపూర్ (247.5) లో నమోదయ్యింది. కోల్‌కతాలో 24 గంటల వ్యవధిలోనే 2,633 శాతం అధిక వర్షపాతం నమోదయినట్టు ఐఎండీ వెల్లడించింది. తర్వాత హౌరా 1006 శాతం, ఉత్తర 24 పరగణాలు 857 శాతం అధిక వర్షం కురిసింది. అయితే కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ (కేఎంసీ) లెక్కల ప్రకారం నగరంలోని దక్షిణ, తూర్పు ప్రాంతాల్లో వర్షం తీవ్రత ఎక్కువగా ఉంది. గరియా కమ్‌దహరిలో కేవలం కొన్ని గంటల్లోనే ఏకంగా 332 మి.మీ. వర్షం కురవగా, జోధ్‌పూర్ పార్క్‌లో 285 మి.మీ., కాళీఘాట్‌లో 280.2 మి.మీ. చొప్పున రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. ఈ జలప్రళయం రైల్వే వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపింది. హౌరా, సీల్దా స్టేషన్ యార్డులు నీట మునగడంతో పలు సబర్బన్ రైళ్ల సేవలను పాక్షికంగా రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. హౌరా డివిజన్‌లో ట్రాక్‌లపై నీరు నిలిచిపోవడంతో హౌరా-న్యూ జల్పైగురి, హౌరా-గయ, హౌరా-జమల్‌పూర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సమయాలను మార్చాల్సి వచ్చింది. కోల్‌కతా మెట్రో సేవలకు కూడా అంతరాయం కలగగా, విమానాశ్రయంలో మాత్రం సర్వీసులు సాధారణంగానే కొనసాగాయి. కాగా సెప్టెంబర్ 25న బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. దుర్గా పూజ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్న వేళ ఈ వర్షాలు పండుగ సన్నాహకాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

మరణాలకు సీఈఎస్‌సీదే బాధ్యత: మమత

కోల్‌కతాలో ఏడుగురు విద్యుదాఘాతంతో మరణించడం, నగరంలోని అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దీనికి కలకత్తా విద్యుత్ సరఫరా సంస్థ (సీఈఎస్‌సీ) బాధ్యత వహించాలని పేర్కొంటూ... మృతుల బంధువులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. "ఈ మరణాలకు సీఈఎస్‌సీ బాధ్యత వహించాలి. వారు ఎక్కువ మంది సిబ్బందిని నియమించాలి" అని మమత ఒక ప్రైవేట్ బెంగాలీ వార్తా ఛానెల్‌తో అన్నారు. "వారు ఇక్కడ వ్యాపారం చేస్తున్నారు. కానీ రాజస్థాన్‌లో సౌకర్యాల ఆధునీకరణ జరుగుతోంది. పదేపదే గుర్తు చేసినప్పటికీ వారు ఇక్కడ దానిని చేపట్టడం లేదు. నేను విసిగిపోయాను" అన్నారు. మరణించిన వారి బంధువులకు సీఈఎస్‌సి ఉద్యోగాలు కల్పించాలని ముఖ్యమంత్రి న్యూస్ ఛానెల్‌తో అన్నారు. వారు చేయలేకపోతే, బెంగాల్ ప్రభుత్వం ఆ కుటుంబాలకు అండగా ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు. పదేపదే ప్రయత్నించినప్పటికీ సీఈఎస్‌సీ సీనియర్ అధికారులను సంప్రదించలేకపోయామని ముఖ్యమంత్రి మండిపడ్డారు. 'ఈ రోజు ఎవరూ బయటకు అడుగు పెట్టాల్సిన అవసరం లేదు. ప్రైవేట్ రంగాన్ని పరిస్థితిని మానవతా దృక్పథంతో చూడమని నేను అభ్యర్థిస్తున్నాను. వరద నీరు చాలా మంది ఇళ్లల్లోకి ప్రవేశించింది. లైవ్ వైర్ ఎక్కడ ఉందో ఎవరికీ తెలియదు. జీవితం ముఖ్యం" అని మమత అన్నారు. ప్రైవేట్ రంగ ఉద్యోగులు రాబోయే రెండు రోజులు ఇంటి నుండి పని చేయాలని ముఖ్యమంత్రి అభ్యర్థించారు.

నిరూపించుకోండి... లేదా దిగిపోండి

బీహార్ ఎన్డీయే నేతలపై ఆర్‌కే సింగ్ ఆగ్రహం

పట్నా: బీహార్ బీజేపీ అధ్యక్షుడితోపాటు ఉపముఖ్యమంత్రి, మరో మంత్రిపై జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ చేసిన ఆరోపణలపై కేంద్ర మాజీ మంత్రి ఆర్‌కే సింగ్ చేసిన సంచలన వ్యాఖ్యలు దుమారం రేపాయి. పీకే ఆరోపణలు నిజం కావని నిరూపించుకోవాలని, లేనిపక్షంలో పదవుల నుంచి వైదొలగాలని సొంత పార్టీ నేతలకు ఆర్‌కే సింగ్ స్పష్టం చేశారు. ఎన్నికలకు కొన్ని వారాల ముందే స్వపక్షం నుంచి ఇటువంటి డిమాండు రావడం అధికార పక్షాన్ని ఇరకాటంలో పడేసినట్లయింది. 'బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ జైశ్వాల్‌తోపాటు ఇతర మంత్రులపైనా ప్రశాంత్ కిశోర్ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. ఇవన్నీ పార్టీకి, రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తాయి. ఈ ఆరోపణలను ఖండించే ఆధారాలు ఉంటే మంత్రులు ముందుకు వచ్చి... అవి నిజం కాదని నిరూపించుకోవాలి. అప్పుడు ప్రశాంత్ కిశోర్‌పై పరువునష్టం దావా వేయొచ్చు. లేదంటే ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు వారి పదవుల నుంచి వైదొలగాలి' అని ఆర్‌కే సింగ్ స్పష్టంచేశారు. డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరీ వెంటనే 'డిగ్రీ'కి సంబంధించిన వివరాలు చూపెట్టాలని, తప్పు చేయనప్పుడు సమస్య ఏమిటని ప్రశ్నించారు. గత లోక్‌సభ ఎన్నికల్లో తనకు వ్యతిరేకంగా కొందరు నేతలు పనిచేశారని, వారికి బీజేపీ, జేడీయూ సీట్లు ఇస్తే... వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు వ్యతిరేక ప్రచారం చేస్తానని సింగ్ హెచ్చరించారు. బీహార్ ఉప ముఖ్యమంత్రి పదో తరగతి పూర్తిచేయలేదని, అయినప్పటికీ డిగ్రీ పట్టా ఎలా పొందారని ప్రశాంత్ కిశోర్ ఇటీవల ప్రశ్నించారు. మరో మంత్రి, జేడీయూ సీనియర్ నేత అశోక్ చౌదరిపైనా పీకే అవినీతి ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో కాషాయ పార్టీ నేతలు తీవ్రస్థాయిలో అవినీతికి పాల్పడుతున్నారని, వాళ్లు లాలూ కంటే ఎక్కువ అవినీతిపరులని ధ్వజమెత్తారు. బీజేపీ అధ్యక్షుడు కూడా అక్రమాలకు పాల్పడుతున్నారని, పలు కాలేజీల్లో ఆయనకు వాటా ఉందన్నారు.

ల్యాండింగ్ గేర్‌లో దాక్కొని ఢిల్లీకి అఫ్గనిస్థాన్ బాలుడు

న్యూఢిల్లీ: విమానం చక్రాల వద్ద ఉండే ల్యాండింగ్ గేర్ కంపార్ట్‌మెంట్ లోపల దాక్కుని ఓ అఫ్గనిస్థాన్ బాలుడు(13) కాబుల్ నుంచి ఢిల్లీ చేరుకున్నాడు. ఈ విషయాన్ని గుర్తించిన వెంటనే ఆ బాలుడిని అఫ్గనిస్థాన్‌కు పంపించేసినట్లు అధికారులు వెల్లడించారు. నంబర్ ఆర్‌క్యూ-4401 విమానం చుట్టూ తిరుగుతున్న ఓ బాలుడిని గుర్తించిన కేఏఎం ఎయిర్‌లైన్స్ అధికారులు వెంటనే సెక్యూరిటీ సిబ్బందికి సమాచారం అందించారు. ఆ విమానం కిందికిదిగి అప్పటికి అరగంట మాత్రమే అయింది. విమానంలోని వెనుక సెంట్రల్ ల్యాండింగ్ గేర్ కంపార్ట్‌మెంట్ లోపల దాక్కుని తాను ప్రయాణించినట్లు ఆ బాలుడు వెల్లడించాడు.

ఎగుమతులు తగ్గడం ఆందోళనకరం

కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్

న్యూఢిల్లీ: అమెరికాకు ఫార్మా, స్మార్ట్‌ఫోన్ వంటి సుంకం లేని ఉత్పత్తుల ఎగుమతులు తగ్గడంపై కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేసింది. 'ఇది కచ్చితంగా కాలానుగుణంగా వచ్చే తగ్గుదల కాదు' అని పేర్కొంది. కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ 'ట్రంప్ సుంకాల పెరుగుదల కారణంగా అమెరికాకు భారతదేశ ఎగుమతులు తగ్గుతాయని ఊహించవచ్చు. నిజానికి తగ్గాయి. అసలు సుంకం లేని ఎగుమతులు ఎందుకు, ఎలా తగ్గుతున్నాయి' అని ప్రశ్నించారు. న్యూఢిల్లీకి చెందిన పరిశోధనా సంస్థ జీటీఆర్ఐ విశ్లేషణ ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు. వాస్తవానికి రత్నాలు, ఆభరణాలు, సముద్ర ఆహారాలు, వస్త్రాలు, దుస్తులు, రసాయనాల ఎగుమతులు తగ్గాయని ఇది వెల్లడిస్తుంది. ఆశ్చర్యకరంగా భారతదేశానికి చెందిన సుంకం లేని ఉత్పత్తుల ఎగుమతి కూడా మే 2025లో 3.37 బిలియన్ల డాలర్ల నుంచి ఆగస్టు 2025లో 1.96 బిలియన్ల డాలర్లకు తగ్గింది. ఇందులో ఔషధాలు, స్మార్ట్‌ఫోన్‌ల ఎగుమతులు కూడా ఉన్నాయి' అని జైరాం రమేశ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. 'ఇది కచ్చితంగా కాలానుగుణ పతనం కాదు' అని అన్నారు.

జైలు నుంచి ఆజంఖాన్ విడుదల



సీతాపూర్: సమాజ్‌వాది పార్టీ (ఎస్పీ) నాయకుడు, ఉత్తరప్రదేశ్ మాజీ మంత్రి ఆజంఖాన్ దాదాపు 23 నెలల తర్వాత సీతాపూర్ జైలు నుంచి విడుదలయ్యారు. ఆజంఖాన్ విడుదల కొన్ని గంటలు ఆలస్యమైంది. మంగళవారం ఉదయం 8.00 గంటలకు ఆయన విడుదల కావాల్సి ఉంది. రెండు కేసుల్లో రూ.8 వేలు జరిమానా చెల్లించడం మరిచిపోయారు. కోర్టులో జరిమానా చెల్లించిన తర్వాత ఆయనను విడుదల చేశారు. ఆజంఖాన్ విడుదల నేపథ్యంలో సీతాపూర్ నగరంలో సెక్షన్ 144 కింద నిషేధాజ్ఞలు విధించారు. అయినప్పటికీ జైలు వెలుపల పెద్ద సంఖ్యలో ఎస్పీ కార్యకర్తలు, నాయకులు, మద్దతుదారులు వేచి ఉండటంతో అధికారులు వారిని చెదరగొట్టారు. ఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఛత్రపాల్ సింగ్ యాదవ్ కూడా ఆజంఖాన్‌కు స్వాగతం పలకడానికి సన్నాహాలు చేశారు. క్వాలిటీ బార్ భూ కబ్జా కేసులో ఆజంఖాన్‌కు సెప్టెంబరు 18న అలహాబాద్ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ నెల ప్రారంభంలో రాంపూర్‌లోని దుంగర్‌పూర్ కాలనీ నుంచి నివాసితులను బలవంతంగా బహిష్కరించారనే ఆరోపణలతో సంబంధం ఉన్న మరో కేసులో అలహాబాద్ హైకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది.

తప్పుడు కేసులన్నీ ఉపసంహరిస్తాం: అఖిలేశ్

ఆజంఖాన్ జైలు నుంచి విడుదలను సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ స్వాగతించారు. ఉత్తర ప్రదేశ్‌లో పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అతనిపై ఉన్న అన్ని తప్పుడు కేసులు ఉపసంహరిస్తామని ప్రకటించారు. 'ఆజంఖాన్ సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపక సభ్యుడు మాత్రమే కాదు... సమాజ్‌వాదీ (సోషలిస్ట్) ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. ఈ రోజు చాలా ఆనందంగా ఉంది. చివరకు ఆయనకు న్యాయం జరిగింది' అని అఖిలేశ్ ఇక్కడ విలేకరులతో అన్నారు. 'బూటకపు కేసులు ఎదుర్కొంటున్న జర్నలిస్టులకు కూడా ఉపశమనం లభిస్తుంది' అని ఆయన నొక్కి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పోలీసు రికార్డుల నుంచి, ప్రజా నోటీసుల నుంచి కుల ప్రస్తావనలను తొలగించాలని, కుల ఆధారిత ర్యాలీలు, ప్రజా కార్యక్రమాలను నిషేధించాలని ఆదేశించడంపై అఖిలేశ్ మాట్లాడుతూ పీడీఏ (వెనుకబడిన, దళిత, మైనారిటీ) వర్గాలు ఏకం కావడం పట్ల బీజేపీ భయపడుతోంది' అని అన్నారు.

ధరలు పర్యవేక్షిస్తున్నాం: కేంద్రం

న్యూఢిల్లీ: జీఎస్‌టీ సంస్కరణలు అమల్లోకి రావడంతో నిత్యావసరాల నుంచి కార్ల వరకు పన్నుల భారం తగ్గి... కొనుగోలుదార్లకు భారీగా సొమ్ము ఆదా అవుతుందని కేంద్రం ప్రచారం చేసుకుంటుంది. కానీ జీఎస్టీ 2.0 అమల్లోకి వచ్చినప్పటికీ కొన్ని ఈ-కామర్స్ వేదికలు ఆ ప్రయోజనాలను బదిలీ చేయడం లేదంటూ ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిపై కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పందిస్తూ... ఈ ఫిర్యాదులపై ఆరా తీస్తున్నట్లు వెల్లడించాయి. 'ధరల మార్పును పర్యవేక్షిస్తున్నాం.

ఈ ఫిర్యాదులపై ఇప్పుడే స్పందించలేం. సెప్టెంబర్ 30లోగా క్షేత్రస్థాయిలో జీఎస్టీ అమలుపై నివేదిక అందనుంది' అని పేర్కొన్నాయి. జీఎస్టీ 2.0 సోమవారం నుంచి అమల్లోకి వచ్చింది. ప్రభుత్వ అంచనాల ప్రకారం... స్టేషనరీ, దుస్తులు, పాదరక్షలు, ఔషధాలపై ఖర్చులు 7-12 శాతం తగ్గనున్నాయి. వ్యక్తిగత ఆరోగ్య, జీవిత బీమా పాలసీలపై ఉన్న 18 శాతం పన్ను తొలగించడంతో.. ఈ మేరకు ఆదా కానుంది. మొత్తం 375 రకాల వస్తువులపై జీఎస్‌టీ రేట్లు తగ్గాయి.

యువతకు అతిపెద్ద సమస్య నిరుద్యోగం

ఇది 'ఓట్ల దొంగతనం'తో ముడిపడి ఉంది: రాహుల్

న్యూఢిల్లీ: 'ఓట్ల దొంగతనం' జరుగుతున్నంత వరకు నిరుద్యోగం, అవినీతి పెరుగుతూనే ఉంటుందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ మంగళవారం పేర్కొన్నారు. యువత ఇకపై 'ఉద్యోగ దొంగతనం', 'ఓట్ల దొంగతనం'ను సహించరని నొక్కి చెప్పారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ ఎక్స్ వేదికగా బీజేపీ సర్కారుపై విరుచుకుపడ్డారు. నిరుద్యోగం భారతదేశ యువత ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య అని, ఇది నేరుగా 'ఓట్ల దొంగతనం'తో ముడిపడి ఉందని ఆరోపించారు. ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం మొదటి కర్తవ్యం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమని ఆయన అన్నారు. 'బీజేపీ నిజాయతీగా ఎన్నికల్లో గెలవదు. ఓట్లు దొంగిలించడం, సంస్థలను నియంత్రించడం ద్వారా అధికారంలో ఉంటుంది' అని రాహుల్ గాంధీ విమర్శించారు. అందుకే నిరుద్యోగం 45 సంవత్సరాల గరిష్ట స్థాయికి చేరుకుందని ఆయన అన్నారు. 'ఉద్యోగాలు తగ్గుతున్నాయి, నియామక ప్రక్రియలు కుప్పకూలిపోయాయి. యువత భవిష్యత్ ప్రమాదంలో పడింది. అందుకే ప్రతి పరీక్షా పత్రం లీక్, ప్రతి నియామకం అవినీతి కథలతో ముడిపడి ఉంది' అని మండిపడ్డారు. 'దేశ యువత కష్టపడి పని చేస్తారు. కలలు కంటారు. భవిష్యత్ కోసం పోరాడతారు. కానీ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధికారం లాక్కోవడంపైనే దృష్టి పెట్టారు. ప్రముఖులు తనపై ప్రశంసలు కురిపించేలా చేశారు. బిలియనీర్లు లాభాలు ఆర్జించడం, యువత ఆశలను దెబ్బతీయడం, వారిని నిరాశపరచడం ప్రభుత్వ గుర్తింపుగా మారింది' అని కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారు. 'ఇప్పుడు పరిస్థితి మారుతోంది. నిజమైన పోరాటం ఉద్యోగాల కోసం మాత్రమే కాదు... ఓటు దొంగతనానికి వ్యతిరేకంగా అని యువత అర్థం చేసుకుంది. ఎందుకంటే ఓట్లు దొంగిలించబడినంత కాలం నిరుద్యోగం, అవినీతి పెరుగుతూనే ఉంటుంది' అని ఆయన అన్నారు. 'ఇప్పుడు అంతిమ దేశభక్తి భారతదేశాన్ని నిరుద్యోగం, ఓటు దొంగతనం నుంచి విముక్తి చేయడంలో ఉంది' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు కోరుతూ నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జి చేస్తున్న వీడియోను, మరొక భాగంలో ప్రధాని మోదీ మొక్కలు నాటడం, నెమళ్లకు ఆహారం పెట్టడం, యోగా సాధన చేస్తున్న వీడియో దృశ్యాలను రాహుల్ పంచుకున్నారు.

జుబీన్ గర్గ్‌కు కన్నీటి వీడ్కోలు

గువహతి: ప్రముఖ అస్సామీ గాయకుడు జుబీన్ గర్గ్ అంత్యక్రియలు పూర్తయ్యాయి. గువహతిలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అస్సామీ మహిళలు ధరించే సంప్రదాయ దుస్తులైన మేఖేలా చాదర్‌ను గార్గ్ భార్య ధరించారు. చితికి మంటలు అంటుకుంటున్న సమయంలో రెండు చేతులు జోడించారు. ఎక్కి ఎక్కి ఏడుస్తూ కనిపించారు. పలువురు ఆమెను ఓదార్చారు. జుబీన్ గర్గ్ అంత్యక్రియలకు కేంద్ర మంత్రులు సర్బానంద సోనోవాల్, కిరన్ రిజిజు, పవిత్రా మార్గరీటా, అసోం ముఖ్యమంత్రి హిమంత విశ్వశర్మ, అసెంబ్లీ స్పీకర్ విశ్వజిత్ దైమరీ, పలువురు కేబినెట్ మంత్రులు, సీనియర్ ప్రభుత్వ అధికారులు హాజరై శవపేటికపై పూల మాలలు వేసి నివాళులర్పించారు. సోనోవాల్, మార్గరీటా, హిమంత విశ్వశర్మ, ప్రతిపక్ష నాయకుడు దేబబ్రత సైకియా మోకాళ్లపై నిలబడి నివాళులర్పించారు. జుబీన్ గర్గ్ గౌరవార్థం రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు మూసేశారు. కడసారి చూపు కోసం వేలాది మంది అభిమానులు, ప్రజలు అంత్యక్రియలకు తరలివచ్చారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా భారీ ఎత్తున పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. జుబీన్ గార్గ్ సింగపూర్‌లో జరిగే నార్త్ ఈస్ట్ ఇండియా ఫెస్టివల్‌కు హాజరయ్యేందుకు వెళ్లారు. సెప్టెంబర్ 19న బోటుపై షికారు చేస్తుండగా ప్రాణాలు కోల్పోయారు. బోటులోంచి లైఫ్ జాకెట్ ధరించి నీళ్లలోకి దూకి ఈత కొట్టడం ప్రారంభించారు. కానీ శ్వాస తీసుకోవడంలో ఇబ్బందికి గురైనట్లు కనిపించారు. కొద్దిసేపటికే ఆయన స్పృహ కోల్పోయారు. కొద్దిసేపు నీళ్లలోనే శవంలా ఉండిపోయారు. అనంతరం సహచరులు ఆస్పత్రికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదు.

రాజకీయ కారణాలతో వీసా ఫీజుల పెంపు

ట్రంప్ నిర్ణయంపై శశిథరూర్

న్యూఢిల్లీ: హెచ్1బీ వీసాల ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకొన్న నిర్ణయంపై తాజాగా కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ స్పందించారు. రాజకీయ కారణాలతోనే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకొని ఉండొచ్చన్నారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో శశిథరూర్ మాట్లాడుతూ 'ట్రంప్ నిర్ణయాలు దేశీయ రాజకీయాలతో ముడిపడి ఉంటాయి. హెచ్1బీ వీసాల కారణంగా ఎక్కువ జీతాలు తీసుకొనే అమెరికన్ల కంటే... తక్కువ జీతాలు తీసుకొనే భారతీయుల వైపే అక్కడి కంపెనీలు మొగ్గుచూపుతున్నాయని ట్రంప్, ఆయన కార్యవర్గం భావిస్తోంది. అయితే, ఫీజు లక్ష డాలర్లకు పెంచితే తమకు కావాల్సిన... ఎక్కువ నైపుణ్యం కలిగిన వ్యక్తులు మాత్రమే అమెరికాకు వస్తారని వారు అనుకుంటున్నారు. ఈ నిర్ణయం వెనక ట్రంప్ లాజిక్ ఏంటో, ఇది నిజంగా వర్కౌట్ అవుతుందా అనేది నాకు అర్థం కావడం లేదు. దీంతో అనేక కంపెనీలు ఎక్కువ ఉద్యోగాలను అవుట్‌సోర్సింగ్‌కు ఇచ్చేస్తాయి' అని పేర్కొన్నారు. భారత దిగుమతులపై ట్రంప్ పెద్ద మొత్తంలో సుంకాలు విధించడంపైనా థరూర్ మాట్లాడారు. అనేక సమస్యల పరిష్కారానికి సుంకాలు అనేవి ఒక మాయా సాధనంగా ట్రంప్ భావిస్తున్నారన్నారు. ఈ టారిఫ్‌ల నుంచి వచ్చే బిలియన్ డాలర్లతో అమెరికాలో నెలకొన్న లోటు పూడ్చాలనేది ఆయన ఉద్దేశమై ఉంటుందన్నారు. అయితే, భారత్‌పై సుంకాల విధింపుతో ఆయనకు ఇక్కడ తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైందన్నారు. భారత్‌ను ఉద్దేశిస్తూ తరచూ ట్వీట్‌లు పెట్టడం, ఆయన సలహాదారుడు నవారో అభ్యంతరకర వ్యాఖ్యలతో రెండు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ట్రంప్ విధించిన టారిఫ్‌లు భారత్‌కు ఎదురుదెబ్బేనన్నారు.

మోదీ నివాసం వద్ద గుంతలు లేవా?

డీకే శివకుమార్ ఎదురుదాడి

బెంగళూరు: టెక్ సిటీ బెంగళూరులో ప్రధాన రహదారులన్నీ గుంతలమయమయ్యాయి. దీంతో ఉద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లకు మరమ్మతు చేయాలంటూ బెంగళూరు వాసులు ఆందోళన కూడా చేశారు. ప్రతిపక్ష బీజేపీ కూడా తీవ్ర విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్ ప్రభుత్వ తీరు కారణంగా ఐటీ కంపెనీలు తరలిపోతున్నాయని ఆరోపించింది. బెంగళూరు శిథిలావస్థకు చేరుకుంటోందని, టెక్ హబ్‌ను గుంతల నగరంగా మార్చారంటూ కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి ఆరోపించారు. బీజేపీ ఆరోపణలపై కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మంగళవారం స్పందించారు. 'రోడ్లపై గుంతలు కేవలం కర్నాటకలోనే ఉన్నాయా? నిన్న నేను ఢిల్లీ వెళ్తే ప్రధాని మోదీ నివాస రోడ్డులోనూ గుంతలు కనిపించాయి. కానీ మీడియా మాత్రం కర్నాటక రోడ్లు మాత్రమే చూపిస్తున్నాయి' అని డీకే శివకుమార్ ఎదురుదాడి చేశారు. భారీ వర్షాల కారణంగా దేశవ్యాప్తంగా రోడ్లు గుంతలమయమయ్యాయన్నారు. అయినా ఓ వైపు వర్షాలు పడుతున్నప్పటికీ వేలాది గుంతలు పూడ్చుతూనే ఉన్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, దీనికి బీజేపీనే కారణమన్నారు. ఉద్దేశపూర్వకంగానే కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న కర్నాటకలోనే గుంతలను బీజేపీ చూపిస్తోందని ధ్వజమెత్తారు. నవంబర్ నాటికి గుంతలు పూడ్చడానికి కాంట్రాక్టర్లకు తుది గడువు ఇచ్చామని, నగరవ్యాప్తంగా రోడ్డు మరమ్మతు, నిర్మాణం కోసం రూ.1,100 కోట్లు కేటాయిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. 'మా లక్ష్యం పరిశుభ్రమైన బెంగళూరు, సజావుగా ట్రాఫిక్ సాగడం. గుంతలను వీలైనంత త్వరగా తొలగించేలా చూస్తాం' అని డీకే శివకుమార్ స్పష్టం చేశారు.

విశాలాంధ్ర హైదరాబాద్

ముంపు ప్రాంతాల్లో పర్యటన

విశాలాంధ్ర, మల్కాజిగిరి : ముంపు ప్రాంతాల్లో మల్కాజిగిరి ఉప కమిషనర్ జకియా సుల్తానా కార్పొరేటర్ ప్రేమ్ కుమార్‌లతో కలిసి పర్యటించారు. సోమవారం రాత్రి కురిసిన వర్షంలో అధికారులతో కలిసి సత్తి రెడ్డి నగర్, సత్య రాఘవేంద్ర కాలనీ, దుర్గానగర్ లోతట్టు ప్రాంతాలలో పర్యటించి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాలనీల్లో నీరు నిల్వకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ ప్రేం కుమార్ కోరారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఈ.ఈలక్ష్మణ్, డి.ఈ.ఈ లౌక్య, సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, శాస్త్రి తదితరులు పర్యటనలో పాల్గొన్నారు.

యుపీహెచ్‌సీ స్థల పరిశీలన

విశాలాంధ్ర, మల్కాజిగిరి : వినాయక్ నగర్ డివిజన్‌లో యుపీహెచ్‌సీ భవన నిర్మాణానికి సాయి నగర్‌లో పోలీస్ కమిషనర్ కార్యాలయం పక్కన 500 గజాల వరకు ప్రభుత్వ స్థలం జిల్లా కలెక్టర్ కేటాయించడం జరిగింది. ఈ స్థల పరిశీలన కోసం వినాయక్ నగర్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి, ఏఈ నవీన్ కుమార్, సూపర్‌వైజర్ వెంకటేష్, రమేష్‌లతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ భవన నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ రూ.1 కోటి 43 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఇప్పటి వరకు యుపీహెచ్.సి అద్దె భవనంలో కొనసాగుతుండడం, అద్దె భవనం సరిపోని పరిస్థితి నెలకొందని కార్పొరేటర్ తెలిపారు. త్వరలోనే డిజైన్ ఫైనలేజ్ చేసి, టెండర్ పిలిచి తరువాత ఈ భవన నిర్మాణం చేపడతామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు ఓం ప్రకాష్, సాయి సురేష్, సుమలత, మల్లేష్ యాదవ్, సోమనాథ్ చారి, పంజా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ : కార్పొరేటర్

విశాలాంధ్ర, మల్కాజిగిరి : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించినప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా జీవిస్తారని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పేర్కొన్నారు. మహిళల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'స్వస్త్ నారీ-సశక్తి పరివార్ అభియాన్ పేరుతో ప్రత్యేక వైద్య శిబిరాన్ని మల్లికార్జున నగర్ లోని ఏకలవ్య నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం మంగళవారం మహిళలకు రెండు రోజులకు పాటు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి కార్పొరేటర్ సునీత రాము యాదవ్ పాల్గొని మహిళల ఆరోగ్య పరిస్థితిలను డాక్టర్ రాధాతో కలిసి అడిగి తెలుసుకున్నారు. మహిళలకు విటమిన్ బి12, విటమిన్ డి పరీక్షలతో పాటు మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, క్యాన్సర్ సంబంధిత పరీక్షలతో పాటు చెవి, ముక్కు, చర్మ, దంత, గొంతు, మానసిక రుగ్మతలు ఓరల్ సర్వే, మూత్రకోష సంబంధిత ఇన్ఫెక్షన్లు ఫెల్విక్, ఇన్ఫ మీటరీ, నెలసరి పరీక్షలు, సంతాన సమస్యలపై ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. బుధవారం రెండవ రోజు గైనిక్ పరీక్షలతో పాటు ఇతర ముఖ్య పరీక్షలు నిర్వహిస్తామని డాక్టర్ రాధా తెలిపారు. అనంతరం మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లతో పాటు పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది, నర్సులతో పాటు బీఆర్ఎస్ నాయకులు మేకల రామ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

OFFICE OF THE RECOVERY OFFICER - I/II
DEBTS RECOVERY TRIBUNAL (DRT-1)
3rd Floor, Triveni Complex (Palce Heights) Abids, Hyderabad-500001

DEMAND NOTICE

NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1991 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961.

R.C.No.43/2025 07-08-2025

Union Bank of India
Versus
M/s. CIRCUIT COMPUTER SERVICES

To:
(CD 1): M/s. Circuit Computer Services, Mr.K Venkat Reddy Satyanarayana Reddy, Rep. By Its Proprietor, Plot No. 45, Behind Huda, Maitrivanam, Gayatri Nagar Ameerpet, Hyderabad, Telangana-500038
(CD 2): Sri K. Venkat Reddy S/o Satyanaryana Reddy, Aged About 47yrs, Occ: Business, R/o Flat No.105, Sun Valley Apartmetns, Kondapur, Hyderabad- 500084
(CD 3): Mrs. K. Satyavathi (Died) W/o K. Satyanaryana Reddy, R/o D.No.10-1-74, Tallamudunurupadu Village, Tadepalligudem Municipality, West Godavari District.
(CD 4): Mr. Ch. Shivanga Prasad S/o Venkateshwarlu, Aged 59yrs, Occ: Technician, R/o Flat No.501, SVSVJ Mansion, MIG 401-404, Kukatpally, Hyderabad
(CD 7): Smt. Krishnaveni W/ Venkata Krishna Reddy, Aged About 49yrs, R/o D.No.2-225, Ubalanka Village, Ravulapalem Mandal, East Godavari Dist,. A.P.

This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, DEBTS RECOVERY TRIBUNAL, HYDERABAD (DRT-1) in OA/81/2022 an amount of **Rs.33,31,803/- (Thirty Three Lakhs Thirty One Thousand Eight Hundred Three Only)** along with pendentellite and future interest @ 14% Simple Interest Yearly w.e.f. **23/03/2022** till realization and costs of **Rs.66,000/- (Rupees Sixty Six Thousands Only)** has become due against you (jointly and severally/Fully/Limited).

2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.

3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.

4. You are hereby ordered to appear before the undersigned on **17.09.2025 at 10:30 a.m.** for further proceedings.

5. In addition to the sum aforesaid, you will also beliable to pay:

(e) Such interests as is payable for the period commencing immediately after this notice of the certificate / execution proceedings.

(f) All costs, charges and expenses incurred in respect of the service of this notice and warrants and other processes and all other proceedings taken for recovering the amount due.

Given under my hand and the seal of the Tribunal, on this date: **07-08-2025**

Sd/- Recovery Officer
DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT-1)

జీఎస్టీ తెచ్చి పేదల నడ్డి విరిచారు : మంత్రి పొన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : జీఎస్టీతో పేదలకు లబ్ది చేసినట్లు బీజేపీ నాయకులు బిల్డప్ ఇస్తున్నారని తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. 8 సంవత్సరాలుగా బీజేపీ ప్రజలను దోచుకుందని, కేంద్ర ప్రభుత్వం ఇన్ని రోజులు పేద ప్రజల రక్తం తాగిందని విమర్శించారు. జీఎస్టీ అంటే గబ్బర్ సింగ్ టాక్స్ అని మొదటి నుండి చెప్తున్నామని పేర్కొన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదలను దోచుకోవడానికి జీఎస్టీ తెచ్చారని, శవ పేటికలపై, పసి పిల్లల తినుబండారాలపై జీఎస్టీ వేశారన్నారు. ఇంతవరకు కేంద్రం జీఎస్టీ ట్యాక్స్‌తో ఏదైనా మంచిపని చేశారా అని మండిపడ్డారు. ఆర్థిక సంక్షోభం నుండి తప్పించుకోవడానికే మోదీ ప్రభుత్వం వెనక్కి తగ్గిందని పేర్కొన్నారు. తెలంగాణకు రూ.7 వేల కోట్ల నష్టం వస్తోందని, దీన్ని పూడ్చే బాధ్యత కేంద్రానిదే అని స్పష్టం చేశారు. తెలంగాణ ఎంపీలు, కేంద్ర మంత్రి సంజయ్, కిషన్ రెడ్డిలు తెలంగాణకి వస్తున్న నష్టాన్ని ఎలా పుడుస్తారో చెప్పాలన్నారు. కేంద్రం పెద్దన్న పాత్ర పోషించి అండగా ఉండాలని, గుజరాత్, ఏపీ, బీహార్ లాంటి రాష్ట్రాలను తప్పా జీఎస్టి తెచ్చి పేదల నడ్డి విరిచింది మీరే... ఇప్పుడు తగ్గించింది మీరే అంటూ విమర్శించారు. జీఎస్టీ తగ్గింపు అంత ఎన్నికల డ్రామా.. ఇంకా జీఎస్టీ ఫలాలు పేదోడికి అందలేదని, జీఎస్టీ స్లాబుల పేరుతో ప్రతి వస్తువు మీద అదనపు పన్నులు వేసి పేదలు మోయలేని భారాన్ని చేశారని ధ్వజమెత్తారు. జీఎస్టీ వచ్చి 8 సంవత్సరాలు అయిందని, 8 సంవత్సరాల తర్వాత ప్రజలకు ఇన్ని వేల కోట్లు ఆదా అవుతున్నాయని చెబుతున్నారని, అంటే 8 సంవత్సరాలు మీరు ప్రజల రక్తం పీల్చుకు తిన్నట్టే కదా అని అన్నారు. మా నాయకుడు రాహుల్ గాంధీ మొదటి నుండి చెబుతున్నారని, ఇది సహేతుకంగా లేదని, స్లాబులు కాదు రేట్లు తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. కాని కేంద్ర ప్రభుత్వ మాత్రం పెడచెవిన పెట్టిందన్నారు. మీరు తెచ్చిన జీఎస్టీలో 18, 24 శాతలలో ప్రజలు అధికంగా వినియోగించే వస్తువులు చేర్చారని, పది సంవత్సరాలపాటు జీఎస్టీ రూపంలో దోచుకున్నారని అన్నారు. గడిచిన ఆరు మాసాల కాలంలో 22 లక్షల కోట్ల ఆదాయం వచ్చిన స్వయంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల విశాఖపట్నంలో మాట్లాడారు.. దీనిని బట్టి జీఎస్టీ రూపంలో పిండేసి ఇప్పుడు వెన్నపూసినట్లుగా 5,18 శాతం మాత్రమే పరిమితం చేస్తున్నట్లు చెప్తున్నారని తెలిపారు. జీఎస్టీతో నిత్యవసర వస్తువుల ధరలు డబుల్ అయ్యాయని, రూ.10లు ఉన్న ఉప్పు పాకెట్ 20 రూపాయలు అయింది, రూ.60లు ఉన్న కందిపప్పు రూ.160 అయింది, రూ.70లు ఉన్న ఆయిల్ పాకెట్ రూ.160లు అయిందన్నారు. టీపీసీసీ ఎన్నారై సెల్ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో గల్ఫ్ సంక్షేమ బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యకుమానికి ముఖ్య అతిథిగా పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు పూలతో పూజించే వేడుకగా జరుపుకునే పండుగ బతుకమ్మ అన్నారు. ఈ సందర్భంగా మహిళలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా ప్రతి నిధులు లేరు మన పార్టీ కార్యకర్తలు అన్ని ఏర్పాట్లు చేసుకునే విధంగా పీసీసీ ఆదేశాలు ఇవ్వాలన్నారు. తెలంగాణ టూరిజం సంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రోజుక ప్రాంతంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. ఈసారి గిన్నిస్ బుక్ రికార్డ్ ఎక్కెల ప్రభుత్వం బతుకమ్మ వేడుకలు జరుపుతుందన్నారు. బతుకమ్మ పండుగ కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ ఇబ్బందులు లేకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని ఏర్పాట్లు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ గద్వాల విజయ లక్ష్మీ, వెన్నెల గద్దర్,కాల్వ సుజాత, భవాని రెడ్డి, ఎన్నారై సెల్ వినోద్, ఎన్నారై అడ్వయిజరీ కమిటీ మెంబర్ చెన్నమనేని శ్రీనివాస రావు, మహిళా కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని వినతి

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహబూబ్‌నగర్ నగరంలో రైల్వే ఓవర్ బ్రిడ్జిలు నిర్మాణం చేపట్టాలని మహబూబ్ నగర్ ఎంపీ డికె అరుణ నేతృత్వంలో మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నని న్యూఢిల్లీలోని వారి కేంద్ర కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పిం చారు. మహబూబ్‌నగర్ నగరం పరిధిలో ఉన్న రైల్వేగేట్ల వల్ల ఏర్పడే భారీ వాహనాల రద్దీ కారణంగా పౌరులకు అసౌకర్యం కలుగుతుందని వారు మంత్రి దృష్టికి తీసుకువెళ్ళారు. నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న రద్దీ కారణం ప్రజలు వారి నిత్య కార్యకలాపాలు, అత్యవసర కార్యకలాపాలకు పెద్ద అడ్డంకిగా మారిందని, సరైన రోడ్డు, రైలు విభజన లేకపోవడం వల్ల నగరం మొత్తం రద్దీగా ఉంటుందని, అనేక కిలోమీటర్ల వరకు తీవ్రస్థాయి ట్రాఫిక్ జాములు , పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, కార్యాలయం వెళ్లే వారు, వ్యాపారులకు రోజువారిగా అసౌకర్యం ఏర్పడుతుందని వారు మంత్రి దృష్టికి తీసుకుపోయారు. ఎక్కువ సమయం రైల్వే గేట్లు మూసి ఉండటం వల్ల అంబులెన్స్, అత్యవసరం ప్రయాణాలు సైతం ఆలస్యం అవుతుందని దీనివలన చాలా కాలంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు మంత్రికి చెప్పారు. రైల్వే ఓవర్ బ్రిడ్జిలు లేకపోవడం వలన నగరంలో మొత్తం ప్రభావం చూపుతుంది అని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యలు తీరాలంటే వెంటనే, అత్యవసరమైన తిరుమల దేవుని గుట్ట రైల్వే గేటు, బోయపల్లి రైల్వే గేటు, తిమ్మసానిపల్లి రైల్వే గేట్లలో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిలను 100శాతం కేంద్ర ప్రభుత్వ నిధులతో త్వరితగతిన నిర్మాణం చేయాలని మంత్రిని కోరారు. అలాగే సద్దల గుండు, దివిటిపల్లిలో పాదాచారుల కోసం ఓవర్ బ్రిడ్జిలు (ఎఫ్ ఓబీ) ఏర్పాటు చేయడం వలన ప్రజలకు మేలు జరుగుతుందని మంత్రి దృష్టికి తీసుకురాగా, నగరంలో 100శాతం కేంద్ర నిధులతో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిలను, పాదాచారుల ఓవర్ బ్రిడ్జిలను నిర్మించేందుకు మంత్రి సుముఖంగా స్పందించారని, ఖచ్చితంగా 100శాతం కేంద్ర ప్రభుత్వ నిధులతో రైల్వే ఓవర్ బ్రిడ్జిలు నిర్మాణాలు చేస్తామని ఎంపి, ఎమ్మెల్యేలకు ఆయన హామీ యిచ్చారు.

భూసేకరణ వేగవంతం చేయాలి : కమిషనర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్‌లో ట్రాఫిక్‌కు చెక్ పెట్టేలా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హెచ్ - సిటీ పనులను సంబంధించి భూసేకరణను వేగవంతం చేయాలని, పనుల గ్రౌండింగ్ సాధ్యమైనంతర త్వరగా ప్రారంభించాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, చీఫ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్) భాస్కర్ రెడ్డి, జూబ్లీహిల్స్ డిప్యూటీ కమిషనర్ వి. సమ్మయ్యతో కలిసి జూబ్లీహిల్స్ రోడ్ నం.2 నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు కేబీఆర్ పార్కు ప్రాజెక్టు భూ సేకరణ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. హెచ్ -సిటీలో కీలకమైన కేబీఆర్ పార్కు ప్రాజెక్టులో భాగంగా కేబీఆర్ పార్క్ చుట్టుపక్కల ఏడుకీలక జంక్షన్లలో రాబోయే రోజుల్లో 4.6 కి.మీ పొడవు గల ఫ్లైఓవర్లు, 2.8 కి.మీ అండర్‌పాసులు నిర్మించనున్నారు. వీటితో నగరంలో అత్యంత రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సులభతరం అవ్వడంతో పాటు, రద్దీ గణనీయంగా తగ్గనుంది. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్ వి కర్ణన్ కేబీఆర్ పార్కు ప్రాజెక్టు గ్రౌండింగ్‌కు జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌లు, ఇంజనీరింగ్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పనుల గ్రౌండింగ్ వేగంగా చేపట్టడమే కాకుండా, పనుల అమలులో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ పనులు జరిగే సమయంలో ట్రాఫిక్ కు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.

శ్రీనివాస్ మృతి పార్టీకి తీరని లోటు : దామోదర్‌రెడ్డి

విశాలాంధ్ర , కాప్రా : సీపీఐ సీనియర్ నాయకులు ఎం. శ్రీనివాస్ అకాల మృతి సీపీఐకి తీరని లోటని సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు జి. దామోదర్‌రెడ్డి అన్నారు. సీపీఐ నాయకులు ఎం. శ్రీనివాస్ పార్థివ దేహంపై సీపీఐ జెండా కప్పి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు జి. దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో ఉన్నటువంటి ఎం. శ్రీనివాస్ నిన్న రాత్రి బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో మరణించారన్నారు. ఈసీఐఎల్ పరిశ్రమ ఏఐటీయుసి కార్మిక రంగానికి 15 ఏళ్లపాటు సేవలు అందించారు. పేదలకు సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఇండ్ల నిర్మాణ కార్యక్రమం చేపట్టినప్పుడు అనేక ఉద్యమాల్లో పాల్గొంటూ ప్రజా సమస్యల పరిష్కారంలో అగ్రభాగాన ఉండేవారన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. సీపీఐ చేపట్టిన అనేక ప్రజా పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొంటూ అంచలంచలుగా ఎదిగినటువంటి నాయకుడు శ్రీ. ఎం. శ్రీనివాస్ , పార్టీ ప్రధాన కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉప్పల్ నియోజకవర్గ సమితి పార్టీ నిర్మాణం, ప్రజాసంఘాల నిర్మాణంలో ప్రధాన భూమిక పోషించారన్నారు. స్థానిక ప్రజల సమస్యల పరిష్కారంలో నిరంతరం పనిచేసినటువంటి వ్యక్తిగా గుర్తుండిపోయారు. పార్టీలో చేరినప్పటి నుంచి దాదాపు 35 సంవత్సరాలుగా సీపీఐ సభ్యుడు గానే అనేక ఆటుపోటులను ఎదుర్కొంటూ, తన కొన ఊపిరి వరకు కొనసాగుతూ వున్నారు, అలాంటి వ్యక్తి అకాల మరణంతో మన మధ్యన లేకపోవడం పార్టీకి తీరని నష్టం, చాలా బాధాకరమని జిల్లా, మండల పార్టీ తీవ్ర సంతాపాన్ని తెలియజేస్తున్నదని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. ఈ సంతాప కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు నారా నరసింహ, ఏఐటీయూసీ నాయకులు సుధాకర్, సీపీఐ నేతలు సాయిలు, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

విశాలాంధ్ర - తుర్కయాంజల్: తుర్కయాంజల్ మున్సిపాలిటీ పరిధిలోని తొర్రూర్ గ్రామంలో రూ.60 లక్షల రూపాయల నిధులతో అభివృద్ధి పనులను మున్సిపల్ చేపట్టిన కమ్యూనిటీ హాల్ పునఃనిర్మాణ పనులను మంగళవారం రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వం కేటాయించిన నిధులు పారదర్శకంగా, నాణ్యతతో వినియోగించబడాలని, నిర్మాణ పనులు నిర్దేశిత సమయంలో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కమ్యూనిటీ హాల్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే గ్రామ ప్రజలకు సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలు నిర్వహించడానికి మౌలిక వసతులు మరింతగా లభిస్తాయని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో సీనియర్ నాయకులు ధనరాజ్ గౌడ్,డిఈ భిక్షపతి, ఏఈ చంద్రశేఖర్ రెడ్డి, వంగెటి గోపాల్ రెడ్డి,స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన వద్దు : అనురాధ

విశాలాంధ్ర - మొయినాబాద్ : రైతులు సాగు చేసిన పంటలకు ప్రభుత్వం ద్వారా అవసరమైన యూరియాను సరఫరా చేస్తుందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయ అధికారి అనురాధ పేర్కొన్నారు. మంగళవారం మొయినాబాద్ మండల రైతు వేదికలో రైతులకు యూరియా కోసం టోకెన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ... రైతులు సాగు చేసుకున్న పంటలకు ప్రభుత్వం ద్వారా యూరియా అసరమైనంత సరఫరా అవుతుందని ఎవరు తొందరపడవద్దు అని సూచించారు. మొయినాబాద్ మండలంలో వరి పంటతో పాటు ఇతర పంటలు పెరిగిపోయాయన్నారు. రైతులు యూరియా కోసం ఆందోళన చెందవద్దు అని మొయినాబాద్ మండలానికి ఇప్పటి వరకు 550 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని సరఫరా చేయడం జరిగిందన్నారు. ఇంకా సరిపోయే అంత యూరియా సరఫరా చేస్తామన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా యూరియా సరఫర చేయడంలో కృషి చేస్తున్నామని ఎవరు ఆందోళన చెందవద్దు అన్నారు. ఈ కార్యక్రమంలో సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్ బాబుకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : నాగర్ కర్నూల్ జిల్లాకు యుద్ధ సామగ్రి కంపెనీని ఏర్పాటుకు అవకాశం కల్పించడం పట్ల ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి మంత్రి శ్రీధర్ బాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంత్రిని శాలువాతో సన్మానించారు. ఈ కంపెనీ ఏర్పాటుతో వందల సంఖ్యలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే అవకాశం రానున్నట్లు తెలిపారు. మంగళవారం ఉదయం హైదరాబాద్ మంత్రుల నివాస సముదాయంలో నాగర్ కర్నూల్ నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనలో భాగంగా ఈఐఎల్ ఆర్మ్స్ అండ్ అమ్యునేషన్ కంపెనీ వారు వారి కొత్త ప్లాంట్‌ను సుమారుగా వెయ్యి కోట్ల ఖర్చుతో నాగర్ కర్నూల్ నియోజకవర్గంలో నెలకొల్పడానికి ముందుకు వచ్చారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే కంపెనీ బృందంతో కలిసి తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రివర్యులు శ్రీధర్ బాబుని కలిసి వారి ప్రాజెక్ట్ గురించి మంత్రికి వివరించారు. ఇంత పెద్ద ప్రాజెక్ట్ తెలంగాణ రాష్ట్రంలో నెలకొల్పడానికి ముందుకు వచ్చినందుకు మాకు చాలా సంతోషం, దాని వెనుక ఉన్న ఎమ్మెల్యే కృషిని మంత్రి అభినందించారు. ప్రభుత్వం తరపు నుంచి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని ఆయన ఈ సందర్భంగా కంపెనీ వారికి హామీ ఇవ్వడం జరిగింది. మంత్రిని కలిసిన వారిలో ఎమ్మెల్యేతో పాటు కంపెనీ డైరెక్టర్లు నరేంద్ర సింగ్, ప్రేమ్, మునవర్ ఖాన్‌లు ఉన్నారు.

ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుల నియామకాలు

విశాలాంధ్ర, బషీర్ బాగ్: తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి ప్రియాంక కక్కర్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలో జిల్లా అధ్యక్షుల నియామకాలు చేపట్టడం జరిగింది. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో, ఆమ్ ఆద్మీ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా నయీం పాషా, నిర్మల్ జిల్లా అధ్యక్షుడిగా సయ్యద్ హైదర్ లకు రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్ నియామక పత్రం అందజేశారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మీయత, సమైక్యతకు ప్రతీక. ఇది కేవలం పూల పండుగ మాత్రమే కాదు, మహిళల సాధికారతకు, సమాజంలో వారి పాత్రకు ప్రతీక'. బతుకమ్మ ప్రకృతి సమతుల్యత, పర్యావరణ పరిరక్షణకు సూచిక. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా యంత్రాంగం తరపున మంగళవారం జిల్లా పంచాయతీరాజ్, ఉద్యానవన, తూనికలు కొలతలు, కార్మిక శాఖలతోపాటు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా హౌజ్ కీపింగ్ వారి ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలలో భాగంగా బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. తెలంగాణ సాంప్రదాయాలు, సంస్కృతి స్ఫురించేలా బతుకమ్మల అలంకరణ, పాటలు, నృత్యాలతో కార్యక్రమం ఉత్సాహభరితంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి ఝాన్సీరాణి, జిల్లా ఎంప్లాయిమెంట్ అఫీసర్ రాధిక, కలెక్టరేట్ మహిళ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రమైన, రుచికరమైన ఆహారం అందించాలి : జీసీ

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : చిన్నారులకు పరిశుభ్రమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలని, ఆట పాటలతో చదువు నేర్పించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా తెలిపారు. పోషణ్ భీ పడాయి భీ ఓరియంటేషన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం శామీర్‌పేట మండలంలోని ఆలియాబాదు అంగన్‌వాడీ సెంటరును అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారులకు పరిశుభ్రమైన పౌష్టికాహారాన్ని అందించాలని వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. చిన్నారులతో ముచ్చటిస్తూ వారి ఆట పాటలను చూస్తూ సంతోషం వ్యక్తం చేసారు. వంట సామాగ్రిని పరిశీలించి, అవసరమైన సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ శారద, అంగన్ వాడీ టీచర్ చిన్నారులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - హైదరాబాద్ : సేవా కార్యక్రమాల్లో ముందు వరుసలో ఉంటూ విద్యా వైద్య రంగంలో అన్నార్హులైన వారికి ఆపన్నహస్తం అందిస్తోంది పాలమూరు రెడ్డిసేవ సమితి. ఇందులో భాగంగానే మంగళవారం స్థానిక భగీరథకాలనీలో నివాసం ఉంటున్న వెంకటరెడ్డి పల్లె గ్రామ వాసి కె. సత్యనారాయణ రెడ్డి అనే వ్యక్తి కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలిసిస్ చేయించుకుంటున్నారు. ఆర్థిక సహాయం కోసం రెడ్డి సేవా సమితిని ఆశ్రయించగా వారికి చికిత్స కోసం సహాయం చేయాలని నిర్ణయించి తన భార్య కె.గిరిజకు రూ. 25,000ల చెక్కును అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షులు తూము ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి వేపూరు రాజేందర్‌రెడ్డి, కోశాధికారి మల్లు నర్సింహారెడ్డి, కార్యదర్శి కోటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మహారాజా శ్రీ అగ్రసేన్ జయంతి

విశాలాంధ్ర, బషీర్ బాగ్ : తెలంగాణ అగర్వాల్ సమాజం మహారాజా శ్రీ అగ్రసేన్ జీ 5149వ జయంతి ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా, నరేంద్ర గోయల్, సురేష్ అగర్వాల్, గోపాల్ మోర్, బద్రివిశాల్ బన్సల్ ఆధ్వర్యంలో జరిగింది. మహారాజా శ్రీ అగ్రసేన్ జీ 5149వ జయంతి వేడుకలకు ముఖ్య అతిథులుగా తెలంగాణ ఐటీ మంత్రి శ్రీధర్ బాబు, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్‌చారి, మాజీ ఎంపీ డాక్టర్ గిరీష్ కుమార్ సంఘి, అర్బన్ కంపెనీ సీఈఓ వరుణ్ ఖైతాన్ హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఐటీ మంత్రి శ్రీధర్ బాబు, అగర్వాల్ సోదరులందరికీ తన పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. 5,000 సంవత్సరాల క్రితం మహారాజా అగ్రసేన్ స్థాపించిన సామాజిక సేవ, సమాజ అభివృద్ధి, ఒక రూపాయికి ఒక ఇటుక అనే సూత్రాలు నేటికీ సంబంధితంగా ఉన్నాయని, మనం అందరినీ వెంట తీసుకెళ్తేనే సమాజం పురోగమిస్తుందన్నారు. వారి సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ, అగర్వాల్ సమాజం దేశ ఆదాయంలో 20 శాతం వాటాను అందిస్తుందన్నారు. అగర్వాల్ సమాజానికి చెందిన వ్యవస్థాపకులు, వ్యాపారవేత్తలు తెలంగాణ ఆర్థిక వృద్ధికి దోహదపడుతున్నారనీ, రాష్ట్ర పురోగతికి సహాయపడటానికి భవిష్యత్తులో పెట్టుబడి పెట్టాలని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ విమానాశ్రయం డిఐజి ఎస్.కె. మోహంకా, కమాండెంట్ ఓం హరి, స్పాన్సర్లు వినోద్ అగర్వాల్, దీపాలి అగర్వాల్, అక్షయ్ పిట్టి, నరేంద్ర గోయల్, రాజేష్ కుమార్ అగర్వాల్, సునీల్ పటోడియా, వివేక్ సింగ్, అనిరుధ్ గుప్తా, వేదిక స్పాన్సర్ కిషన్ అగర్వాల్, సొసైటీ మాజీ అధ్యక్షుడు సలహాదారు బద్రివిశాల్ బన్సాల్, డాక్టర్ అంజని కుమార్ అగర్వాల్, చంద్రకాంత్ దకోటియా పాల్గొన్నారు.

మాల్లో 'సిటీ అండర్ సీజ్' ప్రారంభం

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : నెక్సస్ హైదరాబాద్ మాల్ సిటీ అండర్ సీజ్ పేరుతో సౌత్ ఇండియాలో మొదటిసారి యానిమాట్రానిక్ ఎలియన్స్ ఇన్‌స్టాలేషన్‌తో కస్టమర్లకు సరికొత్త అనుభూతిని అందించనుంది. ఇది అక్టోబర్ 31 వరకు ప్రజలకు అందుబాటులో ఉండనుంది. ఇందులో లైఫ్-సైజ్ ఎలియన్స్, ఎలియన్ ఫ్లోరా, సిటీ స్కైలైన్‌లపై దాడులు, డిస్ట్రక్షన్ జోన్‌లు, ఎలియన్ రైడ్ వంటి వినోద కార్యక్రమాలు కలవు. ఇది ఈ ప్రాంతంలో మొదటిసారిగా కస్టమర్ల ముందుకు వచ్చిన ప్రత్యేక వినోదం. ప్రవేశరుసుం రూ.199 నుంచి రూ.599 మధ్య ఉంది. థీమ్ వర్క్‌షాప్‌లు (ఫేస్ పెయింటింగ్, 'మేక్ యువర్ ఓన్ ప్లానెట్', కీచైన్ మేకింగ్, క్లే పెయింటింగ్, కాన్వాస్ పెయింటింగ్) రూ. 299 నుంచి రూ.699 మధ్య ఉంది. నెక్సస్ హైదరాబాద్ మాల్ 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని 11 రోజుల షాపింగ్ ఫెస్టివల్‌ను ప్రారంభించింది. ఈ ఫెస్టివల్ ఈనెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు ఉంటుంది. కస్టమర్లకు అనేక బహుమతులు సిద్ధంగా వున్నాయి. ఒక లగ్జరీ కార్, 11 స్మార్ట్‌ఫోన్లు, 11 ప్రీమియం వాచీలు, 121 వెండి నాణేలు (10 గ్రాములు, రోజుకు 11), 11 బంగారు నాణేలు (1 గ్రాము, రోజుకు 1), 11 గేమింగ్ హాంపర్లు, 11 హోమ్ సెంటర్ హాంపర్లు కలవు. ఈ పండుగ ఉత్సాహాన్ని పెంచడానికి వినియోగదారులు డైలీ, వీక్లీ, మంత్లీ బంపర్ డ్రాల్లో పాల్గొని పై బహుమతులు గెలుచుకునే అవకాశం ఉంటుంది. అదనంగా గోల్డ్, సిల్వర్, ఎలక్ట్రానిక్స్, యుటిలిటీ గిఫ్ట్‌ వంటి బహుమతులు గెలుచుకోవచ్చు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

విశాలాంధ్ర, మేడిపల్లి: భార్య భర్తల మధ్య గొడవతో భర్త అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముంద్రాయి గ్రామం, కొడగండ్ల మండలం, జనగాం జిల్లాకు చెందిన దారావత్ రాజేష్ (26), భార్య దారావత్ శిరీష వీరికి 2022 జనవరిలో వివాహం అయ్యింది. రాజేష్ సరూర్ నగర్‌లో అమూల్య సిల్క్స్ షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్నాడు. శిరీష బోడుప్పల్‌లో షాపింగ్ మాల్‌లో పనిచేస్తుంది. పెళ్లి అయ్యి ఇన్ని నెలలు అయిన సంతానం కలగడం లేదని వీరిరువురు తరచూ గొడవలు పడుతుండేవారు. ఈ నెల 20న శిరీష డ్యూటీకి వెళ్లగా ఆమె భర్త ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయాడు. భార్య మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని సిఐ గోవింద రెడ్డి తెలిపారు.

అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఉండాలి : కొలన్

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ :అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.విజయదశమి దేవి శరన్న వరాత్రులలో భాగంగా మంగళవారం రెండవ రోజు కుమారి దేవి అమ్మవారు వివాహం కాని వారికి అమ్మవారి అనుగ్రహంతో వారికి పెళ్లి అవుతుందని,కుజ దోష నివారణ జరుగుతుందని ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి,లీడర్ శ్రీ కొలన్ నరసింహారెడ్డి ధర్మపత్ని పద్మమ్మ అన్నారు.నిజాంపేట్ లో వెలసిన పురాతనమైనటువంటి శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం నందు కుమారి దేవి చండీ హోమంలో పాల్గొని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని ఎవరైతే మగ,ఆడ వివాహం కాని వారికి వివాహం జరిగి సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని,కుజదోష నివారణ జరగాలని ఈ యొక్క చక్కనిదైనటువంటి ఆరాధనలో పాల్గొని అమ్మవారిని వారు వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో కొలన్ భద్రారెడ్డి, బొర్రా అశోక్,నిజాంపేట్ గ్రామ పెద్దలు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారిని ఆరాధించుకున్నారు.



విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : 23వ వార్డు పరిధిలో ఉన్న లక్ష్మీ నగర్ కాలనీ సుందరయ్య నగర్ శ్రీ శ్రీ నివాస్ కాలనీ మరియు శ్రీరంగాపురం కాలనీలలో కరెంటు సమస్యలపై డిపార్ట్మెంట్ అధికారులు ఏడి శ్రీనివాసులు, విజయ్ కుమార్, లైన్మెన్ సురేందర్‌రెడ్డి, లైన్ ఇన్స్పెక్టర్ సూర్యకుమార్, జూనియర్ లైన్మెన్ శివకుమార్‌లతో తుర్కయంజాల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ రమావత్ కళ్యాణ్ నాయక్ వారితో కాలనీలో ఉన్న కరెంట్ సమస్యలపై చర్చించడం జరిగింది. అదేవిధంగా లూస్‌లైన్ టైట్ చేసి మిడిల్ పోల్స్ వేసి మెయిన్‌రోడ్‌లో ఉన్న రెండు పోలు స్తంభాలను తొలగించడం, వివిధ సమస్యలు త్వరగా పరిష్కారం చేయాలనీ కోరారు. అధికారులు సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందనీ ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లోకాలనీ వాసులు పాల్గొన్నారు.

మరమ్మతు పనులు త్వరగా పూర్తిచేయాలి : అశోక్‌రెడ్డి

విశాలాంధ్ర, హైదరాబాద్ : వనస్థలిపురం ఓల్డ్ బాంబే- విజయవాడ హైవే వద్ద ధ్వంసమైన 900 ఎంఎం డయా ఆర్ సీసీ సీవర్ ట్రంక్ మెయిన్ పైప్ లైన్ అత్యవసర మరమ్మతుల పనులను జలమండలి ఎండీ అశోక్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని అధికారులతో చర్చించారు. జలమండలి చేపట్టే మరమ్మతులు పైపు లైన్ విస్తరణ పనులు పూర్తయిన వెంటనే.. రోడ్డు మరమ్మతు పనులు నిర్వహించాలని ఆదేశించారు. సోమవారం సీవర్ లైన్‌పై సుమారు 20 అడుగుల లోతులో కుంగిపోవడంతో వెంటనే స్పందించిన జలమండలి అధికారులు మరమ్మతు పనులు పనులను ప్రారంభించారు. ఈ భారీ సీవర్ ట్రంక్ మెయిన్ దాదాపు 25 సంవత్సరాల క్రితం జీహెచ్‌ఎంసీ నిర్మించింది. అనంతరం 2021లో ఈ ప్రాంత సీవరేజ్ నిర్వహణ జలమండలికి అప్పగించారు. ఈ సీవర్ లైన్ దెబ్బతినడంతో, గాంధీనగర్, స్నేహమయినగర్, పివిఆర్ కాలనీ, పద్మావతి కాలనీ, వీరాంజనేయ కాలనీ, సామా నగర్, శారదా నగర్, శాంతినగర్, తెలంగాణ పద్మావతి కాలనీల పరిధిలోని సుమారు 5 కిమీ మేర అప్‌స్ట్రీమ్ సీవర్ లైన్‌లో చొకేజీ ఏర్పడి, స్థానిక చెరువులు పొంగిపోవడం, మురుగునీటి సమస్య తలెత్తింది. ఈ సందర్భంగా ఎండీ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, అలాగే రహదారిలో పూడుకుపోయిన ట్రంక్ మెయిన్ సంబంధించిన మాన్‌హోళ్లను గుర్తించాలని అధికారులకు ఆదేశించారు. భవిష్యత్ లో ఇలాంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉండే ప్రాంతాలను గుర్తించి ఇలాంటి సంఘటనలు నివారించాలని సూచించారు. గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్ హైవే క్రాసింగ్ వద్ద మురుగు సమస్యను ఎండీ అశోక్ రెడ్డి పరిశీలించారు. సాగర్ కాంప్లెక్స్ వద్ద త్రిమలానగర్, శ్రీశ్రీ హోమ్స్, మధురా నగర్, మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి వచ్చే మురుగు నీరు కలిసిపోవడంతో వర్షాకాలంలో స్థానికంగా మురుగు సమస్యలు ఏర్పడుతున్నాయి. ఈ పరిస్థితిని నివారించేందుకు, వర్షపు నీరు సీవరేజ్‌లో కలిసిపోకుండా గ్యాప్‌వర్క్ తక్షణమే చేపట్టాలని ఎండీ అధికారులను ఆదేశించారు. ఓఅండ్‌ఎం, ఎస్టీపీ, ప్రాజెక్టు అధికారులు అందరూ సమన్వయంతో సీవరేజ్ నేరుగా మూసీలో చేరకుండా స్థానిక ఎస్టీపీ కి మళ్లించి, శుద్ధి చేసేలాగా పైప్ లైన్ ల ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి సీజీఎం నాగేందర్, జిఎంలు బలరామరాజు, మహేందర్ నాయక్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

అక్రమ కేసులకు భయపడేదిలేదు : కిషన్‌రెడ్డి

విశాలాంధ్ర - తుర్కయాంజల్: అక్రమ కేసులు, అరెస్టులకు నాయకులు, కార్యకర్తలు భయపడవద్దని, ఇలాంటి చర్యలు మానుకోకపోతే త్వరలో ప్రజలే బుద్ధి చెప్పడం ఖాయమనీ మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. ప్రజల తరపున స్థానిక ఎమ్మెల్యేని, ముఖ్యమంత్రిని ప్రశ్నించగా అక్రమ కేసుకు గురైన ఇంజాపూర్ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు బొక్క మురళీధర్ రెడ్డిని నాయకులు, కార్యకర్తలతో కలిసి మంచిరెడ్డి కిషన్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ప్రజాప్రతినిధులే ప్రజల తరపున ప్రశ్నించే గొంతులను నొక్కి ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకుడు బొక్క మురళీధర్ రెడ్డికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సత్తు వెంకటరమణారెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, కందాడ లక్ష్మారెడ్డి, బొక్క గౌతంరెడ్డి, ఆనంద్ రెడ్డి, జోర్కని రాజు, రొక్కం చంద్రశేఖర్ రెడ్డి, కళ్యాణ్ నాయక్, సంజీవరెడ్డి, గుండ్ల రాజిరెడ్డి, కొంద్రు శ్రీనివాస్, కాకుమాను చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

దసరా నవరాత్రి ఉత్సవాలు

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: శేర్లింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని గౌలిదొడ్డి గ్రామంలోని పోచమ్మ-ఎల్లమ్మ దేవాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాల తొలి రోజు అమ్మవారి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బాల త్రిపుర సుందరి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చి ఆహ్లాదపరిచారు. గ్రామస్తులు, భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం పూలతో, దీపాలతో శోభాయమానంగా అలంకరించబడగా, భక్తులతో సందడిగా మారింది. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో, దేవాలయ అధ్యక్షులు జంగయ్య యాదవ్ సారథ్యంలో ఈ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రతిరోజూ ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలతో అమ్మవారి దర్శనం భక్తులకు కల్పించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర -కొత్తూరు: గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడ మృతి చెందిన సంఘటన కొత్తూరు మున్సిపల్ కేంద్రంలోని బైపాస్ రోడ్డుపై మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. కొత్తూరు పోలీస్ స్టేషన్ కి చెందిన కానిస్టేబుల్ శివరంజన్, డ్రైవర్ పవన్ లు రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా తెల్లవారు జామున పెంజర్ల జంక్షన్ బైపాస్ రోడ్డు నుండి తిమ్మాపూర్ వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తి (65) తీవ్ర గాయాలతో రోడ్డు పక్కన పడి ఉన్నాడు. గమనించిన పోలీసులు దగ్గరికి వెళ్లి చూడగా గుర్తు తెలియని వాహనం అతనిని ఢీ కొట్టి పైనుంచి వెళ్లడంతో నడుము, కుడుకాలికి తీవ్ర గాయాలై అక్కడి కక్కడే మృతి చెందినట్లు వివరించారు. శివరంజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సిఐ నరసింహారావు తెలిపారు.

ప్రతిష్టాత్మక మైలురాయిని చేరుకున్న అపోలో హాస్పిటల్స్ గ్రూప్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆరోగ్య సంరక్షణలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి చేస్తోన్న తమ ప్రయాణంలో ఒక ప్రతిష్టాత్మక మైలురాయి విజయాన్ని చేరుకున్నట్లుగా అపోలో హాస్పిటల్స్ గ్రూప్ నేడు వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఉన్న అపోలో జీనోమిక్స్ ఇన్‌స్టిట్యూట్‌ల ద్వారా 11,000 కంటే ఎక్కువ జెనోమిక్ కన్సల్టేషన్ లతో కౌన్సెలింగ్, చికిత్సలను అందించింది. ముంబై, ఢిల్లీ, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, అహ్మదాబాద్ మరియు కోల్‌కతాతో సహా భారతదేశంలోని పన్నెండు కీలక నగరాల్లో తమ కార్యకలాపాలను అపోలో జీనోమిక్స్ ఇన్స్టిట్యూట్స్ విస్తరించాయి. ఈ

విజయంపై అపోలో హాస్పిటల్స్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ ప్రీత రెడ్డి మాట్లాడుతూ మేము జన్యుశాస్త్రంతో ఆరోగ్య సంరక్షణ పరంగా విప్లవాత్మక మార్పులు చేయడంలో గణనీయమైన విజయాలను వేడుక జరుపుకుంటున్నామన్నారు. దాదాపు 11,000 కంటే ఎక్కువ జీనోమిక్ కన్సల్టేషన్లు చేయటమన్నది క్లినికల్ ప్రాక్టీస్‌లో అత్యాధునిక జన్యు పరిజ్ఞానంను మిళితం చేయటం యొక్క లోతైన ప్రభావాన్ని నొక్కి చెబుతుంది. మేము ఆరోగ్య సంరక్షణను వ్యక్తిగతీకరించిన నివారణ పరమైన రీతిలో చేయడానికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. అందరికీ మెరుగైన ఫలితాలకు భరోసా అందిస్తూ జీనోమిక్ పరీక్షలను అందుబాటులోకి తీసుకురావడం , ప్రామాణిక ఆరోగ్య సంరక్షణలో అంతర్భాగంగా మలచటం మా లక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సోహా అలీ ఖాన్, అపోలో హాస్పిటల్స్ గ్రూప్ మెడికల్ డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ పీడియాట్రిక్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ - హెపటాలజిస్ట్ డాక్టర్ అనుపమ్ సిబల్, నవీ ముంబైలోని అపోలో హాస్పిటల్స్‌లో క్లినికల్ జెనెటిస్ట్ డాక్టర్ క్షితిజ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర, హైదరాబాద్ : హైదరాబాద్ నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా ఫేజ్-2 లో కలబ్ గూర్ నుంచి హైదర్ నగర్ వరకు ఉన్న 1500 ఎంఎం డయా పీఎస్సీ పంపింగ్ మెయిన్‌కు వివిధ ప్రాంతాల్లో భారీ లీకేజీలు ఏర్పడ్డాయి. ఈ లీకేజీలను అరికట్టేందుకు 24 బుధవారం ఉదయం 6 గంటల నుంచి గురువారం ఉదయం 6 గంటల వరకు మరమ్మతు పనులు చేపట్టనున్నారు. ఈ 24 గంటలు కింద పేర్కొన్న కొన్ని ప్రాంతాల్లో లో ప్రెజర్‌తో నీటిసరఫరా, మరికొన్ని ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలుగుతుంది.

అంతరాయం ఏర్పడే ప్రాంతాలు:

ఓ అండ్ ఎం డివిజన్ 17 - ఆర్సీ పురం, అశోక్ నగర్, జ్యోతి నగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, మదీనాగూడ, మియాపూర్., ఓ అండ్ ఎం డివిజన్ 22 - బీరంగూడ, అమీన్ పూర్., ట్రాన్స్ మిషన్ డివిజన్ 2 - ఆఫ్ టేక్ పాయింట్స్, బల్క్ కనెక్షన్లు., ఓ అండ్ ఎం డివిజన్ 6 - ఎర్రగడ్డ, ఎస్.ఆర్.నగర్, అమీర్ పేట్., ఓ అండ్ ఎం డివిజన్ 9 - కేపీహెచ్ బీ కాలనీ, కూకట్ పల్లి, భాగ్యనగర్ కాలనీ, ప్రగతి నగర్., పైన పేర్కొన్న ప్రాంతాల వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోగలరని జలమండలి అధికారులు కోరారు.

మోసగించడంలో అరికెపూడి ఘనుడు

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీపై బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ ఆక్రమణలపై వస్తున్న ఆరోపణలు నిజమేననేలా అరికెపూడి గాంధీ వ్యవహరిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సైతం దొంగలకు సహకరిస్తూ, పేదలకు కూడు, గూడు లేకుండా చేస్తుందన్నారు. గాజులరామారంలోని భూ ఆక్రమణలపై కాంగ్రెస్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడంలో వెనకాడటం వెనుక మతలబేంటీ..? అని ప్రశ్నించారు. పేదలు కట్టుకున్న ఇండ్లను కూల్చిన హైడ్రా, ఆ భూమి పక్కనే శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఆక్రమించినట్లుగా వస్తున్న సర్వే నెంబర్ 307ని భూములపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గాంధీ అని మహాత్ముడి పేరు పెట్టుకొని.. చేసేది అక్రమాలు, ఆక్రమణలా..? అని ప్రశ్నించారు. ప్రజలు గెలిపిస్తే పార్టీ మారి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అక్రమాస్తులను కాపాడుకునేందుకు పార్టీ మారారా..? అని ప్రజలు చర్చించుకుటున్నారని వెల్లడించారు. ప్రజలను, పార్టీలను మోసగించడంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఘనుడిగా కీర్తించబడుతున్నారని స్పష్టం చేశారు. ప్రజలకు జవాబు చెప్పాల్సిన బాధ్యత ఎమ్మెల్యే అరికెపూడి గాంధీపై ఉందన్నారు. పేదల తరుపున ఎప్పుడూ అండగా ఉంటూ వస్తున్నది కేవలం బీఆర్ఎస్ మాతమేనన్నారు. కేసీఆర్ పాలనలో ఏ ఒక్క పేదవారికి అన్యాయం జరగకుండా కేసీఆర్ శ్రీరామ రక్షగా నిలిచారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాయకత్వంలో త్వరలోనే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలపై, అక్రమాలపై పోరాటం సాగిస్తామని రవీందర్ యాదవ్ స్పష్టం చేశారు.

గుండె వ్యాధులపై నిరంతరం అప్రమత్తత అవసరం

హైదరాబాద్: భారతదేశంలో గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని, గుండు సంబంధిత వ్యాధులపై నిరంతరం జాగ్రత్త వహించాలని ప్రముఖ గుండె వైద్య నిపుణులు, టచ్ హాస్పిటల్స్ కార్డియాలజీ వైద్యులు డాక్టర్ బి. రాజేష్ సూచించారు. ఈ మేరకు గుండె సంబంధిత వ్యాధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై ఏర్పాటుచేసిన సదస్సులో ఆయన మాట్లాడుతూ గుండె వ్యాధులు ముఖ్యంగా యువతలో ఈ సమస్య ఆందోళన కలిగించే స్థాయిలో ఉందన్నారు. వైద్య చికిత్సలు అభివృద్ధి చెందినప్పటికీ, గుండెను రక్షించుకోవడం వంటగది నుంచే మొదలవుతుందని చెబుతున్నారు. రోజువారీగా మన ప్లేట్‌లో ఉండే పండ్లు, కూరగాయలు, సంపూర్ణ ధాన్యాలు, తక్కువ కొవ్వు ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఇవే

గుండె ఆరోగ్యాన్ని కాపాడుతాయా లేదా నిశ్శబ్ద ఒత్తిడిలో పెడతాయా అనే దానిని నిర్ణయిస్తా యన్నారు. మంచి ఆరోగ్యానికి జీవనశైలి మార్పులు అవసరమని చెప్పారు. 2025లో గుండె ఆరోగ్యానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన రెండు ప్రధాన ఆహార విధానాలు ఉన్నాయన్నారు. డైటరీ అప్రోచెస్ టు స్టాప్ హైపర్ టెన్షన్ (డాష్) అనే విధానం పాటించాలన్నారు. డైట్ మెడిటరేనియన్ డైట్ రెండూ సంపూర్ణ ఆహారాలపై ఆధారపడి ఉన్నప్పటికీ, దృష్టికోణంలో తేడాలు ఉన్నాయన్నారు. డాష్ కఠినంగా అమలయ్యే విధానం, సోడియం (ఉప్పు)ని నియంత్రించడం, తక్కువ కొవ్వు పాలు, పప్పులు, సంపూర్ణ ధాన్యాలు, చికెన్ వంటి ప్రోటీన్లను ఉపయోగించడం దీని ముఖ్య లక్షణాలు అని, మరొక వైపు మెడిటరేనియన్ డైట్‌లో ఆలివ్ నూనె, చేపలు, గింజలు, పండ్లు, కూరగాయలు ప్రాధాన్యం పొందుతాయన్నారు. దీనిలో కుటుంబంతో కలసి భోజనం చేయడం, శారీరక శ్రద్ధ, తగినంత నిద్ర వంటి జీవనశైలికి సంబంధించిన అంశాలు కూడా భాగం అని చెప్పారు."పోషణం అనేది కేవలం కాలరీల గురించి కాదని, ఇది శరీరంలోని సంకేత మార్గాలు, ఇన్ఫ్లమేషన్ నియంత్రణ, దీర్ఘకాల అవయవ సంరక్షణ అవసరమన్నారు. ప్రణాళిక చేసిన ఆహారం కేవలం కొన్ని వారాల్లోనే రక్తపోటు తగ్గించగలదని, ఎల్ డీ ఎల్ కొలెస్ట్రాల్ తగ్గిస్తుంది, మెదడు ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుందన్నారు. దక్షిణ భారత రోగులకు స్థానిక ఆహార పదార్థాలు మునగ ఆకులు, కరివేపాకు, సజ్జ, రాగి, తాజా చేపలు వీటిని డాష్ డైట్ మరియు మెడిటరేనియన్ డైట్ కలిపి తీసుకోవాలని డాక్టర్ బి. రాజేష్ సూచించారు.

సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ కోర్సులపై అవగాహన

విశాలాంధ్ర, బషీర్ బాగ్: హిందీ ప్రచారసభ హైదరాబాద్, యూత్ ఎడ్యుకేషన్ ఎంప్లాయిమెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబర్ 5న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్న ఫ్యాషన్ డిజైన్, బ్యూటీషియన్, మగ్గం వర్క్ తదితర సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ కోర్సులపై ఉచిత అవగాహన శిబిరానికి సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. హిందీ ప్రచార సభ హైదరాబాద్ అధ్యక్షుడు ప్రొఫెసర్ చంద్రదేవ్ కావ్డే, జనరల్ సెక్రటరీ ఎస్. గైబువల్లి చేతుల మీదుగా పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా హిందీ ప్రచార సభ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ ఎస్.గైబువల్లి మాట్లాడుతూ ఫ్యాషన్ డిజైన్, బ్యూటీషియన్, మగ్గం వర్క్ తదితర సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ కోర్సుల శిక్షణపై ఆసక్తి గల అభ్యర్థులు అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవగాహన సదస్సులో సెల్ఫ్‌ఎంప్లాయిమెంట్ కోర్సుల వివరాలు, శిక్షణ వివరాలను ప్రముఖ ట్రైనర్లచే అవగాహన కల్పిస్తామని తెలిపారు. వివరాలకు 9381755509, 9676705763 సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రొ.సురేష్ పురీ, ఏ.కే. రాజు, నామ్ దేవ్ వాగ్మాడే, శివలింగం, మాయపాండే, వినోద్ కుమార్ రెడ్డి, ప్రేమ, హారిక, మృదుల జైస్వాల్, డా.పూజా జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ బ్రాండ్ల కొత్త వినియోగం

Rukam Capital

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: స్వదేశీ బ్రాండ్ల పట్ల ఒక కొత్త గర్వభావం వినియోగదారులు పట్టణాలు మరియు నగరాలలో, ముఖ్యంగా హైదరాబాద్‌లో, కొనుగోలు నిర్ణయాలను తీసుకునే విధానాన్ని ప్రభావితం చేస్తోంది. సగానికి పైగా ప్రతిస్పందకులు వారు స్వదేశీ, చిన్న వ్యాపార బ్రాండ్ల నుండి షాపింగ్ చేయడాన్నే ఇష్టపడుతున్నారని చెప్పారు. అందుబాటు, అనుభూతికి దగ్గరగా ఉండే కథలు, నిజమైన విలువ ఇవన్నీ వారి నిబద్ధతకు ముఖ్య కారణాలుగా పేర్కొన్నారు. ప్రాథమిక దశ వినియోగదారుల బ్రాండ్లను మద్దతు ఇస్తున్న వెంచర్ క్యాపిటల్ సంస్థ, భారతీయ వినియోగదారుల మారుతున్న ప్రవర్తన, అభిరుచులు, కొనుగోలు డ్రైవర్లను విశదీకరించే ఒక సమగ్ర అధ్యయనాన్ని విడుదల చేసింది. మార్కెట్లో మారుతున్న ధోరణులను ప్రదర్శించడం లక్ష్యంగా పెట్టుకుంది. తద్వారా బ్రాండ్లు, స్టార్టప్‌లు, ఇన్వెస్టర్లు భారతీయ వినియోగదారుల అభివృద్ధి చెందుతున్న దృష్టికోణానికి అనుగుణంగా మారేందుకు ఇది దోహదపడుతుంది. ఈ పరిశోధన ఒక యువ, ఆశయపరమైన, ప్రపంచ దృక్కోణాన్ని కలిగి ఉన్నప్పటికీ, స్థిరత్వం, నిజాయితీ, మరియు కమ్యూనిటీ పట్ల లోతైన అవగాహనతో ఉన్న భారతదేశం యొక్క ఆత్మను ప్రతిబింబిస్తుంది. ఇది నాణ్యతలో రాణించే, సామాజిక కారణాలను ప్రోత్సహించే స్థానిక బ్రాండ్లకు వినియోగదారులు అదనంగా చెల్లించడానికి సిద్ధంగా ఉన్నారని కూడా స్పష్టం చేస్తోంది. ఇది సమాజ అభ్యున్నతికి కృషి చేస్తున్న స్టార్టప్‌ల ఆకర్షణను మరింతగా బలపరుస్తోంది.

డాబర్ ఇండియా ఉచిత ఆరోగ్య శిబిరాలు

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: సమగ్ర ఆరోగ్యానికి తన నిబద్ధతను అద్భుతంగా ప్రదర్శిస్తూ, సైన్స్ ఆధారిత ఆయుర్వేదంలో అగ్రగామి అయిన డాబర్ ఇండియా లిమిటెడ్, జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని జరుపుకోవడానికి హైదరాబాద్‌తో సహా భారతదేశం అంతటా 153 ఉచిత ఆరోగ్య శిబిరాలను విజయవంతంగా నిర్వహించింది. ఆయుర్వేద ప్రయోజనాలను ప్రోత్సహించడానికి మరియు ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆయుర్వేద దినోత్సవానికి నిర్ణయించిన తేదీని జరుపుకోవడానికి అనుగుణంగా డాబర్ చేస్తున్న ప్రయత్నాలలో ఈ దేశవ్యాప్త చొరవ ఒక భాగం, ఇటీవల భారత ప్రభుత్వం నోటిఫై చేసింది. స్థానిక ఆయుర్వేద వైద్యులు మరియు సంస్థల సహకారంతో జరిగిన ఈ చొరవ వేలాది మందికి ఉచిత సంప్రదింపులు, ఆరోగ్య పరీక్షలను అందించింది. జీవనశైలి వ్యాధుల నిర్వహణ మరియు మొత్తం శ్రేయస్సును సాధించడానికి ఆయుర్వేద సూత్రాలను వారి రోజువారీ దినచర్యలలో చేర్చడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు అవగాహన పెంచడం ఈ శిబిరాల లక్ష్యం. శిబిరాలలో అర్హత కలిగిన ఆయుర్వేద వైద్యులు ఆహారం, జీవనశైలి మరియు మూలికా నివారణలపై వ్యక్తిగతీకరించిన సలహాలను అందించారు. అదనంగా, పాల్గొనేవారు ఎంపిక చేసిన డాబర్ ఉత్పత్తుల ఉచిత నమూనాలను అందుకున్నారు.

కొండకల్ శంకర్ గౌడ్ వర్ధంతి

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: తెలంగాణ రాష్ట్ర మలి దశ ఉద్యమకారులు, అప్పటి శేరిలింగంపల్లి ఇంచార్జి, తన రాజకీయ గురువులు కీ.శే. కొండకల్ శంకర్ గౌడ్ 11 వ వర్ధంతి సందర్భంగా నేడు ఖాజాగూడ లోని గచ్చిబౌలి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శేరిలింగంపల్లి సీనియర్ నాయకుల, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్‌కొమిరిశెట్టి సాయిబాబా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అంజమ్మ, రమేష్ గౌడ్, శామ్లెట్ శ్రీనివాస్, బాలమణి, తాహెర్ ,మాధవి ,బురాన్ తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల నిర్వహణలో కేంద్రం విఫలం

- వరద బాధిత రాష్ట్రాల్లో సహాయక చర్యలు చేపట్టాలి
- నష్టాలు, పరిహారంపై శ్వేతపత్రం విడుదల చేయాలి: సీపీఐ డిమాండ్

(చండీగఢ్ నుంచి ఏబీ కూన)

ఇటీవల పంజాబ్ రాష్ట్రంలో వర్షాలు, వరదలకు తీవ్రంగా నష్టపోయిన ప్రజలకు సీపీఐ తమ ప్రగాఢ సానుభూతిని తెలిపింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంజాబ్‌తోపాటు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి విపత్కర పరిస్థితులను ప్రజలు ఎదుర్కొన్నారని, వారందరికీ తగిన సాయం అందించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ విమర్శించింది. ఈ విపత్తులు ప్రకృతిసిద్ధమైనవే అయినప్పటికీ, మానవ తప్పిదాలు కూడా ఉన్నాయని, బీజేపీ ప్రభుత్వ విధాన నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నదని పేర్కొంది. ఈ మధ్యకాలంలో పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, హర్యానా, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, రాజస్థాన్, జమ్మూకశ్మీర్, అసోంలలో విపత్తులకు 500 మందికిపైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, మానవతా సంక్షోభం మరింత తీవ్రతరమైందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇళ్లు, మౌలిక సదుపాయాలు విస్తారంగా నాశనమయ్యాయని, 10 లక్షల ఎకరాల్లో పంట నీటిపాలయిందని, పశువులు పెద్దసంఖ్యలో మరణించాయని, అత్యవసర సేవలు మృగ్యమయ్యాయని తెలిపింది. పర్యావరణ రక్షణ, విపత్తుల నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యం ఎప్పటికప్పుడు కన్పిస్తూనే ఉన్నదని, ఆనకట్టల నిర్వహణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ విఫలమయ్యాయని పేర్కొంది. ఇటీవల మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన ది డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (సవరణ) చట్టం-2025ను చట్టపరమైన నేరంగా సీపీఐ అభివర్ణించింది. 'నష్టపరిహారం' అనే పదం తొలగించి, దాని స్థానంలో 'సాయం' అనే పదాన్ని చేర్చారు. నష్టపరిహారం అంటే కచ్చితంగా ఇచ్చితీరాలి. సహాయం అంటే ఇవ్వాలని ఏమీ లేదు. అంటే ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పించుకోవడం ప్రజాస్వామ్యంలో అసహేతుక విషయమని సీపీఐ విమర్శించింది. పంజాబ్ వరదల్లో రాష్ట్రం రూ.25,000 కోట్లు నష్టపోగా, మోదీ ఏరియల్ సర్వే చేసి కేవలం రూ.1600 కోట్లు ఇస్తామని చెప్పడం కంటితుడుపు చర్య అని పేర్కొంది. పంజాబ్, ఇతర రాష్ట్రాల్లో జరిగిన ప్రకృతి విపత్తులను జాతీయ విపత్తుగా పరిగణించాలని పార్టీ డిమాండ్ చేసింది. ప్రజా వ్యతిరేక డిజాస్టర్ సవరణ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, నష్టపోయిన ప్రతి కుటుంబానికి రూ.లక్ష పరిహారం చెల్లించాలని, ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున చెల్లించాలని, మోదీ ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత పదేళ్లలో సంభవించిన విపత్తుల్లో జరిగిన నష్టం, ప్రభుత్వం అందించిన పరిహారం వివరాలపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసింది.

పలస్తీనా, క్యూబాకు సంఘీభావం

పలస్తీనా, క్యూబాలకు సంఘీభావం ప్రకటిస్తూ సీపీఐ రెండు వేర్వేరు తీర్మానాలను ఆమోదించింది. ప్రతినిధుల సభ ప్రారంభమైన తర్వాత ఆయా దేశాల రాయబారుల సమక్షంలో మహాసభలు ఆమోదించిన తొలి తీర్మానాలివే. ఇజ్రాయిల్ మానవ విధ్వంసక ప్రక్రియను అమెరికా సాయంతో నిరంతరాయంగా సాగిస్తున్నదని, దీని వల్ల వేలాది మంది పలస్తీనీయులు ప్రాణాలు కోల్పోతున్నారని, పలస్తీనా ప్రదేశం మొత్తాన్ని యూదు ప్రాంతంగా మార్చేందుకు జరుగుతున్న కుట్రలో భాగమే ఇదని సీపీఐ పేర్కొంది. చమురు, ఆయుధ విక్రయం అనే ప్రయోజనాలు అమెరికాకు అదనంగా ఉన్నాయని, భారత ప్రభుత్వం కూడా తన చారిత్రక నిబద్ధతలో భాగంగా పలస్తీనాకు సంఘీభావం ప్రకటించాలని కోరింది. మొదట్నించీ పలస్తీనా స్వాతంత్ర్య పోరాటానికి భారత్ అండగా ఉంటూ వస్తున్నదని, అయితే అమెరికాకు మోకరిల్లిన మోదీ ప్రభుత్వం ఈ విషయంలో తటస్థంగా ఉండటం సహించరానిదని తెలిపింది. గాజా విధ్వంసకాండలో ఇప్పటికే దాదాపు 65 వేల మంది పలస్తీనీయులు మరణించగా, 1,60,000 మంది క్షతగాత్రులయ్యారని గుర్తుచేసింది. ఇజ్రాయిల్ మారణకాండను ఆపడానికి ఐరాస చర్యలు చేపట్టాలని, అమెరికా యుద్ధోన్మాదాన్ని ప్రపంచదేశాలు ఖండించాలని కోరింది. అలాగే, క్యూబా ప్రజల వీరోచిత పోరాటాలను, నిబద్ధత గల నాయకత్వాన్ని సీపీఐ కొనియాడింది. అమెరికా ఎన్నిరకాల ఆంక్షలు విధించినా, మొక్కవోని ధైర్యంతో నిలబడిన క్యూబా చరిత్ర అసామాన్యమైనదని పేర్కొంది. క్యూబా సార్వభౌమత్వాన్ని సీపీఐ ఎల్లప్పుడూ గౌరవిస్తుందని, ఆ దేశ ప్రజలకు సంఘీభావం అందించడంలో ముందుంటుందని తెలిపింది.

16వ కేంద్ర ఆర్థిక సంఘంలో పుదుచ్చేరిని చేర్చాలి

కేంద్రప్రభుత్వం పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతాన్ని పక్కకు విసిరేసిన ప్రాంతంగా పరిగణిస్తున్నదని, ఇంత వివక్ష ఏ కేంద్ర పాలిత ప్రాంతం విషయంలోనూ జరగడం లేదని సీపీఐ అభిప్రాయపడింది. వచ్చే 16వ కేంద్ర ఆర్థిక సంఘంలో పుదుచ్చేరిని కూడా చేర్చాలని డిమాండ్ చేస్తూ మహాసభ తీర్మానం చేసింది. ఆర్థిక సంఘంలో చేర్చకపోవడం వల్ల సెంట్రల్ పూల్ నుంచి రూ.1500-2000 కోట్ల వరకూ పుదుచ్చేరి నష్టపోతున్నదని పేర్కొంది.

ప్రపంచ కమ్యూనిస్టు పార్టీల శుభాకాంక్షలు

కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి నగర్ (చండీగఢ్): సీపీఐ 25వ జాతీయ మహాసభలు పురస్కరించుకొని, వివిధ దేశాలకు చెందిన కమ్యూనిస్టు, సోషలిస్టు పార్టీలు భారత కమ్యూనిస్టు పార్టీకి శుభాకాంక్షలు తెలిపాయి. సౌహార్ద్ర సందేశాలు పంపించిన కమ్యూనిస్టు పార్టీల్లో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఆస్ట్రేలియా, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ బంగ్లాదేశ్, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ బ్రిటన్, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ బ్రెజిల్ (సీపీడీఓబీ), కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చిలీ, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ క్యూబా, ఏకేఈఎల్ ఆఫ్ సైప్రస్, కమ్యూనిస్టు ఆఫ్ కేటలోనియా, చెక్ కమ్యూనిస్టు పార్టీ, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ రినైసాన్స్ పోల్ ఇన్ ఫ్రాన్స్, జర్మన్ కమ్యూనిస్ట్ పార్టీ (డీకేపీ), కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ గ్రీస్, టుడే పార్టీ ఆఫ్ ఇరాన్, వర్కర్స్ పార్టీ ఆఫ్ ఐర్లాండ్, జపనీస్ కమ్యూనిస్టు పార్టీ, కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్) కెన్యా, వర్కర్స్ పార్టీ ఆఫ్ కొరియా (డీపీఆర్‌కే), లావో పీపుల్స్ రివల్యూషనరీ పార్టీలు ఉన్నాయి.

'దాదాసాహెబ్ ఫాల్కే' అందుకున్న మోహన్‌లాల్

'బలగం', 'హనుమాన్'కు జాతీయ అవార్డులు

రాష్ట్రపతి చేతులమీదుగా చలనచిత్ర అవార్డుల ప్రదానం

న్యూదిల్లీ: 71వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవం దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం ఘనంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము విజేతలకు పురస్కారాలతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. 2023 ఏడాదిగానూ కేంద్ర ప్రభుత్వం ఉత్తమ చిత్రాలు, ఉత్తమ నటులు, సాంకేతిక విభాగాల్లో ప్రతిభ కనబర్చిన నటీ నటులు, సినిమాలను ఎంపిక చేసి... విజేతలను ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా వారందరికీ విజ్ఞాన్ భవన్ వేదికగా పురస్కారాలు అందజేశారు. యానిమేషన్ విజువల్స్, గేమింగ్ అండ్ కామిక్ విభాగంలో ఉత్తమచిత్రంగా హనుమాన్ చిత్రానికి నేషనల్ అవార్డు వచ్చింది. ఈ చిత్రానికి యానిమేషన్స్, విజువల్ ఎఫెక్ట్స్ చేసిన వెంకట్ కుమార్, దర్శకుడు ప్రశాంత్ వర్మ, నిర్మాత నిరంజన్ రెడ్డి రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. అలాగే ఇదే సినిమాకు స్టంట్ డైరెక్షన్-స్టంట్ కొరియోగ్రఫీ విభాగంలోనే ఉత్తమఅవార్డు రాగా... ఈ మేరకు రాష్ట్రపతి చేతుల మీదుగా స్టంట్ కొరియోగ్రాఫర్ యూ పృథ్వీ, కన్నన్ నందురాజ్ అవార్డు అందుకున్నారు. తెలుగులో ఉత్తమ చిత్రంగా నందమూరి బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరి సినిమా ఉత్తమ చిత్రంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. ఈ అవార్డును ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి అందుకున్నారు. ఇక ఉత్తమ చైల్డ్ ఆర్టిస్టుగా ప్రముఖ దర్శకుడు సుకుమార్ కూతురు సుకృతి వేణి తొలి జాతీయ అవార్డును అందుకుంది. గాంధీ తాత చెట్టులో సినిమాలో ఆమె కనబర్చిన అద్భుతమైన నటనకు గానూ జాతీయ అవార్డు వరించింది. బలగం సినిమాకు గానూ 'ఊరు పల్లెటూరు' అనే పాటకు ఉత్తమ గేయ రచయితగా కాసర్ల శ్యామ్ జాతీయ అవార్డు అందుకున్నారు. తెలంగాణ సంస్కృతి, కుటుంబ బంధాల నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలతో పాటు బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించింది. ఈ సినిమాకు వేణు ఎల్దండి దర్శకత్వం వహించాడు. జాతీయ ఉత్తమ నటుడి అవార్డును షారుక్‌ఖాన్ (జవాన్), విక్రాంత్ మస్సే (12వ తరగతి ఫెయిల్), ఉత్తమ నటీ అవార్డును రాణీ ముఖర్జీ (మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే) స్వీకరించారు. ఇదే వేడుకలో ప్రతిష్టాత్మక దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును మోహన్‌లాల్‌కు ప్రదానం చేశారు. బేబీ సినిమాకు ఉత్తమ్ స్క్రీన్ ప్లే కు గాను దర్శకుడు సాయి రాజేష్, బెస్ట్ మేల్ ప్లే బ్యాక్ సింగర్‌గా ప్రేమిస్తున్నా...పాటకు పీవీఎన్ఎస్ రోహిత్ అవార్డులు అందుకున్నారు.

రాజధానిలో రీజనల్ ఆఫీసులు పెట్టండి

- రాష్ట్ర ప్రాజెక్టుల్లో భాగస్వాములుకండి
- బ్యాంకుల చైర్మన్లు, ఎండీలను కోరిన సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమరావతిలో రీజనల్ ఆఫీసు ప్రారంభించాలని, అలాగే రాజధానిలో చేపట్టే వివిధ ప్రాజెక్టుల్లో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వివిధ బ్యాంకుల చైర్మన్లు, ఎండీలను కోరారు. లోక్‌సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ సమావేశంలో భాగంగా విజయవాడ వచ్చిన అనేక బ్యాంకుల చైర్మన్‌లు, ఎండీలకు మంగళవారం క్యాంపు కార్యాలయంలో సీఎం హైటీ విందు ఇచ్చారు. రాష్ట్రంలో చేపడుతున్న ప్రాజెక్టుల గురించి వారికి వివరించారు. అమరావతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా నిర్మిస్తున్నందున విస్తృత అవకాశాలు అందిపుచ్చుకోవాలని అన్నారు. ఇప్పటికే వివిధ బ్యాంకులకు రాజధానిలో స్థలాలు కేటాయించిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. 15 నెలల కాలంలో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, కేంద్ర సహకారంతో చేపట్టిన ప్రాజెక్టుల గురించి వారికి తెలిపిన ముఖ్యమంత్రి... పోర్టులు, ఎయిర్ పోర్టులు, హార్బర్లు, జాతీయ రహదారులు, క్వాంటం వ్యాలీ తదితర పనుల పురోగతిని వివరించారు. ఈ సమావేశానికి మంత్రులు పయ్యావుల కేశవ్, పి.నారాయణ, ఎంపీ బాలశౌరి, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరయ్యారు. అలాగే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్ శ్రీనివాసులు శెట్టి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామ సుబ్రమణ్యన్, బ్యాంక్ ఆఫ్ బరోడా ఎండీ దేవదత్త చంద్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఎండీ అశోక్ చంద్ర, ఇండియన్ బ్యాంక్ ఎండీ బినోద్ కుమార్, బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ రజనీష్ కర్నాటక్, కెనరా బ్యాంక్ ఎండీ సత్యనారాయణ రాజు, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ సీఎండీ పరమేందర్ చోప్రా, ఐఆర్‌డీఏఐ చైర్ పర్సన్ అజయ్ సేత్, నేషనల్ ఇన్సూరెన్స్ చైర్మన్ రాజేశ్వరీ సింగ్ ముని, ఎల్ఐసీ ఎండీ సత్పాల్ భాను, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ సీఎండీ భూపేష్ సుశీల్ రాహుల్, ఓరియంటల్ ఇన్సూరెన్స్ సీఎండీ సంజయ్ జోషి, అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా ఈడీ సంజయ్ లాల్లా తదితరులు పాల్గొన్నారు.

మండవ మృతిపై చంద్రబాబు సంతాపం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నూజివీడు సీడ్స్ లిమిటెడ్ వ్యవస్థాపకులు మండవ వెంకటరామయ్య మృతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతాపం వ్యక్తం చేశారు. కొంత కాలంగా అస్వస్థతతో బాధపడుతున్న ఆయన ఏలూరు జిల్లా తుక్కులూరులోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయన కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సానుభూతి తెలిపారు. వెంకటరామయ్య నూజివీడు సీడ్స్‌ను స్థాపించి ప్రైవేటు విత్తన రంగంలో దేశంలోనే మేటి సంస్థగా నిలిపారని కొనియాడారు. రైతు బలం-దేశ బలం అని వ్యవసాయ రంగానికి ఎంతో సేవ చేసిన ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.

కోర్టులు డబ్బు రికవరీ ఏజెంట్లు కాదు: సుప్రీం

న్యూదిల్లీ: కోర్టులు డబ్బులు రికవరీ చేసే ఏజెంట్లు కాదని సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. సివిల్ వివాదాలను క్రిమినల్ కేసులుగా మార్చే ధోరణిపై అసహనం వ్యక్తం చేసింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ కేసు విచారిస్తూ ఈ విధంగా స్పందించింది. డబ్బు రికవరీ వంటి సివిల్ వివాదంలో అరెస్ట్‌ను ఒక సాధనంగా ఉపయోగించకూడదని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ఆ వివాదంలో కిడ్నాప్ అభియోగాలు మోపడంపై ఆందోళన వ్యక్తం చేసింది. క్రిమినల్ చట్టాన్ని దుర్వినియోగం చేస్తోన్న ధోరణిని ఇది ప్రతిబింబిస్తోందని వ్యాఖ్యానించింది. జస్టిస్ డెలివరీ సిస్టమ్‌కు ఈ కేసు తీవ్ర ముప్పు అని పేర్కొంది. 'బకాయిల మొత్తాన్ని వసూలు చేయడానికి కోర్టులేమీ రికవరీ ఏజెంట్లు కావు. న్యాయవ్యవస్థ దుర్వినియోగాన్ని అనుమతించబోం' అని తేల్చిచెప్పింది. అరెస్టులు చేసే ముందు తమవద్దకు వచ్చిన కేసు క్రిమినలా? సివిలా? అని పోలీసులు సరిగా పరిశీలించాలని సూచించింది. ఇలాంటి కేసులు పోలీసుల్ని క్లిష్ట పరిస్థితుల్లోకి నెట్టివేస్తాయని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్ అంగీకరించారు. కొన్ని సందర్భాల్లో అలాంటి గందరగోళం ఉంటుందన్న సుప్రీం ధర్మాసనం... సివిల్ వివాదాల్లో వేధింపుల సాధనంగా క్రిమినల్ చట్టాలను ఉపయోగించకుండా నిరోధించేందుకు తెలివిగా వ్యవహరించాలని సూచించింది.

దద్దరిల్లిన ధర్నాలు

- నిరుద్యోగ సమస్యలపై ఏఐవైఎఫ్ ఆందోళన
- కలెక్టర్లకు వినతుల వెల్లువ
- నిరుద్యోగ భృతి, ఎన్నికల హామీల అమలు
- ఏఐవైఎఫ్ నేతల డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: 'నిరుద్యోగ సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి... సూపర్ సిక్స్‌లో పేర్కొన్న నెలకు రూ.మూడువేల నిరుద్యోగ భృతితోపాటు ఎన్నికల హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) చేపట్టిన ధర్నాలు దద్దరిల్లాయి. సమాఖ్య రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా మంగళవారం వివిధ జిల్లాల్లో నిరుద్యోగులతో కలిసి ఏఐవైఎఫ్ శ్రేణులు కలెక్టరేట్ల ఎదుట ధర్నాలకు దిగారు. అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న పోస్టులపై శ్వేతపత్రం విడుదల చేసి... ఎన్నికల హామీ మేరకు జాబ్ క్యాలెండరు ప్రకటించి... ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని నిరుద్యోగులు, నేతలు నినదించారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌ల్యాగ్ పోస్టులు భర్తీ చేయాలని, ప్రభుత్వ విద్యా సంస్థల్లో బోధన, బోధనేతర పోస్టులు భర్తీ చేయాలని, గ్రామ/వార్డు వలంటీర్ వ్యవస్థను పునరుద్ధరించి వారికి ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు వలంటీర్ల విద్యార్హత ఆధారంగా వారికి ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో ప్రాధాన్యత కల్పించాలన్న డిమాండ్లతో ఏఐవైఎఫ్ ఆందోళనకు దిగింది. అనంతరం ఆయా జిల్లాల కలెక్టర్లకు వినతులు అందజేశారు. అనంతపురం జిల్లాలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గుండాల సంతోశ్‌కుమార్, ఎన్టీఆర్ జిల్లా విజయవాడ కలెక్టరేట్ వద్ద జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంకా గోవిందరాజులు, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కార్యాలయం దగ్గర నిరసనలో రాష్ట్ర సహాయ కార్యదర్శి కోన శ్రీనివాస్ నాయకత్వం వహించారు. గుంటూరులో జిల్లా ఏఐవైఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు జంగాల చైతన్య షేక్ వలి, నెల్లూరులో జిల్లా కార్యదర్శి మున్నా, ప్రకాశంజిల్లాలో రాష్ట్ర సహాయ కార్యదర్శి పూతల ప్రభాకర్, నంద్యాలలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జి నాగరాముడు, తిరుపతిలో జిల్లా కార్యదర్శి రామకృష్ణ, అన్నమయ్యజిల్లాలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్ జక్కుల వెంకటేశ్ సారథ్యంలో నిరసనలు చేపట్టారు. అనంతపురం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసనలో ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి శ్రీనివాస్, అనకాపల్లిలో జిల్లా కార్యదర్శి వియ్యపురాజు, పల్నాడుజిల్లాలో జిల్లా నాయకులు కె.మల్లికార్జున నాయకత్వం వహించారు. సత్యసాయిజిల్లా పుట్టపర్తిలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఏలూరుజిల్లా కలెక్టరేట్ వద్ద ఏఐవైఎఫ్ జిల్లా కో-కన్వీనర్ తొర్లపాటి రాజు నేతృత్వంలో ధర్నా చేపట్టి..కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సత్యసాయి ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరుద్యోగ యువత అర్ధనగ్నంగా ధర్నాకు దిగి తమ ఆవేదనను వ్యక్తం చేసింది. ఏఐవైఎఫ్ నేతలు మాట్లాడుతూ..ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వేలాది పోస్టులపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేసి, ఆ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగులకు నెలకు రూ.మూడువేల భృతి తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్న తరుణంలో ప్రత్యేక మంత్రివర్గ సంఘం ఏర్పాటు చేసి, నిరుద్యోగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. యువత భవిష్యత్తును నిర్లక్ష్యం చేస్తే పెద్ద ఎత్తున ఉద్యమాలు తప్పబోవని ఏఐవైఎఫ్ నేతలు హెచ్చరించారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరగదు

- మంత్రి లోకేశ్ హామీ
- మండలిలో వాడివేడి చర్చ

విశాలాంధ్ర-సచివాలయం: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ జరగదని మంత్రి నారా లోకేశ్ పునరుద్ఘాటించారు. ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సమావేశాలు మంగళవారం అత్యంత వాడివేడిగా, నాటకీయ పరిణామాల మధ్య సాగాయి. రాష్ట్రానికి గుండెకాయ వంటి విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ అంశం అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర చర్చకు దారితీసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రవేశ పెట్టిన ఓ కీలక తీర్మానం సభలో సంచలనం సృష్టించగా, ప్రతిపక్ష వైసీపీని ఇరకాటంలో పడేసింది. అనూహ్యంగా, ఆ తీర్మానానికి వైసీపీ మద్దతు తెలపడం చర్చనీయాంశంగా మారింది. విశాఖ స్టీల్ ప్లాంట్ కు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడం ద్వారా ప్రైవేటీకరణను విజయవంతంగా అడ్డుకున్నందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామికి అభినందనలు తెలుపుతూ, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ మంత్రి నారా లోకేశ్ మండలిలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించి, రాష్ట్ర ప్రయోజనాల పట్ల ఐక్యతను చాటాలని ఆయన కోరారు. అయితే, ఈ సమయంలో జోక్యం చేసుకున్న వైసీపీ సభ్యులు, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ దిశగా కేంద్రం ఇంకా అడుగులు వేస్తోందంటూ తీర్మానాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీనిపై మంత్రి లోకేశ్ తీవ్రంగా స్పందించారు. "విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని మేం వందసార్లు చెప్పాం. అయినా మీకు స్పష్టత లేదా? ప్రైవేటీకరణ ఆగిపోయిందని మీరే చెబుతూ, మళ్లీ మీరే సభను తప్పుదోవ పట్టిస్తారా?" అని నిలదీశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలన వైఫల్యాలను ఎత్తిచూపుతూ లోకేశ్ విమర్శలు గుప్పించారు. "మా ప్రభుత్వం వచ్చిన తర్వాత స్టీల్ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని దాదాపు 80 శాతానికి తీసుకువచ్చాం. మీ హయాంలో అది 48 శాతానికి పడిపోయింది. రూ.25 వేల కోట్ల అప్పులు మిగిల్చారు. అలాంటి మీరు మాట్లాడతారా? మేం సొంత కేసుల కోసం దిల్లీ వెళ్లడం లేదు. దేశ ప్రయోజనాల కోసమే ఎన్డీయేకు బేషరతుగా మద్దతు ఇస్తున్నాం. కేంద్రంతో గొడవలు పెట్టుకోం, చర్చల ద్వారానే సమస్యలు పరిష్కరిస్తాం" అని లోకేశ్ స్పష్టం చేశారు. తాను ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆమోదిస్తున్నారా, లేదా వ్యతిరేకిస్తున్నారా? అని ప్రశ్నించారు. చివరకు వైసీపీ ప్రభుత్వ తీర్మానానికి మద్దతు ప్రకటించింది. మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. "స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు ఎవరు ప్రయత్నించినా మా సంపూర్ణ సహకారం, మద్దతు ఉంటాయి" అని తెలిపారు. అయితే విశాఖ స్టీల్ పరిరక్షించాలంటూ వైసీపీ సొంతంగా ఓ తీర్మానాన్ని సభ ముందుకు తీసుకురాగా, దానిని అధికార పక్షం అసందర్భంగా అభివర్ణించింది. "మేం ఇప్పటికే స్టీల్ ప్లాంట్‌ను పునరుద్ధరించే పనిలో ఉన్నాం. ఆరు నెలల కిందట రాసుకున్న డ్రాఫ్ట్‌ను ఇప్పుడు తీసుకువచ్చి ప్రయోజనం ఏంటి?" అని లోకేశ్ ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష నేత బొత్స మాట్లాడుతూ... విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకూడదనేదే వైసీపీ విధానమని స్పష్టం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కు ప్యాకేజీ ఇచ్చారు కానీ ఒక్క ఉద్యోగి కైనా ఒక్క బకాయి తీర్చారా అంటూ ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకూడదనేదే వైసీపీ విధానమన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయబోమని కూటమి తరపున నేతలు ప్రకటించడం అభినందనీయమన్నారు. దీంతో చైర్మన్ రెండు తీర్మానాలను పరిగణనలోకి తీసుకున్నట్లు ప్రకటించారు.

అసెంబ్లీలో నవ్వులు పూయించిన చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: శాసనసభలో మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన ఒక సరదా వ్యాఖ్యతో సభ నవ్వులతో నిండిపోయింది. వైద్యారోగ్య శాఖపై జరుగుతున్న చర్చలో ఆయన చేసిన చమత్కారానికి డిప్యూటీ స్పీకర్‌తో సహా సభ్యులందరూ పగలబడి నవ్వారు. వైద్యారోగ్య శాఖపై చర్చలో సీఎం చంద్రబాబు ప్రజల ఆహారపు అలవాట్ల గురించి మాట్లాడారు. "మనిషి ఆయుర్దాయం 120 ఏళ్లు. కానీ మనం 40 ఏళ్లకే 120 ఏళ్లకు సరిపడా ఆహారాన్ని తినేస్తున్నాం" అని చెబుతూ...ఒక్కసారిగా సభాధ్యక్షస్థానంలో ఉన్న ఉప సభాపతి రఘురామకృష్ణరాజు వైపు చూశారు. నవ్వుతూ..'అధ్యక్షా, ఇది మీకు కూడా వర్తిస్తుంది!' అనడంతో సభలో ఒక్కసారిగా నవ్వులు విరిశాయి. ఈ అనూహ్య వ్యాఖ్యకు ఉప సభాపతి రఘురామ కూడా నవ్వు ఆపుకోలేకపోయారు. గతంలో కొందరు పోలీసులు పొట్టలు పెంచుకోవడం చూసి, తగ్గించుకోమని వాళ్లకు స్పష్టం చేశానని చంద్రబాబు వెల్లడించారు. అంతేకాదు తన వైద్యులు కూడా ఇలాగే కనిపించారని...దాంతో "డాక్టర్లే పేషెంట్లయితే ఎలా? డాక్టరుగా నువ్వు నాకు ట్రీట్ మెంట్ ఇవ్వడం కాదు, ముందు నీకు నువ్వు ట్రీట్ మెంట్ ఇచ్చుకో" అని చెప్పేవాడినని చంద్రబాబు గుర్తుచేసుకున్నారు.

సీహెచ్‌సీల్లో సౌకర్యాలకు రూ.550 కోట్లు

మంత్రి సత్యకుమార్ యాదవ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో(సీహెచ్‌సీ) మౌలిక సదుపాయాల కల్పనకై 16వ ఆర్థిక సంఘం నుంచి సుమారు రూ.550 కోట్ల మేర నిధులొచ్చే అవకాశముందని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు ఆర్థిక శాఖకు లేఖ రాశామని చెప్పారు. శాసన సభలో మంగళవారం లఘు చర్చలో భాగంగా పలువురు సభ్యులు లేవనెత్తిన అంశాలపై మంత్రి ఈ విషయం తెలిపారు. గతంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో డాక్టర్ల కొరత తీవ్రంగా ఉందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక పెద్ద ఎత్తున నియామకాలు చేపట్టిందన్నారు. దాదాపు 2,600 సిబ్బందిని నియమించడంతో ఇప్పుడు పరిస్థితిలో మార్పు వచ్చిందని తెలిపారు. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద దాదాపు రూ.600 కోట్లతో 24 క్రిటికల్ కేర్ బ్లాకుల్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని, 14 దాకా పూర్తిగా కావొచ్చాయని, మరో 10 శంకు స్థాపన చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో ప్రధానమంత్రి ఆయుష్మాన్ ఆరోగ్య యోజన కింద 61 లక్షల కుటుంబాలు అర్హత కలిగి ఉన్నాయన్నారు. వీరికి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.ఐదు లక్షల వరకు సహకారం అందుతుందన్నారు. స్టాఫ్ నర్సుల నియమాకాల్లో సీహెచ్‌ఓ లకు వెయిటేజ్ ఇస్తామని సభ్యులు జయనాగేశ్వరరెడ్డి అడిగిన మరో ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. 'రాష్ట్రంలో 9,640 మంది కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు విలేజ్ హెల్త్ క్లినిక్కులలో పనిచేస్తున్నారు. వీరికి నెలకు వేతనం కింద రూ.25 వేలు చెల్లిస్తున్నాం. పనితీరు ప్రతిపాదికన మరో రూ.15వేల వరకు ప్రోత్సాహకంగా చెల్లింపులు జరుగుతున్నాయని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో వైద్యుల పోస్టుల భర్తీకి అధిక ప్రాధాన్యతనిస్తున్నామని, తాము అధికారంలోకొచ్చిన అనంతరం గిరిజన ప్రాంతాల్లోని 153 పీహెచ్‌సీలకు కలిపి 306 సివిల్ అసిస్టెంటు సర్జన్ పోస్టులు మంజూరయ్యాయి. ఇందులో ఖాళీగా ఉన్న 138కు 131 పోస్టుల (90 శాతం)ను గత ఐదు నెలల్లో భర్తీ చేశాం. ప్రస్తుతం 31 పోస్టులు (10 శాతం) ఖాళీగా ఉన్నాయి. వీటి భర్తీకి కూడా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.